ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 460

వెల : రూ.25/-

జూలై 2023



జనసాహితి ప్రచురణ

CHAMPS'

Commitment Confidence Competence Control Character

# CA-FOUNDATION
# CA-INTER
# CA-FINAL

# Why CHAMPS ??

- Because CHAMPS' follows Scientific Methodology to deliver the right knowledge to students keeping their level of understanding and requirements of the course in mind.
- Because CHAMPS' covers 100% syllabus Conceptually and Logically.
- Because CHAMPS' is the place where Quality matters over Quantity.
- Because CHAMPS' takes Limited Number of Students per batch, We look after the unique requirements of every student and guide accordingly.
- Because CHAMPS' conducts Regular Tests and shows the path of improvement to Every Student.




# CONCEPTS=RESULTS

## If you know WHY then You know HOW !

**Toll Free**
**1800 419 7272**

# 11-6-865, 1st & 2nd Floor,
Beside New Pragati Offset,FTCCI Marg,
Red Hills, Lakdi-Ka-Pul, Hyderabad - 500 004
**www.champsindia.net**

జనసాహితి ప్రచురణ

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

460

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 46
సంచిక : 12
జూలై 2023

## ఈ సంచికలో...

website : www.prajaasaahithi.com


| | | | | |
|---|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : | ప్రస్తుత విద్యావ్యవస్థ – కార్టూన్ | అంతర్జాలం నుండి | .....01 |
| ✦ రెండవ అట్ట | : | ఛాంప్స్ ప్రకటన | | .....02 |
| ✦ మూడవ అట్ట | : | జర్నలిస్టు తులసిచందుపై మతోన్మాద శక్తుల కిరాయి మూకల రాతలను, | | |
| ✦ నాల్గవ అట్ట | : | | బెదిరింపులను ఖండిద్దాం | .....44 |
| ✦ సంపాదకీయం | : | ప్రజాతంత్రయుత విద్యావ్యవస్థ కోసం ఉద్యమిద్దాం! | | .....05 |
| ✦ కథలు | : | కన్యాశుల్కానికి అవతల | – ఎ. మన్మథరావు | .....07 |
| | : | తనదాకా వస్తే | – బుర్రా సాయిబాబు | .....09 |
| ✦ పుస్తక పరిచయం | : | ఎమిలీ జోలా 'జర్మినల్' | – జి.వి. భద్రం | .....10 |
| ✦ సంస్మరణ | : | పుస్తక మణికి జోహార్లు | – పినాకిని | .....18 |
| | : | మణి – తానొక మణి, తన అంగడొక మణి | – తిక్కవరపు సుకుమార్‌రెడ్డి 'ఓ–' | .....21 |
| ✦ ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (11) భీష్మ సాహ్నీ నవల 'తమస్' | – కొత్తపల్లి రవిబాబు | .....23 |
| ✦ వ్యాసం | : | ఒరిస్సా రైలు ప్రమాద దుర్ఘటనపై | – ప్రసన్న | .....27 |
| ✦ ముందుమాట | : | 'వెర్రిపడగలు' 2వ ముద్రణకు | – జనసాహితి | .....34 |
| ✦ వ్యంగ్యం | : | యాగం | – శంకరం | .....29 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : | కుమారన్ ఆశాన్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....30 |
| ✦ సినిమా సమీక్ష | : | 'జోయ్ ల్యాండ్' (2022) | – బాలాజీ (కోల్‌కతా) | .....31 |
| ✦ వాణిజ్య ప్రకటన | : | శ్రీ నాగార్జున డిగ్రీ కాలేజి | | .....29 |
| ✦ కవితలు | : | దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (**06**); పుష్యమిత్ర ఉపాధ్యాయ్, సుంకర గోపాల్ (**38**); తమ్మినేని అక్కిరాజు (**39**) | | |
| ✦ వివిధ | : | కృతజ్ఞతలు (**33**); ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**41**); ఖండన ప్రకటనలు (**28, 37**) వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**36**); చైతన్యవాహిని (**40**); ఈ పుస్తకాలు అందాయి (**42**) | | |
| ✦ సంతాపాలు | : | కామ్రేడ్ ఏసు, బి. చార్వాక (**04**), ఇంతియాజ్ అహ్మద్ (**20**), మణి బుక్‌స్టాల్ మణి (**42**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు** **ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
*0680101004936*
*IFSC No. CNRB0000680*
ఫోన్ : 94901 96890

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి


ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |


ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రికపంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# కామ్రేడ్ హక్కుల ఏసుకు జోహార్లు



ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు కామ్రేడ్ ఏసు తన 74వ యేట విజయవాడలో 15-06-2023న గుండెపోటుతో మరణించారు. కమ్యూనిస్టు రాములు కుమారునిగా ఆయన తన తండ్రి అడుగుజాడలలో ప్రజాపక్షపాతిగా అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు.

ఏసు విజయవాడలో ఒక కళాశాల కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసి రిటైరయ్యారు. జనసాహితి సంస్థ ఆవిర్భావానికి ముందు విజయవాడలో ఏర్పడిన 'ప్రజాకళాసంస్థ'కు కన్వీనర్‌గా పనిచేసి వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జనసాహితి ఏర్పడినప్పటి నుండి జరిగిన అనేక కార్యక్రమాలకు సహాయ సహకారాలందించారు. విజయవాడలో జరిగిన సభలన్నింటిలో వక్తగానూ, ప్రేక్షకుడిగానో పాల్గొనేవారు. ప్రజాసాహిత్యాన్ని, 'ప్రజాసాహితి' పత్రికను తనకు తెలిసినవారందరికీ పరిచయం చేసేవారు. ఓ.పి.డి.ఆర్. ఏర్పడిన తర్వాత దానిలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసి పలు స్థానిక, జాతీయ నిజనిర్ధారణ కమిటీలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఏసుగారు లేని నిరసన, ఆందోళన కార్యక్రమాలు లేవంటే అతిశయోక్తి కాదు. చనిపోయేనాటికి రెండు తెలుగు రాష్ట్రాల ఓపిడిఆర్‌కి అధ్యక్షులుగా పనిచేస్తున్నారు.

క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం, కలుపుగోలుతనం ఆయన పని విధానంలో వుండేవి. కామ్రేడ్ ఏసు మరణానికి జనసాహితి సంతాపాన్ని ప్రకటిస్తోంది. ఆయన కుటుంబ సభ్యుల బాధను పంచుకుంటోంది.

# నాస్తికవాది బి. చార్వాక మరణం



**చార్వాకాశ్రమ** నిర్వాహకులలో ఒకరైన బొడ్డు చార్వాక తన 49వ యేట 11-06-2023న అకాల మరణం చెందారు. ఆయన 7 ఆగస్టు 1974న జన్మించారు. నాస్తిక ఉద్యమ నాయకుడు, రచయిత అయిన బి. రామకృష్ణ చిన్న కుమారుడే చార్వాక.

చిన్ననాటి నుండి శాస్త్రీయ భావాలను నేర్చుకొని, చార్వాకాశ్రమం సిద్ధాంతాలను ప్రచారం చేస్తూ, వివిధ కార్యక్రమాలలో క్రియాశీలంగా చార్వాక కృషి చేశారు. చార్వాకాశ్రమ విలువలకు కట్టుబడి జీవించారు. ఆయన ప్రాథమిక వైద్యం నేర్చుకొని చార్వాకాశ్రమ చుట్టుప్రక్కల వున్న పల్లెలలో, గ్రామాలలో వైద్యం చేసేవారు. పేద రోగులకు మందులు ఉచితంగా ఇచ్చేవారు. సేవాదృక్పథం మూర్తీభవించిన చార్వాక మానసిక అనారోగ్యంతో బాధపడుతూ బలవన్మరణం చెందారు.

ఆయన అకాల మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. కుటుంబసభ్యుల బాధను పంచుకుంటోంది.

## సంపాదకీయం

# ప్రజాతంత్రయుత విద్యావ్యవస్థ కోసం ఉద్యమిద్దాం!

**భౌతిక** వనరులకే కాదు, మానసిక వికాసానికీ మూలం ప్రజల శ్రమశక్తే. భౌతిక వనరుల శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు పెరగటానికీ, మానసిక వికాసానికి విద్యారంగం పటిష్టంగా రూపొందాలి.

బ్రిటిష్ వలస పాలనలో విద్యారంగంలో ప్రవేశపెట్టిన పరాధీన భావజాలం నేటికీ కొనసాగుతోంది. రాజ్యం, మతాన్ని ఊతకర్రగా తీసుకుంది. ప్రజల్ని నిజమైన అర్థంలో చైతన్యవంతులు కాకుండా కుహనా విద్యా విలువలను పెంచి పోషిస్తూంది. ఇప్పటివరకూ దేశంలో కొనసాగిన విద్యావిధానాలన్నీ ఆర్థిక సామాజిక అంతరాలను, కర్మ, విధిరాత వంటి మూఢనమ్మకాలను, బలపరిచినవే. వందల సంవత్సరాల నాటి రాచరిక భూస్వామ్య వ్యవస్థలు నిర్వహించిన గురుకులాలన్నీ అగ్రవర్ణ పునాదిగానే నడిచాయి. ఇవన్నీ సంకుచిత రాజకీయ, ఆర్థిక, మత ప్రయోజనాల కోసం నిర్వహింపబడ్డాయి. శ్రామిక ప్రజల ప్రయోజనాలను కాపాడే విద్యా విధానం నేటికీ రూపొందలేదు.

జ్ఞానం అనే పేరుతో అజ్ఞానాన్ని వ్యాప్తిచేస్తూ ప్రజలను నిరంతరం చైతన్యరహితంగా ఉంచే విద్యా విధానాన్నే ఈనాటికీ మన దళారీ దోపిడీ పాలకవర్గాలు కొనసాగిస్తున్నారు. అధికారంలో ఉన్న పాలకులందరూ అశాస్త్రీయ పాఠ్యాంశాలనూ, కార్యకారణ ఆలోచన విధానాన్ని దెబ్బతీసే మూఢనమ్మకాలనూ పెంచి పోషిస్తున్నారు. పరోక్ష అనుభవాలే తప్ప, ప్రత్యక్ష అనుభవాలతో సమన్వయించుకునే బోధనాభ్యాస విధానాలకు అవకాశం కల్పించటంలేదు. బ్రిటీషువాడు ప్రవేశపెట్టిన విద్యావిధానపు అంతిమ లక్ష్యమైన బానిస భావాలతో అణిగిమణిగి ఉండే పరాధీన వ్యక్తిత్వాలను రూపొందించడమే కొనసాగుతుంది. పిల్లల భావావేశాలను విద్యాలయాలూ, పాఠ్యాంశాలూ, పరీక్షలూ అస్సలు పట్టించుకోవటంలేదు. బడి బయట ఉన్న టీవీలూ, సినిమాలూ, సెల్‌ఫోన్లూ, నేరస్థ – అశ్లీల విషసంస్కృతిని విచ్చలవిడిగా వెదజల్లే అదుపులేని అంతర్జాల మాయాజాలాలూ, క్రికెట్ లాంటి క్రీడల జూదం, పిల్లలమీద తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచ వాణిజ్య మార్కెట్ సంస్కృతిని కేంద్ర, రాష్ట్ర పాలకులు అమలుపరుస్తున్నారు. సుహృద్భావాన్ని, సమష్టితత్వాన్ని, సామాజిక విలువలని అందించలేకపోగా అనారోగ్యకరమైన, అవాంఛితమైన పోటీ తత్వంతో నెగ్గాలనుకునే వ్యక్తిత్వాలను ఈ విద్యా విధానం రూపుదిద్దుతున్నది. పోటీలో గెలిచేది ఒక్కడే. మిగిలిన నెగ్గుకు రాలేని వారంతా, ఓటమికి, నిరాశానిస్పృహలకు, ఈర్ష్య అసూయలకు, నేరస్థ ఉద్వేగాలకు, ఆత్మ న్యూనతలకు బలైపోతున్నారు. ఎంతో విలువైన సామాజిక సంపద అయిన విద్యార్థి యువతరపు ప్రాణశక్తి ఈ సుడిగుండాలలో కొట్టుమిట్టాడుతోంది. అసలు పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో దేశానికి కళ్ళు, కాళ్ళు అయిన విద్యార్థి యువతరం ఉస్సురని ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమైనది. చదువుల కోసం అప్పులపాలై, లోన్ యాప్‌లకు చిక్కుకుని, దిక్కుతోచని యువతరం రోజురోజుకీ పెరుగుతోంది. విద్యారంగం ఉపాధి హామీని ఇవ్వటంలేదు.

గడిచిన 9 ఏళ్లలో బిజెపి నియంతృత్వ పాలన మతతత్వ పోకడలు దేశాన్ని మధ్యయుగాలకంటే ఇంకా వెనక్కి నెడుతున్నాయి. ఈ విధానాల వల్ల విద్యారంగం కాషాయీకరించబడి, చరిత్ర, విజ్ఞానం, రాజ్యాంగ హక్కులు మొదలైన అంశాలలో కోలుకోలేనంతగా దేశాన్ని ధ్వంసం చేస్తున్నారు. నియంతృత్వ రాజకీయ పాలన ద్వారా, అప్రకటిత అత్యవసర పరిస్థితులను కల్పించి, ప్రజాస్వామిక లౌకిక విలువలను రద్దు చేస్తున్నారు. ఉపా లాంటి చట్టాల ద్వారా ప్రశ్నించే చైతన్యాన్ని చీకటి గదుల్లోకి నెట్టి, అర్ధరాత్రి పాలనను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఆదివాసీలు, మహిళలు, దళితులు, ముస్లిం ప్రజానీకం మీద చూపిస్తున్న వివక్ష, హంతక దాడులతో – బుల్డోజింగ్ చేసుకుంటూ ఆహార విహార విషయాలలో కూడా ఆంక్షలూ నిషేధాలను అమలు చేస్తున్నారు. నాటి కాశ్మీరు, నేటి మణిపూరు ఇలా ఎటు చూసినా మతాలు, తెగల మధ్య, తగాదాలుగా కనిపిస్తున్న అంశాల వెనక లక్షల ఎకరాల భూ ఆక్రమణ, సహజవనరుల తరలింపు వ్యూహాలు ఉన్నాయి. ఇందుకోసం మతతత్వ శక్తులను రెచ్చగొడుతున్నారు. తన తోటి హిందూ ప్రజానీకం మీద కూడా దాడులు చేయిస్తున్నారు. ప్రశ్నించలేని తరాన్ని తయారు చేయడానికి విద్యాలయాల్లో వైజ్ఞానిక, చారిత్రక పాఠ్యాంశాలను విచక్షణారహితంగా రద్దు చేసుకుంటూ పోతున్నారు. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని రద్దు చేయడం ద్వారా నేటి ఆధునిక వైజ్ఞానిక వైద్య రంగాల ప్రగతిని అడ్డుకుంటున్నారు. మూలకాల ఆవర్తన పట్టికను సిలబస్ నుండి తొలగించడం ద్వారా ఒకవైపు శాస్త్రవేత్తల అపారమైన కృషినీ, మరోవైపు ప్రజలు తమ జీవన పోరాటాల నుండి, సంఘర్షణ నుండి, జ్ఞానాన్ని ఆవిష్కరిస్తారన్న విషయాన్ని విద్యార్థులకు అందకుండా చేస్తున్నారు. 1989లో శాస్త్ర విజ్ఞాన ప్రచారం కోసం ప్రారంభింపబడి, అతి తక్కువ కాలంలో విశేషమైన కృషి చేసిన 'విజ్ఞాన ప్రసార' సంస్థను ఈ జూలై ఆఖరులో మూసివేసి అజ్ఞాన యుగాన్ని ఆవిష్కరించాలను కుంటున్నారు. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ద్వారా వైజ్ఞానికరంగంలో, వైద్య విద్యారంగంలో 72 అవార్డులను రద్దు చేసి, మతతత్వ మూర్ఖ సమాజాన్ని రూపొందించబోతున్నారు. దేశ ప్రగతిశీల, పురోగామి శక్తులను అడ్డుకోవడం ద్వారా ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని గుహాంతర అంధకారంలోకి నెడుతున్నారు. మత పునరుద్ధరణ మూర్ఖత్వంతో

వర్తమానాన్ని కొంత గందరగోళం పెట్టగలరేమో గాని, కాలం ఎప్పుడూ వెనక్కి నడవదు. అందుకే అడ్డగోలుగా మార్పులు చేసిన సిలబస్‌కి తాము బాధ్యత వహించలేమంటూ, ప్రగతిశీల, ప్రజాస్వామిక దృక్పథం కలిగిన విద్యావేత్తలు పాఠ్యపుస్తకాల రచయితలుగా తమ పేర్లను తొలగించాలంటూ లేఖలు రాసారు.

దేశ సంపదలనే కాదు, విజ్ఞాన సంపదను కూడా నూతన విద్యా విధానం పేరు మీద ధనిక వర్గాలకు ధారపోసే ఎత్తుగడలు సాగుతూనే ఉన్నాయి. పేద మధ్యతరగతి వర్గాలలో మట్టిలో మాణిక్యాల లాంటి కోట్లాది బడుగు వర్గాల పిల్లలను కారు చౌక కూలీలుగా, తమ అభివృద్ధి యజ్ఞంలో సమిధలుగా చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వ బడులను మూసివేసి, ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను తరలిస్తున్నారు. ఈ విధానాల ఫలితంగా పేద పిల్లలకు చదువును అందని ద్రాక్ష పండు చేసే విద్యా సంస్కరణలు జరుగుతున్నాయి. ఆఖరికి 98 మంది పిల్లలు ఉన్న పాఠశాలలో సబ్జెక్టు టీచర్లను నియమించలేమని స్పష్టంగా ప్రకటించుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజల వ్యతిరేకతను చూసి, వెనక్కి తగ్గింది.

ప్రస్తుత విద్యావిధానం వల్ల తల్లితండ్రులకు పిల్లల భవిష్యత్తు పట్ల ఆందోళన పెరుగుతోంది. ప్రభుత్వ బడులను మూసివేస్తున్న పరిస్థితులలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న సంఘటిత, అసంఘటిత రంగాల ప్రజలు తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించలేని స్థితిలో వున్నారు. మరోప్రక్క ప్రైవేటు పాఠశాలల్లో చదివించే స్తోమత లేక దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేయబడుతున్నారు. ఇలా విద్యావకాశాలు సన్నగిల్లుతున్న పరిస్థితుల్లో, వెదజల్లబడుతున్న విషసంస్కృతికి, చెడు అలవాట్లకు గురై పిల్లలు దారి తప్పుతున్నారు.

ప్రజల బడులు ఏ దయనీయ స్థితిలోకి దిగజార్చబడుతున్నాయో, బోధనా విలువలు, సిలబస్సు, విద్యార్థుల, ఉపాధ్యాయుల పరిస్థితులు నానాటికీ ఎలా పతనమౌతున్నాయో ప్రజలకు విడమర్చి చెప్పాల్సిన కర్తవ్యం నేడు మన అందరిమీద ఉంది. మన పిల్లల భవిష్యత్తును మధ్యయుగాల చీకట్లోకి నెట్టదలచుకున్న పాలకుల విధానాలను తిప్పికొట్టాలి. విదేశీ ప్రత్యక్ష దోపిడీ కోసం ప్రైవేటీకరణను వేగవంతం చేస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలి. ప్రజాకవులు, రచయితలు, మేధావులు, విద్యార్థి, యువతరం – అందరినీ ఒక త్రాటి మీదకు తీసుకొచ్చే చైతన్యవంతమైన ఉద్యమాలు నేటి అవసరం.

**26 జూన్ 2023**

---

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి....)

నోటినిండా బురదని పుక్కిట పట్టి
మాటల దుర్గంధాన్ని జనం మీదుగా
తుంపర్లు తుంపర్లు గా వెదజల్లుతూ
రోడ్డు పక్కనే మురికిగుంటల్లో
దొర్లి దొర్లి పొర్లి పొర్లి
గుమ్మాల ముందుకొచ్చి
ఒళ్ళు దులపరించు కొన్నట్లు
కాలుష్య పూరిత చెరువుల్లో
ముంచి తీసిన బట్టల్ని
రోడ్డెక్కి ఒక్క ఉదుటున దులిపినట్లు
బహిరంగస్థలాలన్నీ బహిర్భూములైనట్లు
బారికేడ్ల ముళ్ళకంచెల మధ్య
జనసమూహాల్ని బంధించి
ఊరూరా సేకరించిన దుమ్మునంతటినీ
నాలుకచేటల్తో చెరిగి చెరిగి
ప్రతిపక్షాలపై ఎత్తి పోస్తుంటే
ఊరూవాడా కాలుష్యమౌతున్నాయ్

శివార్లలో మైదానాల్లో
ఎగిరెగిరి పడ్తున్న శబ్దాల్ని
ఛానళ్ళు పోటీ పడి
ఇళ్ళనిండా విరజిమ్ముతున్నాయ్

ఏ తెల్లవారు ఝామునో
నిర్వికారంగా నిర్వేదంగా
ఎప్పటికీ బాగుపడని బతుకుల్ని
చెత్త బుట్టలో మోసుకు తిరిగే మహిళలు
యథావిధిగా రోడ్లని ఊడ్చుతూ
చెత్తకుండీలు నింపుతూ
ఎవరొచ్చినా మనబతుకులు మనవేనని
తమ కాంట్రాక్టు ఉద్యోగాలు కుక్కతోక లేనని
ఛిద్రమైన ఆశలతో
ఎండిపోయిన పెదాల్ని విరుస్తూ
కుళ్ళి కంపుకొడ్తున్న తిట్లనీ
గల్లీ గల్లీల్లోకీ ప్రవహిస్తూ వచ్చిన
దుర్భాషా దుర్గంధాల్నీ
ఆనవాలైనా కనబడకుండా
నిర్వికార నిరామయముఖాలతో
గంపలకెత్తి పోసే దృశ్యాలు
రహదారుల నిండా
ఎన్నో ఎన్నెన్నో
ఎన్ని'కల'లోఎన్ని'కల'లో

(ఇంకావుంది)

కథ

# కన్యాశుల్కానికి అవతల

– ఎ. మన్మధరావు

**విజయనగరం** బొంకుల దిబ్బలో అత్యవసర సమావేశం ఏర్పాటుచేయబడింది. సమావేశానికి సంబంధించిన ఆహ్వానపత్రాన్ని – 'లవణరాజు కల', 'కొండుభట్టీయం', 'కాసులు', 'కన్యక', 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ'ల లోని మిగతా ప్రముఖులకి కూడా అహ్వానాలు అందించాలని మొదట నిర్ణయించుకున్నప్పటికీ, వాళ్ళు సమావేశానికి హాజరైతే, ఎక్కడ తమ నిర్ణయానికి అడ్డు తగులుతారేమోననే ఉద్దేశంతో, తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. 'దిద్దుబాటు' కథలోని గోపాల్రావు, 'మెటిల్డా'లోని ముసలి భర్త, 'సంస్కర్త హృదయం' లోని సరళ వంటి ఒకరిద్దరు మిగతా ప్రముఖులందరికీ ముందుగానే ఆహ్వానపత్రాన్ని అందించ బడినప్పటికీ.... సమావేశం బొంకుల దిబ్బలో నిర్వహిస్తుండడం వల్లా, ఆ బొంకుల దిబ్బ 'కన్యాశుల్కాని'కి సంబంధించినది కావడం వల్లా, 'కన్యాశుల్కాని'కి సంబంధించిన ప్రముఖులు తప్ప మిగతా వారెవ్వరూ ఆ సమావేశానికి హాజరుకావడానికి సిద్దపడలేదు. గోపాల్రావూ, ముసలి భర్తలు మొదట్లో కాస్తా ఆసక్తి చూపించినప్పటికీ.... కమలిని, మెటిల్డాలు కనువిప్పు కలిగించడం వల్ల వచ్చిన మార్పుతో తమ నిర్ణయాన్ని విరమించుకోవడంతో, సమావేశం అచ్చంగా 'కన్యాశుల్కం'లో ఉన్న ప్రముఖులకి మాత్రమే పరిమితమయ్యింది.

రామప్పంతులు గారు అధ్యక్షోపన్యాసం చేయడానికి ఉపక్రమిస్తూ, "పిల్లా, అగ్గిపుల్లా" అంటూ జేబులోనుంచి చుట్టతీసి, పంటికొన కొరికి మధురవాణి వంక చూశాడు. మధురవాణి అగ్గిపుల్ల వెలిగించి చుట్ట అందించుచుండగా, ఆమె బుగ్గ గిల్లబోయిన రామప్పంతులు, గిరీశంతో పాటు లుబ్ధావధానులు కూడా అక్కడే ఉన్నారన్న విషయం గుర్తొచ్చే సరికి తన ప్రయత్నాన్ని విరమించుకొన్నాడు. "అబ్బ! యంత ప్రయాస మీద ఈ ఘట్టం కుదిర్చాను. చెప్పేమాట చెవిన బెట్టండి. అప్పారావు అనే ఒకడు చేసిన పని వల్ల ఇప్పటికే మన కొంపలు మునిగిపోయాయి. ఆయన తన రాతల్తో మన బతుకుల్నీ, బాగోతాల్నీ బజారున పడేయడమే గాకుండా, మనల్ని జాకాల్ లనీ, బిగ్ యాస్ లని తిడుతూ మన ఇమేజీని దెబ్బతీశాడు. ఇంత ఘోరానికి ఒడిగట్టిన ఆ అప్పారావుని ఊరికే వదిలెయ్య కూడదు. డామేజీ దావా పడేద్దావనుకుం టున్నాను. ఏమంటారు భాయీ!..." అంటూ ఆశగా అక్కడున్న వారివైపు చూశాడు రామప్పంతులు.

రామప్పంతుల్ని తమలపాకు చుట్టతో కొట్టి, లేచి నిలబడింది మధురవాణి. "యేం చిత్రంగా మాట్లాడారు పంతులు గారూ! అన్యాయపు మాటలు అనకండి. 'చిత్రం చిత్రం మహాచిత్రం' కథుంది, అలా వున్నాయి మీ చర్యలు! చాలు చాలు మీ ప్రయోజకత్వం. ఎందుకు ఆ పంతులు గారి మీద అన్యాయంగా అనుమానపడతారు? కొద్దికాలం వుండే యవ్వనాన్ని జీవనాధారం చేసుకున్న కులంలో పుట్టి పెరిగిన నన్ను ఆ 'కుక్కల పొత్తు' నుండి బయటకి లాగి సంసారిగా బతకాలన్న గట్టి కోరికను పుట్టించాడే! సమాజంలో నిరాటంకంగా సాగిపోతున్న గొంతుకలు కోసే వ్యాపారాన్ని సున్నితమైన హాస్యంతో బట్టబయలు చేశాడే! దుర్నీతినీ, అహేతుక మూఢవిశ్వాసాలనీ, ఎండగట్టాడే! అలాంటి ప్రాజ్ఞులు మీదా డామేజీ దావా వేసేది. చాలు. విజయం చేయండి." అంటూ రామప్పంతులుకి చక్రం అడ్డం వేసే సరికి ఏం చేయాలో పాలుపోలేదు అతనికి. తలదించుకొని మౌనంగా "నేను అనుకున్నంత పనీచేసిందీ పెంకె లంజ." అని మనసులో తిట్టుకుంటూ, "ఏవిటి సాధనం? ఈ ప్రమాదాన్ని తప్పించే మార్గమేదీ?" అని ఆలోచనలో పడిపోతూ అగ్నిహోత్రులు వంక చూశాడు రామప్పంతులు.

అగ్నిహోత్రావధాన్లు అప్పటికే మనసులో మంచి మంటమీదున్నాడు. "పింజారీ! వూరుకో – అడముండల్తోనా ఆలోచన? పెద్ద మనుష్యులుతో వ్యవహారం మాట్లాడుతూ ఉంటే రామాయణంలో పిడకల వేటల్లాగ ఇదేవిటండీ?" అంటూ లేచి నిలబడి, "ఏమండోయ్ కేసు అడ్డంగా తిరిగిందే" అంటూ రామప్పంతులు వైపు తిరిగేసరికి, అప్పటి వరకూ బెరుకు బెరుకుగా ఉన్న రామప్పంతులుకి కొంత ధైర్యమొచ్చినట్టయ్యింది.

"ఈ శషబిషలు నాకేం పనికిరావు. విధవ ముండలకి వివాహం చేయాలని వాదించే వకీలు పక్షం వాడిగురించి యింకా మాటలేవిటండీ! వైధవ్యం అనుభవించిన వాళ్ళంతా పూర్వకాలంలో యెంత ప్రతిష్టగా బ్రతికారు కారూ – అని నేనడగడం తప్పా? వెంకడికి పెళ్ళిచేయాలంటే చిన్న పిల్లని అమ్ముకోవద్దూ? యేవిటీ ముండా ఏడుపు సంత? వద్దనడానికి వాడెవడూ? వీడెవడూ? నా పిల్ల భారమంతా వాడిదైనట్టు మాట్లాడుతున్నాడేమిటీ? ఆ సంత వాడికెందుకూ? పిల్లల్ని అమ్ముకోవడం శిష్టాచారమండీ! అని అడిగిస్తాడా? మా మేనత్తలునాడు అమ్మకం జరగలేదూ? మా నాన్న మేనత్తలనాడు కూడా అమ్మకం జరిగిందష కదా! అలాంటప్పుడు అప్పుడెప్పుడూ లేని శిష్టాచారం, నేను నా పిల్లని అమ్మకానికి

పెట్టినప్పుడే గుర్తొచ్చిందాండీ వీడికీ? విధవలు పెండ్లాడవలసినదని పరాశరస్మృతిలో స్పష్టంగా ఉందనే వాదనని తీసుకువస్తాడండీ వీడూ? నలదమయంతి చరిత్ర తీసి, దమయంతి రెండోపెళ్ళి గరించి పద్యం చెపుతాడూ? బ్రాహ్మణ్యం ఎంత వేళాకోళం అయిపోయిందష వీడికి. అన్నీ మన వేదాల్లోనే ఉన్నాయష అనడం కూడా తప్పేనా? వీడికి ఘటాశ్రాద్ధం పెట్టా! అన్నగారూ! క్రిమినల్ కేసు తేవడానికి అవకాషం ఉంటుందా? నా కడియం తాకట్టుపెట్టైనా సరే దావా పడేస్తాను." అంటూ ఊగిపోయాడు అగ్నిహోత్రావధానులు.

అప్పటి వరకూ శిష్యునిచేత పేలు నొక్కించుకొనుచున్నాడు కరటకశాస్త్రులు, బావ మాటలకి తుళ్ళిపడి లేచి, "శబాష్. కోట్లకి విలువైన మాట అన్నాడు మా బావ. నేను హాస్యగాణ్ణే గానీ, ఈ దావా గడబిడతో నా హాస్యమంతా అణిగిపోయింది. నా శిష్యుడు అన్నట్టు – కడుపులోకి వెళ్ళవలసిన నెయ్యి కాల్చెయ్యడం నాకేవీ" ఇష్టంలేదు. చెడ్డవారి వల్ల చెప్పుదెబ్బలు తినవచ్చును గాని, మంచివారి వల్ల మాట కాయడం కష్టం. అలోచించుకోండి. వెఱ్ఱి కుదిరి, తలకి రోకలి చుట్టుకున్నట్టుంది మీ వ్యవహారం. ఆయన మీద డేమీజీ దావా వేస్తారూ? ఆయన తరుపున వాదించడానికి బహు న్యాయమైన మనిషి సౌజన్యారావు పంతులుగారు ఉన్నారనే విషయం మరిచి పోయారా? ఏవిటి?" అంటూ కరటకశాస్త్రులు ఎత్తిపొడుస్తూ సౌజన్యారావు పంతులుని గుర్తుకుతెచ్చి హెచ్చరించేసరికి రామప్పంతులుకి చెమటలు పట్టేశాయి.

తాను భయపడితే, మొత్తం వ్యవహారమే చెడిపోయేలా ఉందని పసిగట్టిన రామప్పంతులు, లుబ్ధావధానుల వైపు చూసి, "మావా! విన్నావా కరటకశాస్త్రి మాటలు? ఆ అప్పారావు మంచివాడట. వాడు ఎన్నెన్ని మాటలన్నాడూ మనల్ని? మన అన్న అగ్నిహోత్రావధానులు అన్నట్టు – మన బ్రాహ్మణ్యం మీద ఎన్నెన్ని నిందారోపణలు చేశాడూ? నిన్నైతే మరీ ఘోరంగా – పీసిరిగొట్టు, ముసలివాడూ అని ఆడిపోసుకోలేదూ? ముక్కుపచ్చలారని పిల్ల గొంతుకోయడానికి పూనుకున్నావని, నలుగురిలో నిన్నెంత పలుచన చేశాడూ? నీకెంత డామేజీ తీసుకువచ్చాడూ? అలాంటి వాడిని, అలా వదిలేద్దామంటావా మావా! నువ్వు చెప్పు." అంటూ అతనిని కరటకశాస్త్రి మీదకి ఎగదోశాడు.

లుబ్ధావధానులు సావధానంగా లేచి నిలబడి, "మావా! నీవు చెప్పినదంతా యధార్థమే. వీడి సిగ తరగా! నాయందు ఎంత ఘోరకలిని పుట్టించాడూ. నన్నెంత నవ్వులుపాలు చేశాడు. ఆ మాయ గుంట నెవర్తినో తెచ్చి నాకు అంటగట్టటమేవి? ఆ మాయ గుంట పారిపోవడమేవి? కంటెకి, ఆ అల్లరేమి? ఆ యినసిపికటరు కూనీ చేశావని మమ్మల్ని సలపెట్టడవేవిటి? వీటన్నింటికీ, నిజంగా అయితే అతని మీద కోర్టు దావా తీసుకు రావలసిందే. కానీ అతను నాచేత – చేసిన తప్పులకి బుద్ధి వొచ్చేలా చేసి, మాయమ్మి మీనాక్షిని వెళ్ళి వెధవల మఠం చూడమనేలా చేయడమే కాకుండా, దానికి ఇష్టముంటే కావలసినంత డబ్బు ఇచ్చి, ఆ మఠంలో ఉండేలా చేస్తాను. లేకపోతే, కాశీవాసానికి నాతో తీసుకుపోతానని అనిపించేలా చేశాడే.... అలాంటి బాబు మీదా కోర్టు దావా? న్యాయమా ఇదీ? నేనొప్పుకోను. నా బుద్ధి గడ్డి తిని నేనీ సమావేశానికి హాజరయ్యాను. మహాప్రభో నీకు పదివేల నమస్కారాలు. యిక యీ పకీరు వెధవని వదిలెయ్యండి." అంటూ కూర్చుండి పోయేసరికి, ఇక ఎవరికి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. అంతా నిశ్శబ్దం.

"నాన్సెన్స్ మొదట్నుంచీ నేను అనుమానిస్తూనే ఉన్నాను. ఇలాంటిదేదో జరుగుతుందని. ఈ గండం తప్పే ఉపాయం నేన్చెబుతాను. నాతో మాట్లాడడవే ఒక ఎడ్యుకేషన్. ఇలాంటి ప్రమాదాల్తప్పించుకోవడవే ప్రజ్ఞ. యేవైనా డిఫికల్టీ వొచ్చినప్పుడు ఒక రస్తా వేశావంటే అది బ్రహ్మభేద్యంగా ఉండాలి." అంటూ కనుబొమ్మలెగరేస్తూ గిరీశం మధురవాణి వైపు చూశాడు. మధురవాణి అతని వైపు చూడలేదు. కానీ, అతను మధురవాణి వైపు చూస్తూనే మాట్లాడు తుండేసరికి, "గాడిదకొడుకిని తందునా?" అన్నంత కోపం వచ్చేసింది అగ్నిహోత్రావధానులుకి.

"సోషల్ రిఫామ్ అనగా సంఘసంస్కారం అనగా లోకం తప్పు తోవలో వెళుతుంటే ఆ తోవలోంచి మళ్ళించి మంచి తోవలో పెట్టడం. దీనినే కదా అడ్డం పెట్టుకొని, ఆ అప్పారావు మనల్ని అందర్నీ ఆల్ ఫూల్స్ అనగా వెధవల్ని చేశాడోయ్. దీనికి ప్రతిగా అతని మీద కోర్టు దావా పడవేయడం అనేది వెల్ డెషిసన్‌గానే కనిపించుచున్నది. కానీ, దిసీజ్ కంప్లీట్లీ ఇగ్నోరెన్స్. చేస్తే శుద్ధ క్షవరవే గాని, తిరుపతి మంగలాడి క్షవరం చెయ్యకూడదు. నా దృష్టిలో ఈ కోర్టులూ, దావాలూ బార్బేరియన్స్‌లు చేసే పనులు. ఖర్చుదండగ. ఆ ఖర్చులో వెయ్యో వంతు ఖర్చు కూడా కాకుండానే ఆ అప్పారావు మీద కంప్లీట్ రివేంజ్ తీర్చుకొనే బ్రహ్మాస్త్రం నా దగ్గరొకటుంది. అదేవిటంటే – ఆ అప్పారావు ఏ సోషల్ రిఫామ్ కోరుతూ, మన బతుకుల్ని బజారుకీడ్చాడో, మనం ఆదే పేరుమీద ఒక పురస్కారంని ఏర్పాటు చేసి, ఆయన రిఫామ్స్‌ని బజారుకీడుద్దాం. స్త్రీ పురుషులు సమానమన్నందుకుగానూ పురుషుల లోదుస్తులు ఉతికితే తప్ప, స్త్రీ పతివ్రత కాలేదని శాస్త్రం చెప్పిన వారిని తీసుకొచ్చి సన్మానాలు చేద్దాం. వర్ణవ్యవస్థ నశించాలని గాఢంగా కోరుకుంటాడూ? వర్ణవ్యవస్థ బహు ఉత్కృష్టమైనదీ, ఉండవలసినదీ అని శాసనాలు చేసినవారికి శాలువాలు కప్పుదాం. మూఢనమ్మకాలపై, దౌర్జన్యాలపై, అన్యాయాలపై, అక్రమాలపై, ఆఖరికి లాభాపేక్షపై, లంచగొండితనంపై, లంజరికంపై కూడా తిరుగుబాటు చేస్తాడా? పూర్ మెన్. మనం వీటిని ప్రోత్సహించేవారిని గుర్తించి వారికి పురస్కారాలు పంచిపెడదాం. సంఘసంస్కారం అనగా – లోకం తప్పు తోవలో వెళుతుంటే ఆ తోవలోంచి మళ్ళించి మంచి తోవలో పెట్టడం ఇదే కదా ఆయన పుణ్యానికి పుణ్యం, పురుషార్థానికి పురుషార్థం. అధికస్య అధికం ఫలం. ఏవంటారూ?"అని ముగించి గర్వంగా ఓ సారి చుట్టూ కలియచూశాడు గిరీశం.

రామప్పంతులు మొహం వెలిగిపోతోంది. అగ్నిహోత్రావధానుల మొహంలో కనీ కనిపించని చిరునవ్వు. గిరిశం ఆనందానికి హద్దులు లేకపోయాయి.

“బాగా ఉపన్యసించారు. నెపోలియన్ ఆఫ్ యాంటీనాచ్ గారూ! కానీ మీరన్నది కూడదు.” అంటూ అప్పుడే లోపలికి అడుగెట్టి గిరీశం ఆనందాన్ని ఆవిరిచేశాడు సౌజన్యారావు పంతులు. ఆహ్వానం అందకపోయినా, సౌజన్యారావు పంతులు ఉన్నఫళంగా ఊడిపడేసరికి, అతన్ని చూసీ చూడడంతోటే, గిరీశం గుండె ఆగిపోయింది. “డామిట్ కథ అడ్డంగా తిరిగింది.” అంటూ భయంతో బయటకి గుమ్మం వైపు పరుగుతీయబోయాడు గిరీశం. కానీ అతనికి ఆ అవకాశం ఇవ్వకుండా రామప్పంతులు, రెక్కపట్టుకొని ఆపేసరికి, అగ్నిహోత్రావధానులు, రామప్పంతులువైపు ప్రశంసాపూర్వకంగా చూసి, “చెభాష్” అన్నట్టుగా అతని భుజం తట్టాడు. బయటకి కనిపించడం లేదుకానీ, రామప్పంతులు కూడా లోపల వణికిపోతున్నాడు. అగ్నిహోత్రావధానులు అతని భుజం మీద ఓ చెయ్యేసేసరికి అతనికి కొంత ధైర్యమొచ్చినట్టు అనిపించింది. పరిస్థితి విషమించిందనే విషయం అగ్నిహోత్రావధానులకి అర్థమైపోయింది. సౌజన్యారావు పంతులు చేతిలో భంగపడడం కంటే, ముందే సర్దుకోవడం మంచిదనే ఉద్దేశంతో అగ్నిహోత్రావధానులు, సౌజన్యారావు పంతులు వైపు తీక్షణంగా చూసి, “నేను అగ్రహారపు చెయ్యిని - బెదిరించితే భయపడేవాణ్ణి కాదు. తాంబూలాలిచ్చేశాం. తన్నుకు చవ్వండష” అంటూ ఓ చేయి రామప్పంతులు భుజం మీద, మరో చేయి గిరీశం భుజం మీదా వేసి, అక్కడి నుండి తప్పించుకొనిపారిపోయాడు. అంతటి మహానుభావులే పలాయనం చిత్తగించాక, తామెంత అనుకుంటూ బైరాగి, మునసబు, హెడ్డు, పోలిశెట్టి లాంటి వాళ్ళందరూ వారి వెంటే బయటకి నడిచారు. సౌజన్యారావు పంతులు మీదన్న అభిమానంతో మధురవాణి, కరటకశాస్త్రి, లుబ్ధావధానుల వంటి అక్కడే నిలబడిపోయారు. సౌజన్యారావు పంతులు, ముందుకొచ్చి, రాబోతున్న ప్రమాదాన్ని గురించి వివరించాడు. “పొంచుకొస్తున్న ప్రమాదాన్ని ఎదుర్కోవడం ఎలా?” అన్నదాని కోసం సభ సమాలోచన చేయడం మొదలుపెట్టింది. ●

కథ

# తనదాకావస్తే....

- బుర్రా సాయిబాబు

**అనగనగా** ఒక ఆవు, అదే గతంలో పులికి ఎదురుపడి అది చంపడానికి మీదకి దూకబోతుంటే, దూడకి పాలిచ్చి వచ్చి ఆహారమైపోతాను అని వేడుకొందికదా. మీకు గుర్తుండే ఉంటుంది. అప్పుడు పులి ఆవును నమ్మి వదిలిపెడితే అది మాట నిలబెట్టుకుని తిరిగివస్తే, అభినందించి దానిని తినకుండా వదిలేసింది కదా. అదే ఆవు, అడవిలో గడ్డిమేయడానికి బయలుదేరింది.

అసలే ఆవు, అందరూ గోమాత అని, కామధేనువని పొగిడి పొగిడి వదిలారు. ఆవు కూడా ఒక జంతువేనన్న సంగతి జనం మరిచిపోయారు. దానితో సన్మానాలు, సత్కారాలు మరీ ఎక్కువైపోయాయి.

అడవిలో ఒకచోట ఆవుకి మంచిగడ్డి కనిపించింది. అది చాలా చక్కగా, ఏపుగా ఎదిగి కనువిందు చెస్తోంది. అప్పుడే పాలుపోసుకున్న కంకి బరువుకి ఆ గడ్డి వంగి, గాలికి ఇటూఅటూ ఊగుతోంది. దానిని తిందామని దానిపై మూతిపెట్టిందోలేదో, గడ్డి ఆవుని ఇలా వేడుకొంది, ‘ఓ గోమాతా! తల్లిప్రేమ గురించి నీకే బాగా తెలుసు, గింజలు ఇప్పుడే పాలుపోసుకున్నాయి. ఒక్కరోజు ఆగితే ఎండి రాలిపోతాయి. గింజలు నన్ను అంటిపెట్టుకున్నంతకాలం వాటి సంరక్షణాభాధ్యత నాది అని నీకు తెలుసుకదా! నాయందు దయఉంచి ఒక్కరోజు ఆగి రా. నేను ఎలాగూ కదలలేను కదా. రేపు ఇదే సమయానికి వచ్చి నన్ను ఆరగించు. ఈ ఒక్క కోరికా మన్నించు, గతంలో నీకు పులి సమయమీయలేదా' అని వేడుకొంది.

దానికి ఆవు అంది “ఓసి నా పిచ్చిగరికా! రోజులు మారినప్పుడు నీతినియమాలు మారిపోతాయి అని తెలియదా. ఇప్పుడు నేను మనుషులతో సమానంగా, ఇంకా చెప్పాలంటే మనుష్యులకన్నా ఎక్కువగా గౌరవింపబడుతున్న కాలం. నా కోసం, నా సంరక్షణ కోసం చాలామంది ఉన్నారు. ఇప్పుడు అగ్రకులాలు, అగ్రమతాలు మాకూ ఉన్నాయ్. మనుష్యుల మనువాదం మాకూ అంటింది. మాకు పూజ చెయ్యకుండా గృహప్రవేశాలు లేవు. అంతెందుకు మాకోసం ఇప్పుడు ప్రత్యేకచట్టాలే ఉన్నాయి. నేను ఇప్పుడు ఒక అగ్రజంతువుని, నాకు ఎలాంటి దయా, దాక్షిణ్యాలు ఉండవు,” అని గడ్డిని కసక్కున కొరికి తినేసింది గింజలతో సహా! ●




పుస్తక పరిచయం

# బొగ్గు గనుల భూగర్భం నుండి అంకురించిన కార్మికవర్గ విప్లవ పోరాటాన్ని చిత్రించిన ఎమిలీ జోలా నవల 'జర్మినల్'

- జి.వి. భద్రం

**ప్రముఖ** ఫ్రెంచి రచయిత ఎమిలీ జోలా (2 ఏప్రిల్ 1840 – 29 సెప్టెంబర్ 1902) ఫ్రెంచి భాషలో ఈ నవలను 10 నెలల కాలంలో 2 ఏప్రిల్ 1884 నుండి 22 జనవరి 1885 వరకు రచించారు. దీనిని మొదట 'లె గిల్ బ్లా' అనే వార్తాపత్రికలో సీరియల్‌గా 26 నవంబరు 1884 నుండి 89 విడతలలో 25 ఫిబ్రవరి 1885 వరకు ప్రచురించారు. 1885లో విడుదలైన ఈ ఫ్రెంచి నవల ఐదు సంవత్సరాలలో 83 వేల ప్రతులు అమ్ము డయ్యాయి. దీనిని ఇంగ్లీషులోకి ముగ్గురు అనువదించగా, సామాజిక కార్యకర్త, వైద్యుడు, మానసిక శాస్త్రజ్ఞుడు ఐన హావలాక్ ఎల్లిస్ (1859–1939) అనువాదం శ్రేష్టమైనదిగా విమర్శకులు గుర్తించారు. ఎమిలీ జోలా రాసిన 'భూమి', 'నానా' నవలల తెలుగు అనువాదాలు వున్నాయి. కాని 'జర్మినల్' అనువాదమయిందో లేదో తెలియలేదు.




నవలకు 'జర్మినల్' అని పేరు పెట్టడంలో ఒక ప్రత్యేకత వుంది. 'జర్మినల్' అంటే అంకురోత్పత్తి దశ అని అర్థం. 1789 నాటి ఫ్రెంచి విప్లవ ఫలితంగా రిపబ్లికన్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ ప్రభుత్వం క్రిస్టియన్ మతంపై నిషేధం విధించి, క్రిస్టియన్ (జార్జియన్) కేలండర్‌ను రద్దుచేసి, రిపబ్లికన్ ప్రభుత్వం ఏర్పడిన 22 సెప్టెంబర్ 1792ను కేలండర్ మొదటిరోజుగా నిర్ణయించి కొత్త కేలండర్‌ను ప్రవేశపెట్టింది. ఈ కేలండర్‌లో ఏడవ నెలకు జర్మినల్ అని పేరు పెట్టారు. అంటే పాత కేలండర్ ప్రకారం అది మార్చి 21 నుండి ఏప్రిల్ 20 వరకు. అది ప్రకృతిలో అంకురోత్పత్తి కాలం. ఫ్రాన్స్‌లో బొగ్గు గనుల్లో అంకురించిన విప్లవ పోరాటానికి ప్రతీకగా ఈ నవలకు ఈ పేరు పెట్టారు. అంతేగాక ఈ పేరుకు మరో ప్రాధాన్యత వుంది. ఆకలితో మలమలలాడుతున్న పారిస్ నగరవాసులు 1795 ఏప్రిల్ 1వ తేదీన చేసిన ప్రసిద్ధ తిరుగుబాటుకు సంకేతపదం 'జర్మినల్'.

ఫ్రాన్స్‌లో 1789, 1830, 1848, 1871లలో జరిగిన విప్లవ పరంపరల స్వభావాన్ని వ్యక్తీకరించిన ఒక ప్రజల నవలగా దీనిని విమర్శకులు పరిగణించారు.

'జర్మినల్' నవల వ్రాయటానికి ముందు జోలా 'సారాయి కొట్టు' (లాస్సామో) అనే నవలను వ్రాసి రచయితగా ప్రసిద్ధి చెందారు. ఆ నవలలో ఆయన ప్యారిస్ నగరంలోని మురికివాడలలో నివసించే శ్రామికుల, కార్మికుల జీవితాలను త్రాగుడు అనే దుర్వ్యసనం ఎంతగా సర్వనాశనం చేసిందో కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. అప్పటికే ఆయన 'సహజవాది' (ప్రకృతివాది – నేచురలిస్టు ఉద్యమకారుడు)గా, ఉద్యమ నాయకులలో పేరొందాడు. ఎమిలీ జోలాకు గల ఐదుగురు ప్రధానమైన నేచురలిస్టు శిష్యుల్లో ప్రముఖ ఫ్రెంచి రచయిత గైడి మొపాసా ఒకరు. అందువలన ఆనాడు సోషలిస్టులుగా వుంటూ, జోలాను అపఖ్యాతి పాలు చేయాలనుకొన్న కొందరు సోషలిస్టులు అతడి 'సారాకొట్టు' నవల కార్మికులను హీనులుగా చిత్రీకరించిందనీ అందువలన కార్మిక, శ్రామికవర్గాన్ని గురించి బూర్జువాలు (పెట్టుబడిదారులు)కు గల వ్యతిరేక దురభిప్రాయాలను ఆ నవల మరింత ప్రబలం చేస్తుందనీ విమర్శించారు. ఆ (కు)విమర్శకు స్పందించిన జోలా, తాను కార్మికవర్గాన్ని గురించీ, ఆ వర్గం ప్రస్తుతం నివసిస్తున్న రాజకీయ సామాజిక పరిస్థితులను గురించీ, కార్మికవర్గం యొక్క రాజకీయ ఆకాంక్షలపైనా కేంద్రీకరించి ఒక నవలను వ్రాయబోతున్నానని ప్రకటించాడు. ఆ రకంగా కార్మికవర్గం గురించి వారి ఆకాంక్షల గురించీ ఎమిలీ జోలా వ్రాసిన నవలే – జర్మినల్!.

ఎమిలీ జోలా తాను వ్రాయదలచుకొన్న నవలల ప్రాజెక్టు గురించి తన పుస్తకాల ప్రచురణకర్తకు తెలిపారు. "రెండవ సామ్రాజ్యంలోని (ఫ్రాన్స్‌లో మూడవ నెపోలియన్ పరిపాలనాకాలాన్ని (1852–70) రెండవ సామ్రాజ్యం అంటారు. మొదటి నెపోలియన్ పరిపాలనాకాలాన్ని మొదటి సామ్రాజ్యం అంటారు) ఒక కుటుంబం యొక్క సహజ, సామాజిక చరిత్ర"లోని ఒక్కో అంశాన్ని ఒక్కో నవల రూపంలో రాయటమన్నది ఈ ప్రాజెక్టు యొక్క ప్రణాళిక. చక్రవర్తి నెపోలియన్ III పరిపాలనా కాలంలో ఫ్రెంచి సమాజంలోని ఒక కుటుంబంలో క్రమానుగతమైన తరాలలో ఆనువంశిక, పర్యావరణ ప్రభావాల జాడలను

గుర్తించటం అన్నది ఈ ప్రణాళికలో చేపట్టిన విషయం. ఈ ప్రణాళిక ప్రకారం వ్రాయవలసిన 20 నవలల్లో యీ 'జర్మినల్' 13వ నవల.

ఎమిలీ జోలా 10 నవలలు పూర్తిచేసేనాటికే రెండవ సామ్రాజ్యం, ఫ్రాంకో – ప్రష్యన్ యుద్ధం వలన 1870లో అంతరించింది. 1871లో మొట్టమొదటి కార్మికవర్గ విప్లవం ప్యారిస్‌లో జరిగి, మార్చి నెల నుండి మే నెల వరకూ సాగిన ప్యారిస్ కమ్యూన్ అనుభవాలను ఎమిలీ జోలా తన కళ్ళారా చూశాడు. థేర్స్ ప్రభుత్వం ఆ ప్యారిస్ కమ్యూన్‌ను అతి పాశవికంగా, ఆటవికంగా అణచివేయటాన్ని చూసి జోలా తీవ్రంగా కలత చెందాడు. అందువలన జోలా తన ప్రణాళికలో అనుకొన్న దానికన్నా మరొక అదనపు నవలను – వామపక్ష రాజకీయ పరిధిలో వుండే నవలను వ్రాయ సంకల్పించాడు. అదే 'జర్మినల్' నవల.

1883లో జోలా ఫ్రాన్సు దేశానికి చెందిన వేలిన్సియెనే నియోజక వర్గానికి చెందిన ఆల్‌ఫ్రెడ్ గియార్డు అనే శాసనసభ్యుడిని కలిశాడు. ఆ శాసనసభ్యుడు (డిప్యూటీ) వామపక్షానికి చెందినవాడు. అతని నియోజకవర్గం ఫ్రాన్సులోని బొగ్గుగని పరిశ్రమ యొక్క కేంద్రాలలో ఒకటి. జోలాను బొగ్గుగని కార్మికుల సమ్మె గురించి ఒక నవలను వ్రాయమని గియార్డు కోరాడు. జోలా కూడా తన విప్లవ ప్రతిష్టను పునరుద్ధరించుకోవాలన్న దృష్టితో, బొగ్గుగని కార్మికుల సమ్మె గురించి నవలను వ్రాయటానికి అంగీకరించాడు.

అందుకోసమని జోలా బొగ్గు పరిశ్రమను గురించి వ్రాసిన పుస్తకాలన్నింటినీ చదివాడు. వేలెన్సియెనే ప్రాంతం యొక్క స్థలాకృతి గురించీ, భూగర్భ పరిస్థితుల గురించీ క్షుణ్ణంగా తెలుసుకొన్నాడు. సోషలిజం చరిత్ర గురించీ, 1864లో ఏర్పడ్డ అంతర్జాతీయ కార్మికుల సంఘం (మొదటి ఇంటర్నేషనల్) గురించీ, విప్లవ రాజకీయ సిద్ధాంతం (రాడికల్ రాజకీయ సిద్ధాంతం) గురించి అధ్యయనం చేశాడు. అంటే ప్రౌడన్ యొక్క 'విముక్తి సోషలిజం' సిద్ధాంతాన్నీ, కార్ల్‌మార్క్స్ ప్రచురించిన 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'ను, 'దాస్ కేపిటల్'నూ, ఆగస్టు బ్లాంక్వీ యొక్క రివల్యూషనరీ సోషలిస్టు మరియు సాయుధ విప్లవ అభిప్రాయాలనూ చదివాడు. (ఆగస్టు బ్లాంక్వీని జైలులో వుండగానే పారిస్ కమ్యూన్ అధ్యక్షుడిగా ఎన్నుకొన్నారు). రష్యన్ విప్లవకారుడు, "రాజ్యాంగ ప్రతిపత్తి – అరాచకవాదం (అన్ని ప్రభుత్వాలను, చట్టాలను రద్దుచేయాలనే వాదం) అన్న గ్రంథ రచయిత అయిన బకూనిన్ యొక్క నిహిలిష్టు సిద్ధాంతాన్నీ జోలా అధ్యయనం చేశాడు. అంతేకాక ప్రత్యేకించి, 32 తాత్కాలిక జనరల్ కౌన్సిలు సభ్యులుగా వున్న మొదటి ఇంటర్నేషనల్‌కు కార్ల్‌మార్క్స్ సభ్యుడిగా ఎన్నికైన విషయాన్ని జోలా చదివాడు. అదేవిధంగా 1872లో హేగ్ నగరంలో జరిగిన మొదటి ఇంటర్నేషనల్ సమావేశంలో బకూనిస్టు అరాచకవాద సిద్ధాంత మద్దతుదారులకూ, మార్క్సిస్టు సోషలిజం మద్దతుదారులకూ మధ్య జరిగిన ఘర్షణ గురించీ (జనరల్ కౌన్సిల్‌లో), మార్క్స్ సూచనతో మొదటి ఇంటర్నేషనల్ హెడ్‌క్వార్టర్‌ను న్యూయార్కుకు తరలించిన విషయం గురించీ, 1885లో ప్యారిస్‌లో జరిగిన సమావేశంలో ఏర్పడిన రెండవ సోషలిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటు గురించీ కూడా జోలా క్షుణ్ణంగా తెలుసుకొన్నాడు. ఆ రకంగా 'జర్మినల్' నవలను మొదటి ఇంటర్నేషనల్ యొక్క బాల్యదశలో జరిగినట్లు జోలా వ్రాశాడు.

కేవలం పుస్తకాలను చదవటమేకాక, స్వయంగా బొగ్గుగనుల, చిన్న పట్టణమైన అజిన్‌కు వెళ్ళి అక్కడ వారం రోజులపాటు వుండి పరిస్థితులను స్వయంగా పరిశీలించాడు. అప్పుడు అక్కడి బొగ్గుగనులలో సమ్మె మొదలై నాల్గురోజులవుతుంది. తాను అక్కడ చూసిన, విన్న విషయాలను నోట్ చేసుకొన్నాడు. అక్కడి బొగ్గుగని కార్మికుల యథార్ధ జీవితాల గురించి వ్రాసుకొన్నాడు. అంతేకాక 1866లో అజిన్‌లో జరిగిన ఒక పెద్ద సమ్మె తదనంతరం జరిగిన సమ్మెలను గురించి జోలా వివరాలు తెలుసుకొన్నాడు. స్వయంగా బొగ్గు గని భూగర్భంలోకి దిగి అక్కడి పరిస్థితులను, పని పద్ధతులను గమనించాడు. ఆరు నెలలపాటు ఉత్తర ఫ్రాన్స్, బెల్జియంలలో వున్న బొగ్గుగనుల ప్రాంతాల్లో పర్యటించాడు. అంతేకాక 1869 జూన్ 16న, లారీ కమారీ బొగ్గు గనుల్లో జరిగిన సమ్మె సందర్భంగా 13 మంది బొగ్గుగని కార్మికులను ఇద్దరు మహిళలతో సహా చంపివేయటం, 20 మందిని గాయపరచటం, 60 మందిని జైలుపాలు చేయటం గురించీ, అదేవిధంగా 7 అక్టోబర్ 1869 అవేరోలోని ఆబిన్‌లో సమ్మె చేస్తున్న బొగ్గుగని కార్మికులు 14 మందిని కాల్చి చంపిన విషయం గురించీ యీ నవల వ్రాసే సందర్భంగా గమనంలో పెట్టుకొన్నాడు. 1874 మే 19న, బొగ్గుగనుల భూగర్భంలో మహిళలనూ, 12 సంవత్సరాలలోపు బాలికల చేత పని చేయించరాదనే చట్టం చేసినా 21 మార్చి 1884లో రెనె వాల్డెక్ రూసో ప్రవేశపెట్టిన యూనియన్లను (కార్మిక సంఘాలను) చట్టబద్ధం చేయడాన్ని ఆమోదించినా, బొగ్గుగని కార్మికుల జీవన పని పరిస్థితుల్లో ఏ రకమయిన మార్పూ (మెరుగైన) రాకపోవటాన్ని గమనించిన జోలా యీ విషయాలన్నింటినీ, తన 'జర్మినల్' నవలలో చర్చించాడు.

'జర్మినల్' నవలను వ్రాసిన అనంతరం, ఎమిలీ జోలా, జార్జెస్ మాంటోర్‌గ్యూయిల్‌కు 1885 మార్చి 8న ఒక ఉత్తరం రాస్తూ అందులో యీవిధంగా తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు :

"బహుశా యీసారి నన్ను ప్రజలను అవమానించే వ్యక్తిగా చూడటం మానివేస్తారనుకొంటాను. కార్మికుల పేదరికాన్ని గురించీ, వారి దౌర్భాగ్య, దిక్కుమాలిన స్థితి గురించీ, అటువంటి దుస్థితిలోకి వారు నెట్టబడ్డ విధానాల గురించీ, వివరించినవాడు, ఆ నిర్భాగ్యుల ఆకలి బందిఖానా యొక్క అన్ని భయంకరమైన కోణాలను చూపించినవాడు నిజమైన సోషలిస్టు కాదా? ........ అజ్ఞానం నుండీ, దుస్థితి – దురవస్థల నుండీ ప్రజలు బయటపడేట్లు చేయడానికి మనం విధిగా కృషిచెయ్యాలి!"

ఇటువంటి అభిప్రాయంతో జోలా "పెట్టుబడికీ, కార్మికవర్గానికి మధ్య జరిగిన పోరాటంగా, ఇరవయ్యో శతాబ్దంలో 'పెట్టుబడికీ కార్మిక వర్గానికీ మధ్య జరిగిన పోరాటమే" ప్రధాన సమస్య అని, భవిష్యత్తులో ఏం జరగబోతోందో చెప్పటానికి జోలా యీ 'జర్మినల్' నవలను వ్రాశారు.

ఎమిలీ జోలా తాను వ్రాసిన 'జర్మినల్' నవలకు 1880ల ఆర్థిక మాంద్య కాలాన్ని ఎంచుకొన్నారు. అందుకోసం బొగ్గుగని కార్మికులు

నివసించే ఒక కార్మికవాడని సృష్టించారు. ఈ వాడలో నివసిస్తూ, 106 సంవత్సరాల కాలం నుండీ తరతరాలుగా బొగ్గుగనుల్లో పనిచేస్తూ అక్కడే మరణిస్తున్న మహేవు కుటుంబసభ్యుల గురించి, యితర కుటుంబాల గురించి వివరించాడు. ఇక్కడి కార్మికులందరు ఒక తరం తర్వాత మరొక తరంవారు బానిసల్లా పనిచేస్తూ సరైన పోషకాహారం లేకపోవటం వలన ఎలా రక్తలేమితో పాలిపోయి, రకరకాల అంగవైకల్యాలతో బాధపడుతూ, ఆకలితో మలమల మాడిపోతూ, గని ప్రమాదాల్లో గాయపడి అవిటివారవుతూనో లేదా చనిపోతూనో నిరంతరం బ్రతుకులీడుస్తున్నారో, కొన్ని సందర్భాల్లో ధైర్యంచేసి నిరసనలు తెల్పితే ఏవిధంగా కాల్పులకు గురై చనిపోతున్నారో వివరించారు.

వీరి మధ్య ప్రేమ అన్నదే లేకపోవటం, కేవలం కామంతో పొలాల్లోనో, షెడ్డుల పైకప్పులపైననో, లేదా చెత్తగుట్టల చాటునో మొరటుగా కామక్రీడలు జరపటం అన్న విషయాన్ని ఆయా కథా సందర్భాలను బట్టి పాఠకుల ముందుంచారు. చాలని వేతనాలతో పురుషులు, స్త్రీలు, పిల్లలు బొగ్గుగనుల్లో పనిచేస్తూ, దౌర్భాగ్య వాతావరణంలో జబ్బులపాలవుతున్న కార్మికుల దుస్థితిని ఆయన కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు.

పీరాన్సు భార్యాభర్తల మాదిరి, యజమానుల తొత్తులుగా పనిచేసే కార్మికుల జీవితాలు ఎంత సౌలభ్యంగా సాగుతాయో ఆయన చూపించారు.

ఆ బొగ్గు గనుల పరిసరాల్లో వున్న అనేకమైన బార్ల (సారాకొట్లు) చుట్టూ తిరుగుతూ, దౌర్జన్యంగా ఆడపిల్లలపై అత్యాచారాలు జరిపే మృగాళ్ళను కూడా ఆయన తన నవలలో చిత్రించారు.

బలాత్కారానికి గురైనా, విధిలేని పరిస్థితుల్లో నోర్మూసుకొని సహించే, యువతుల గురించీ ఆయన వివరించారు.

అదేవిధంగా పెట్టుబడికి ప్రాతినిధ్యం వహించే 3 రకాల పెట్టుబడిదారులను, వారి స్వభావాలను ఆయన యీ నవల్లో చిత్రించారు. షేర్ హోల్డర్స్, స్వతంత్ర వాణిజ్యవేత్తలు, కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ల రూపంలో వున్న యీ పెట్టుబడి ప్రతినిధుల నిర్దిష్టపు ఆలోచనావైఖరులను, వారు అవలంబించే విధానాలను, పెట్టుబడిని వృద్ధి చేసుకొంటున్న పద్ధతులను వివరించారు.

కార్మికుల్లో కూడా సత్ప్రవర్తన కలవారినీ, బాధ్యతారహితంగా జీవించేవారిని, భార్యలను కొట్టేవాళ్ళను, స్వార్థపరులను, కార్మికులను ఘోరంగా దోపిడీ చేసుకొనే వ్యాపారస్థులను, పెట్టుబడిదారుల దళారీలుగా వ్యవహరించేవారినీ ఈ నవలలో మనం చూస్తాం.

పెట్టుబడిదారీ విధానం యొక్క అనేక పార్శ్వాలను చూపిస్తూనే, ఆయన వివిధ పరిస్థితుల్లో కార్మికులు రాజకీయంగానూ, వాస్తవ ఆచరణలోనూ ఏవిధంగా ప్రతిస్పందిస్తారో ఎంతో ప్రభావవంతంగా వర్ణించారు.

కేథలిక్ చర్చి ఏరకంగా కార్మికులకు ఉపయోగకరంగా లేదో, ఫాదర్ జోయా పాత్ర ద్వారానూ, అతడి స్థానంలో వచ్చిన ఫాదర్ రాన్వి, కేథలిక్ మతవిశ్వాసాన్ని తప్పుడు వాగ్దానాలు ద్వారా కష్టాలు అనుభవిస్తున్న బొగ్గు గని కార్మికులను మతంలోకి (కేథలిక్) మార్చిడి చేయటానికి ఏవిధంగా ప్రయత్నిస్తున్నాడో సవివరంగా చూపించారు.

కార్మికులు తమ సమస్యకు పరిష్కారం తామే కనుక్కోవాలనీ, వారు సమస్యలను ఎదుర్కోకుండా నిష్క్రియాపూర్వకమైన జడత్వంలా వుంటారా, సాత్వికులుగా లొంగిపోయి వుంటారా లేక తీవ్ర అరాచకవాదాన్ని (అన్ని ప్రభుత్వాలూ, చట్టాలు రద్దవ్వాలని వాదించే) అంగీకరించాలా అన్నది తేల్చుకోవాలంటూ పరిస్థితులు వారిని ఒత్తిడి చేస్తున్నాయన్న వైనాన్ని ఆయన చక్కగా వివరించారు.

వృద్ధ కార్మికులైన జోనెమో, మోక్సులు తమ యౌవనంలో నిరసనలు తెలిపారు. సమ్మెలు చేశారు. అయినా ఏం మేలు జరుగకపోగా, కన్నీళ్ళు, తుపాకీ గుళ్ళే మిగిలాయన్న నిర్వేదంతోనూ, ప్రతిఘటన వలన ఉపయోగం లేదన్న అభిప్రాయంతో వున్నవారిని ఆయన చూపించారు. అటువంటి నిర్వేదంలో వున్న కార్మికులు సహితం, తీవ్రమయిన దుర్భర పరిస్థితుల్లో ప్రతీకారం తీర్చుకొనే విప్లవ చర్యలకు పాల్పడవల్సిన పరిస్థితులకు నెట్టబడిన క్రమానుగత మార్పును చక్కగా వివరించారు.

1848లో జరిగిన విప్లవంలో విప్లవకారులు ఏవిధంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారో, రాజకీయ పరిస్థితులు ఎటువంటి మార్పు లేకుండా కొనసాగుతున్నాయో ఎరిగిన, నలభైయ్యవపడిలో వున్న మహేవు భార్యాభర్తలు, ఆగ్రహంతో, న్యాయం కోసం ఎదురు చూస్తూ, ఆకలి వలన, ప్రేరేపించే ఉపన్యాసాల వలన ఉత్తేజం పొంది, ఎంతో జాగ్రత్తగా వుంటూనే దృఢనిశ్చయంతో సమ్మెలో నిలకడగా పాల్గొన్న వైనాన్ని ఈ నవలలో ఆయన చక్కగా చిత్రీకరించారు.

ఆఖరుకు పని ప్రదేశంలో (భూగర్భ బొగ్గుగనిలో) తన పనికే అంకితమై, పురుష అహంకారానికి లొంగి వుండి, అణకువగా బ్రతికిన కేథరిన్ లాంటి యువతి “యీ ప్రపంచాన్ని నరికి పోగులుపెట్టాలి” అంటూ తిరగబడ్డ పరిణామాన్నీ, బొగ్గుగని ప్రమాదంలో మరణించిన తన భర్తకు జరిగిన దురన్యాయానికిగాను, యజమానులపై పగదీర్చు కోవాలని పట్టుదలతో వ్యవహరించిన బ్రూలే శ్రీమతి పాత్రను ఎంతో సహజంగా తీర్చిదిద్దారు.

అతి తక్కువ వేతనంతో, తన కుటుంబాన్ని, కుటుంబ సభ్యులను పోషించటం అసాధ్యమయిన పరిస్థితులలో బొగ్గు కార్మికుల ప్రతినిధిగా, వక్తగా ఎన్నుకోబడినా, తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేయలేని మహేవు ఏవిధంగా స్ఫూర్తిని పొంది, అప్పుడే పారిశ్రామీకరణ చెందిన ఫ్రాన్సు దేశంలో నూతనంగా ఆవిర్భవించిన కార్మికులకు ఏ స్థాయి జీవన పని పరిస్థితుల్ని సమంజసంగా కల్పించాలి అన్న సామాజిక సమస్యను లేవనెత్తే స్థాయికి చైతన్యాన్ని పొందిన వైనాన్ని యీ నవలలో ఆయన చక్కగా విశదీకరించారు. గతానుభవాల దృష్ట్యా సమ్మెల వలన అప్పటికే పేదరికంలో మ్రగ్గుతున్న కార్మికుల జీవితాలు మరింత దుర్భర మవుతాయి అనే అభిప్రాయంతో వున్న మహేవు, యజమానులతో నిలకడగా వుంటూ బేరసారాలు ఆడుతూ, కొద్దికొద్దిగా రాజీపడుతూ కార్మికుల వేతనాలలో స్థితిగతుల్లో మెరుగుదల తీసుకురావాలన్న ఆలోచనతో రాజకీయాలపట్ల అనాసక్తితో వున్న కార్మికులూ, సమ్మె కాలంలో కొత్తగా ఏర్పడిన ఇంటర్నేషనల్ (ఫ్రాన్సు శాఖ) ఆర్థిక మద్దతును పొందుతూ, ఏ రకంగా ఆ సంస్థ యొక్క విప్లవ ఎజెండా పట్ల ఆకర్షితులయ్యారో ఆయన చక్కగా చిత్రీకరించారు.

మరోవైపు ఆర్థికమాంద్యపు పరిస్థితుల్లో మోంట్సో మైనింగ్ కంపెనీ తన కార్మికులను లే ఆఫ్ చేయటంకన్నా 'లాకవుట్ చేయటంకన్నా, కార్మికులను సమ్మెకు రెచ్చగొట్టటమే మేలైన విధానంగా పరిగణించి, ఆ విధానాన్ని అమలుచేయడాన్నీ – పెట్టుబడి పన్నే తుచ్ఛమైన పన్నాగాలను ఆయన కళ్ళకు కట్టినట్లు చూపించారు.

తరతరాల శ్రమ దోపిడీకి గురవుతూ, ఎంతో ఉదాసీనతతో దుర్భరమైన బ్రతుకులీడుస్తున్న కార్మికులు, తమ దుర్భర జీవన పని పరిస్థితుల కారణంగా, అనివార్యంగా ఎలా ప్రతిఘటనకు పూనుకోవాల్సి వస్తుందో, ఆ క్రమంలో తాము పొందే అనుభవాలను (విషాదకర, చేదు) సమీక్షించుకొంటూ ఒక చైతన్యవంతమైన క్రమమైన పోరాట పద్ధతికి ఎలా చేరుకొంటారో ఈ నవలలో జోలా ఎంతో వివరంగా చిత్రీకరించారు.

కార్మిక పోరాటాలకు అరాచకవాదం, ఆర్థిక హింసావాదం, హింసాయుత చర్యలు ఏవిధంగా హానిచేస్తాయో, అందువలన అటువంటి అపసవ్య, ఉద్రేకపూరిత, మతిలేని చర్యలు ఎందుకు చేయకూడదో ఆయన ఈ నవలలో చక్కగా వివరించారు.

మనం యిరవైయవ శతాబ్దంలో చెరబండరాజు రాసిన తన పోలీసు పాటలో "మాలోనివాడివే, మా మనిషివే నీవు – పొట్టకూటికి నీవు పోలీసువయ్యావు" అన్న విషయాన్ని పోలీసులకు తెల్పుతూ, వారిని విప్లవ (ప్రజా) పోరాటం పట్ల సానుభూతిపరులుగా మద్దతుదారులుగా మలచుకోవల్సిన అవసరాన్ని గుర్తించాం! సరిగ్గా యిటువంటి అంశాన్నే 'జర్మినల్' నవలలో సమ్మె చేస్తున్న కార్మికుల నాయకత్వం గుర్తించటం, తమపై కాల్పులు జరపటానికి సిద్ధపడుతున్న సైనికులను, సైనికాధికారినీ – తామూ పోరాడుతున్న బొగ్గు కార్మికులలో వారేనని, పేద కుటుంబాల నుంచి వచ్చినవారేననీ, తమపై కాల్పులు జరపటం అన్యాయమనీ నచ్చజెప్పటాన్ని చూస్తాం! జోలా ప్రజాపోరాటాల పట్ల, వాటి నిర్వహణ పట్ల ఆనాటికే ఎంతటి స్పష్టతతో వున్నాడో మనకు అర్థమవుతుంది.

యజమానులపై కసితో, కోపంతో యంత్రాలను నాశనం చెయ్యటం తప్పు అనీ, అది కార్మికవర్గ ప్రయోజనాలకు హాని కల్గించుతుందని, జోలా తన నవలలో పేర్కొన్నారు. అనంతర కాలంలో కామ్రేడ్ స్టాలిన్, ఆవిధంగా కార్మికులు యంత్రాలను విధ్వంసం చేయటం 'ఆర్థిక హింసావాదంగా' నిర్ధారించిన విషయాన్ని జోలా తన కాలంలోనే గుర్తించాడని, యీ విషయంపట్ల స్పష్టంగా వున్నాడని మనకు అర్థమవుతోంది.

ఈ సమ్మె జరుగుతున్న కాలంలోనే ఇంటర్నేషనల్(అంతర్జాతీయ కార్మిక సంఘం)లో విభేదాలు రావటం, యీ విభేదాలు క్రమంగా ఇంటర్నేషనల్ యొక్క ఆశయాలకు, లక్ష్యాలకు హాని కలిగించటం, ఇంటర్నేషనల్‌ను అరాచకవాదులు తమ అదుపులోకి తీసుకోవటంతో ఇంటర్నేషనల్‌లో క్రమంగా జరిగినదేమిటంటే ప్రతిదీ తప్పుగా జరగటం గురించీ, అసలు లక్ష్యమే ప్రక్కదారి పట్టిన ఫలితంగా, పాత సామాజిక నిర్మాణ వ్యవస్థను ఒక్క దెబ్బతో తుడిచిపెడ్తుందని భయపెట్టిన ప్రజా ఉద్యమమైన ఇంటర్నేషనల్ పతనం చెందే సూచనలు కనపడటం గురించి, యీ నవలలో సక్రమంగా అంచనాకట్టి అరాచకవాదం యొక్క నిష్ఫలత్వాన్ని ఎమిలీజోలా ముందుగానే వెల్లడించాడు.

మొదటినుండీ మార్క్స్, ఎంగెల్సులు తదితర కమ్యూనిస్టులు భావించినట్లుగా ఎమిలీ జోలా కూడా "కార్మికవర్గం యొక్క విముక్తి కార్మికవర్గం యొక్క తప్పనిసరి చర్య కావాలి" అనే భావాన్ని ఈ నవల చిత్రీకరణ ద్వారా బలంగా ముందుకు తెచ్చారు.

పెట్టుబడిదారీ విధానంలో "చిన్న చేపను పెద్ద చేప, పెద్ద చేపను పెను చేప మింగే" విధంగా స్వతంత్ర పెట్టుబడిదారుడ్ని, పెట్టుబడిదారీ లిమిటెడ్ కంపెనీలు, పెట్టుబడిదారీ ప్రైవేటు కంపెనీలను, బడా మోనోపలీ (గుత్తాధిపత్య) సంస్థలూ ఎలా మ్రింగివేస్తాయో జోలా యీ నవలలో ప్రస్తావించారు.

ఈ దశాబ్దాంతంలోపే, విప్లవం వచ్చి దోపిడీదారులందరినీ, పాత సామాజిక వ్యవస్థను తప్పనిసరిగా తుడిచిపెట్టివేస్తుందనీ, దృఢమైన దార్శనికతను జోలా యీ నవలలో వెల్లడించారు.

రెండు నెలలకు పైగా సమ్మె చేస్తున్నా ఆకలి కడుపుమంటతో బాధపడుతున్న కార్మిక సమాజపు మహిళలు, అడవుల్లోనూ, ఎండిన పొలాల్లోనూ ఆకులు అలములు ప్రోగు చేసుకొని వాటిని తినడానికి సిద్ధపడి, సమ్మెను విరమించటానికి యిష్టపడని, వారి చైతన్యపూరిత దృఢనిశ్చయాన్ని జోలా యీ నవల్లో కళ్ళకు గట్టినట్లు చూపించాడు.

కమ్యూనిస్టు ప్రణాళికలో "బూర్జువాలు ఉత్పత్తిచేసే అన్నింటికన్నా పైన, తన స్వంత గోరి త్రవ్వేవాళ్ళను ఉత్పత్తి చేస్తుంది. దాని యొక్క పతనం, శ్రామికవర్గం యొక్క విజయం అన్నవి రెండూ అనివార్యంగానే జరుగుతాయి" అని ప్రకటించబడ్డ విశ్వాసాన్ని దృఢంగా యీ 'జర్మినల్' నవల ద్వారా సమర్థించాడు ఎమిలీ జోలా!.

అందువల్లనే యీ 'జర్మినల్' నవల ప్రజానవలగా గుర్తించబడింది. 1902లో అక్టోబరు 5న ప్యారిస్ వీధుల్లో జరిగిన ఎమిలీ జోలా అంత్యక్రియల ఊరేగింపులో, 5000 మంది ప్రజలతోపాటు, డినైన్ బొగ్గు గనుల నుండి కార్మికుల ప్రతినిధివర్గం పాల్గొనటం, ఊరేగింపు అంతటా 'జర్మినల్'! 'జర్మినల్'!! 'జర్మినల్'!!! అంటూ ఒకే పదాన్ని నినాదంగా అన్యాయానికి వ్యతిరేక సూచకంగా యివ్వటమన్నది ప్రజా నవల అని చెప్పటానికి చరిత్రలో తిరుగులేని సాక్ష్యంగా నిలిచింది.

## క్లుప్తంగా 'జర్మినల్' నవల కథ :

మోంట్సో కంపెనీకి 19 బొగ్గు బావులున్నాయి. ఈ బొగ్గు బావుల్లో పదివేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కంపెనీకి చెందిన బొగ్గుగనుల్లో రోజుకు ఐదువేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయబడుతుంది. అన్ని బొగ్గు బావులను, వర్క్‌షాపులను కలుపుతూ యీ కంపెనీకి ఒక రైల్వేలైను వుంది. ఈ కంపెనీ డైరెక్టర్లు ప్యారిస్ నగరంలో వుంటారు. మేనేజర్లు బొగ్గుబావులు నడుపుతుంటారు.

పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ మాంద్యంలో పడిపోవటంతో, అమెరికా నుండి ఫ్రాన్సులోని పరిశ్రమలకు ఆర్డర్లు (సరుకు) తగ్గిపోవటంతో, మోంట్సో ప్రాంతంలోని కొన్ని కంపెనీలు తమ కార్మికులకు లేఆఫ్‌లు

ప్రకటించాయి. హోటోన్ రిఫైనరీ కొందరి కార్మికులకు లేఆఫ్ ప్రకటించింది. బ్లేజ్‌లో వున్న బొగ్గుగనులకు కేబుల్స్‌ను తయారుచేసి యిచ్చే ఫ్యాక్టరీ అంతంతమాత్రంగా పనిచేస్తోంది. సోనెవిలె కన్‌స్ట్రక్షన్ కంపెనీకి యిప్పుడు గతంలోని మూడవ వంతు ఆర్డర్స్ మాత్రమే వస్తున్నాయి. మార్షినెలోని ఐరన్ వర్క్ కోసం వున్న మూడు బ్లాస్ట్ – ఫర్నేసుల్లోనూ, యిప్పుడు రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. గాగెబోయిస్ గాజు ఫ్యాక్టరీలో కార్మికుల జీతాలు తగ్గించేస్తున్నందుకుగాను, సమ్మె జరగబోవచ్చని అనుకొంటున్నారు. బొగ్గుగనులు తమ ఉత్పత్తిని తగ్గించివేశాయి. ఆ పారిశ్రామిక ప్రాంతమంతా పేదరికం, దుఃఖం ఆవరించింది. బొగ్గుబావులు ఆగకుండా నిరంతరం పనిచేస్తాయి. రాత్రీపగలూ కార్మికులు భూగర్భంలో 600 మీటర్ల లోతున పనిచేస్తూ వుంటారు.

సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కంపెనీ తన సంక్షోభ భారాన్ని తగ్గించుకోవటం కోసం, ఆ భారాన్ని కార్మికులపై నెడుతోంది. పారిశ్రామిక ప్రాంతంలో రెండు నెలలుగా ఫ్యాక్టరీ పని చేయకపోవటంతో, బొగ్గు బావుల దగ్గర బొగ్గునిల్వలు పేరుకుపోతున్నాయి. అలాగని కంపెనీ లేఆఫ్ ప్రకటించదలచుకోలేదు. ఎందుకంటే అందువలన, బొగ్గు గని యంత్రాలు మెయిన్‌టైన్ చేయకుండా వుంటే అవి పాడైపోతాయి. అందువలన అది కార్మికులకు వేతనాలు తగ్గించటం, రిటైర్‌మెంట్ కాబోయేవారిని ముందుగానే పని నుండి తొలగించి, వారికి పూర్తి పెన్షన్ చెల్లించాల్సిన అవసరాన్ని తగ్గించుకొంటోంది. కార్మికులపై జుల్మానాలు ఎక్కువగా విధిస్తోంది.

## బొగ్గుగని కార్మికుల దుర్భర పరిస్థితి :

లోవోరో బొగ్గు గని ప్రాంతంలో, కార్మికులు నివసించే గ్రామం వుంది. దాన్ని 240వ గ్రామంగా పిలుస్తారు. కార్మికులు నివసించే గ్రామాలకు యజమానులు పేర్లు పెట్టకుండా, ఫలానా నంబరు గ్రామం అని పిలుస్తారు. అక్కడ నివసించే ప్రజలందరూ, ఆర్థికమాంద్య ఫలితంగా, తమపై నెట్టబడిన సంక్షోభ భారాన్ని భరిస్తూ నికృష్టమైన పేదరికాన్ని అనుభవిస్తూ, దైన్యమైన జీవితాలను గడుపుతున్నారు. వారి పేదరికం ఎంత ఘోరంగా వుందంటే ఏ కుటుంబంలోనైనా ఎదిగిన ఆడపిల్లను ఎవరైనా లేవదీసుకుపోయినా, ఆ పిల్లే ఎవరితోనైనా లేచిపోయినా, ఆ కుటుంబసభ్యులు కోపపడటంకానీ, బాధపడటంకానీ చేయక, తాము తిండిపెట్టాల్సిన ఒక సభ్యురాలైనా కుటుంబం నుండి తగ్గినందుకు సంతోషపడతారు.

ఇటువంటి పరిస్థితుల్లో పనిచేస్తున్న ఆ లోవోరో బొగ్గు గని ప్రాంతానికి ఏదైనా పని దొరకుతుందేమోనని ఎటినే లేంటియర్ అనే ఒక యువకుడు కాళ్ళీడ్చుకుంటూ వచ్చాడు. ఇతడు ఒక మెకానిక్. లిల్లీలోని రైల్వే వర్కుషాపులో పనిచేస్తూ, సూపర్‌వైజర్‌ను కొట్టినందుకు గాను ఉద్యోగం పోగొట్టుకున్నాడు. అనంతరం ఎంత ప్రయత్నించినా ఎక్కడా పనులు దొరకకపోవటంతో, లోవోరో ప్రాంతానికి వచ్చాడు. అక్కడి బొగ్గుగని కార్మికులతో పరిచయం చేసుకొని, తనకు తిండిలేని – పనిలేని దీనస్థితిని వారికి చెప్పి వారి సానుభూతి పొంది, వారి సలహాతో గని యింజనీరుని కలసి, అక్కడ పని సంపాదించాడు. ఇతర కార్మికులతోపాటు, భూగర్భ బొగ్గు గనిలో పనిచేస్తూ వారి పని పరిస్థితులను, కష్టనష్టాలను తెలుసుకోవటమేగాక, వారితోబాటు 240 గ్రామంలోనే వుంటూ అక్కడి కార్మిక కుటుంబాల దుర్భరమైన జీవన పరిస్థితులను, దైన్యస్థితిని కళ్ళారా చూస్తూ, ఆ జీవన పనిపరిస్థితుల పట్ల – వాటిని కల్పించిన వ్యవస్థ పట్ల తీవ్రమయిన వ్యతిరేకతను పెంచుకొంటాడు. అతడు అప్పటికే లిల్లీ నగరంలోని తనకు పరిచయం వున్న ఒక మిత్రుడి ద్వారా ఇంటర్నేషనల్ గురించీ, దాని లక్ష్యం గురించీ, దాని ఆశయాల గురించీ తెలుసుకొన్నాడు. పెద్దగా చదువుకోకపోయినా మెల్లగా 'డార్విన్ పరిణామవాదాన్ని', 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను, కార్ల్‌మార్క్స్ యొక్క 'పెట్టుబడి గ్రంథం'లోని కీలక అంశాలను గురించి చదివి తెలుసుకొన్నాడు. ఈ జ్ఞానంతో అతడు బొగ్గుగని కార్మికుల్లో వారి జీవితాలు అలా దైన్యంగా వుండటానికి, పేదరికంలో దిగబడ్డానికి కారణాలను బోధపరచటం మొదలుపెట్టాడు. అలా గ్రామంలోని ప్రజలందరికీ తలలో నాలుకయ్యాడు.

## బొగ్గు గనుల్లో భద్రతా ఏర్పాట్లు చేయని యాజమాన్యం

బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులు నిరంతరం ప్రమాదాల బారినపడి మరణించటమో, అంగవికలురవటమన్నది అక్కడ సర్వ సాధారణ విషయంగా వుంది. గని పైకప్పు కూలిపోయో, గనిలోకి వరదనీరు ప్రవహించో, భూగర్భంలో గాలి ఆడక విషవాయువులు విస్ఫోటం జరపటం వల్లనో యీ ప్రమాదాలు జరుగుతాయి. ఈ ప్రమాదాలను జరగకుండా భద్రతాఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత గని యజమాన్యానిది. కాని గని యజమాన్యం అటువంటి భద్రతా ఏర్పాట్లకు ఖర్చుపెట్టడానికి యిష్టపడదు. మరోవైపు ప్రమాదాలు జరగటం వలన జరిగే మరణాలకు, అంగవైకల్యాలకు నష్టపరిహారం చెల్లించటానికీ యిష్టపడదు. ఆరకంగా తమ ప్రాణాలు తామే కాపాడుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను తామే భరించే బాధ్యతను కార్మికులపైనే పెట్టింది. ప్రధానంగా గని పైకప్పు కూలిపోకుండా, గని త్రవ్విన భాగంలో పైకప్పుకు కలప దూలాలతో పోటీ పెట్టాలి. బొగ్గు తవ్వినంత ప్రాంతం మేరకూ, త్రవ్వకంతోపాటు పైకప్పు కూలకుండా కలప దూలాలను నిరంతరం పోటీ పెట్టే బాధ్యత కార్మికులపైన యాజమాన్యం పెట్టింది. రోజుకో జట్టుకు చెందిన కార్మికులు యిలా కలపపోటీలు పెట్టిన తర్వాతే, బొగ్గు త్రవ్వే పని చేయాలి. గని కార్మికులకు త్రవ్విన బొగ్గు పరిమాణాన్ని బట్టి అంటే టబ్బుల లెఖ్ఖన కూలిగట్టి యిస్తారు. అంతేకాక ఎన్ని టబ్బులు బొగ్గు తవ్వినా అందులోని నాసిరకం బొగ్గు టబ్బులకు కూలి యివ్వరు. అందువలన పైకప్పు కూలకుండా ఏర్పాటు (కలపతో పోటీ పెట్టే పనిని) చేసిన జట్టు కార్మికులకు, ఆ పనికోసం తమ పని కాలాన్ని వెచ్చించినందున, ఎక్కువ టబ్బుల బొగ్గు దొరకదు. ఆ మేరకు వారు ఆరోజు కూలి నష్టపోవాల్సిందే!. అందువలన వారు కూడా ఆ పనికి ఎక్కువ శ్రద్ధ చూపించకుండా, తొందర తొందరగా పని పూర్తిచేసి,

బొగ్గు త్రవ్వకంలోకి దిగిపోతారు. వీలైనంత తక్కువ కాలంలో ఆ పని పూర్తిచేస్తారు. ఈ అజాగ్రత్త వలన పైకప్పు కూలిపోయి ప్రమాదాలు జరుగుతూనే వుంటాయి. పైకప్పుకు పోటీ పెట్టే పనిని సక్రమంగా చెయ్యలేదనే కారణంతో, ఇంజనీరు ఆ జట్టు సభ్యులకు జుల్మానా తన యిష్టానుసారం విధించి, వారి వేతనాల్లో కోతబెడ్తాడు. అప్పటికే వేతనాల తగ్గింపు, పాక్షిక లేఆఫ్‌లూ వలన అంతంతమాత్రంగా వున్న రాబడి తగ్గిపోతూ వున్న కార్మికులకు, యీ జుల్మానాలు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా వున్నాయి. కార్మికుల్లో యీ విధానం పట్ల వ్యతిరేకత, తాము ఏమీ చేయలేని నిస్సహాయతా వారికి కోపం తెప్పిస్తూ వుంటుంది. ఈ అన్యాయాన్ని గమనించిన లేంటియర్, ఆ కార్మికులకు యీ విధానాన్ని నిరసించేందుకు సంఘటితపరుస్తాడు. బొగ్గు కార్మికుల్లో సత్ప్రవర్తన కలిగి ఒక మంచి పద్ధతిలో వున్న పెద్దమనిషిగా పేరొందిన మహేవు లాంటి కార్మికులు అందుకు అంగీకరిస్తారు.

దాంతో లేంటియర్, మహేవు మరికొందరి కార్మికులతో కలసి, యజమాన్యం (ఇంజనీర్) వద్దకు వెళ్ళి, తాము పైకప్పు పోటీ పెట్టే పనులు చేయమనీ, ఆ పని చేయటం వలన తమ కూలీ తగ్గిపోతోందని, అందువలన ఆ పని చేయటానికి వేరొకరిని విడిగా నియమించమనీ కోరుతారు. అందుకు అంగీకరించని ఇంజనీరు, ఒకవేళ యజమాన్యం వేరుగా పైకప్పుకు పోటీ పెట్టే పనికి కార్మికులను నియమించుకొంటే, ఆ మేరకు కార్మికులకు ఒక టబ్బుకు యిచ్చే కూలీని తగ్గించేస్తామని చెప్తాడు. అందుకు కార్మికులు అంగీకరించరు. కానీ విధిలేని పరిస్థితుల్లో ఎప్పటిలాగే వారు పాతపద్ధతిలోనే పనిచేస్తున్నారు. విధించిన జుల్మానాల కోతలను భరిస్తున్నారు. కానీ యీ అన్యాయం పట్ల వ్యతిరేకతతో ఆగ్రహంతో వుడికిపోతున్నారు.

బొగ్గుగని కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ లేదు. అది లేకపోతే ముందు కాలంలో ఏ అవసరం వచ్చినా, వారికి ఆర్థిక అవసరం వచ్చినా అది తీరదు. ఆ విషయాన్ని గమనించిన లేంటియర్, కార్మికులకు ఆ విషయం తెలియజెప్పి కార్మికులు తమకు తాముగా భవిష్యనిధిని ఏర్పాటు చేసుకొనేటట్లు చేస్తాడు. ఆ నిధికి కార్యదర్శిగా అతడినే కార్మికులు ఎంచుకొంటారు. ఈ విషయం తెలిసిన యాజమాన్యం కార్మికులపై గుర్రుగా వుంది. ఆ ఫండ్‌లాంటి ఆర్థిక భరోసా ఏర్పడితే, కార్మికులు యాజమాన్యాన్ని ఎదిరించటానికి జంకరు అనేది యాజమాన్యం యొక్క భయం. అయినా కార్మికులను భయపెట్టడం కోసం, "తాను విడిగా పైకప్పుకు పోటీ పెట్టే పనులకు ఏర్పాటు చేస్తాననీ, కార్మికులకు ఒక టబ్బుకు చెల్లించే కూలిని తగ్గిస్తానని నోటీసు వేసింది. దాంతో కార్మికుల ఆగ్రహం పెరిగింది.

## కార్మికులలో రగులుతున్న ఆగ్రహం :

ఈ పరిస్థితుల్లో కార్మికుల్లో ఓపికగా పనిచేస్తూ, వారిని సంఘటిత పరుస్తూ, క్రమక్రమంగా వారి చైతన్యాన్ని పెంచుతూ, యజమాన్యపు నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులను నిరసన కార్యాచరణలోకి దింపాలనే ప్రయత్నాల్లో వున్నాడు లేంటియర్. ఈ ప్రయత్నంలో తనతోబాటు మహావూనూ, మరో మెకానిక్ అయిన సువేరన్‌ను కలుపుకొన్నాడు. అతడు రష్యా దేశస్థుడు. అతడు తులా రాష్ట్రంలోని ఒక కులీన కుటుంబానికి చెందినవాడు. అతడు సెయింట్ పీటర్స్ బర్గులో మెడిసిన్ చదువుతున్నప్పుడే సోషలిజంపట్ల ఆకర్షితుడయ్యాడు. అందువలన భౌతిక శ్రమ చేసే మెకానిక్‌గా మారడం, జారు చక్రవర్తిపై జరిగిన హత్యాప్రయత్నం విఫలమవటంతో అతడు రష్యా నుండి పారిపోయి వచ్చి ఫ్రాన్సులో ఒక రాజకీయ శరణార్థిగా జీవితాన్ని గడుపుతున్నాడు. ఇతడి బృందంలో మరో వ్యక్తి రాసెన్నువర్. రాసెన్నువర్ మూడేళ్ళక్రితం జరిగిన సమ్మెలో ఉద్యోగం పోగొట్టుకున్నవాడు. కంపెనీ కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ, బొగ్గుగని కార్మికులను నిరంతరం తిరగబడమని బోధిస్తూ వుంటాడు. వీరితోపాటు మహావు కూడా యీ బృందంలోకి ఆకర్షితుడయ్యాడు. వీరందరూ కలసి దీనావస్థలోనున్న కార్మికులను బొగ్గుగని కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసనాందోళనలు జరిపేందుకు ప్రోత్సహిస్తున్నారు.

యాజమాన్యం వేసిన నోటీసు ప్రకారం, టబ్బుకు యిచ్చే కూలిని తగ్గించటం అన్న విషయాన్ని వ్యతిరేకిస్తూ అది అన్యాయం, ఆ విధానాన్ని రద్దుచేసి, గని పైకప్పు కూలిపోకుండా కలప పోటీ పెట్టే పనితో సంబంధం లేకుండా టబ్బుకు ప్రస్తుతం యిచ్చే రేటే చెల్లించమని కోరటం కోసం యీ బృందం మేనేజర్‌ను కలుస్తుంది. ఆ మేనేజర్ వాళ్ళు చెప్పినదంతా విని, వారి కోర్కె న్యాయమైనదైనా, అది యిప్పటి సంక్షోభ పరిస్థితులలో అంగీకరించము అని తేల్చి చెబుతాడు.

యజమాన్యపు యీ మొండి వైఖరి ఆ ప్రతినిధి బృందానికి కోపం తెప్పిస్తుంది. అదే విషయాన్ని కార్మికులందరినీ విడివిడిగా సమావేశపరచి ఏదైనా ప్రత్యక్ష నిరసన కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరాన్ని గురించి చెప్పి అందుకు వారిని సన్నాహపరిచే కృషిలో పడుతుంది. లేంటియర్ బృందం, రాసెన్యువర్ యింట్లో తరచు సమావేశమవుతూ, కార్మికుల సమస్యల గురించీ, కార్మిక రాజకీయాల గురించీ చర్చించుకొంటూ, బొగ్గుగని కార్మికుల ఆందోళనలకు సంబంధించిన కార్యకలాపాలను నిర్ణయిస్తూ వాటిని అమలుజరిపే చర్యలు తీసుకొంటుంది. ఈ సమావేశాల్లో రాసెన్యువర్ భార్య కూడా పాల్గొని, భర్తకన్నా ఎక్కువ చైతన్యంతో చర్చలు జరుపుతుంది.

బొగ్గుగని యజమాన్యం, తనకు తొత్తులైన కార్మికుల ద్వారా వీరి కార్యకలాపాలపై ఒక కన్నేసింది.

కార్మిక (నాయకత్వ) బృందంలో జరిగే చర్చల్లో లాంటియర్ మొదటి ఇంటర్నేషనల్ కార్యకలాపాల గురించీ, మార్క్సు సిద్ధాంతం గురించీ, కార్మికులను వర్గ చైతన్యవంతులుగా చెయ్యటం గురించీ క్రమంగా వారి రాజకీయ చైతన్యాన్ని, పోరాట చైతన్యాన్ని పెంచుతూ వారిని సంఘటితపరిచి వారిచే స్వయంగా విప్లవ పోరాటాలను నిర్వహించాల్సిన విషయాల గురించి చర్చిస్తే, సువేరిన్ బకూనిన్ యొక్క అరాచకవాద విప్లవ సిద్ధాంతాన్ని గురించీ, తక్షణమే కార్మికులు తిరుగుబాటు చేసి విప్లవం చెయ్యాల్సిన అవసరం గురించీ, మొదటి

ఇంటర్నేషనల్‌లో మార్క్స్ మద్దతుదారులు అరాచకవాద శక్తులను వ్యతిరేకించడం గురించీ చర్చిస్తున్నా, కార్మికులు సమష్టిగా పోరాడవల్సిన అవసరాన్ని తాను కూడా అంగీకరిస్తాడు.

పైకప్పును నిలబెట్టే టింబరింగ్ పనిని కార్మికులు నిర్లక్ష్యం చేస్తున్నందుకుగాను ఆగ్రహం చెందిన గని యజమాన్యం తాను డిసెంబరు 1 నుండి, ప్రకటించిన నోటీసులో చెప్పినట్లు, టబ్బు కూలిరేటు తగ్గించి, విడిగా పైకప్పును నిలబెట్టించుకొనే పద్ధతిని అవలంబిస్తానని ప్రకటించింది.

## సమ్మె ప్రారంభం :

అసలే పేదరికం అనుభవిస్తున్న కార్మికులకు యాజమాన్యపు మొండి వైఖరి తీరని ఆగ్రహం తెప్పించింది. లేంటియర్ బృందం పరిస్థితులను సమీక్షించి, డిసెంబర్ 1 నుండి యాజమాన్యపు మొండి వైఖరిని నిరసిస్తూ సమ్మె జరపాలనే నిర్ణయం చేస్తుంది. ఆ ప్రకారం కార్మికుల్లో ప్రచారం చేస్తుంది. కార్మికులందరి సమ్మతితో సమ్మె ప్రారంభమవుతుంది.

అయితే సమ్మె ప్రారంభమై 15 రోజులు దాటినా యాజమాన్యం కార్మికులతో సంప్రదింపులు జరపలేదు. ఆ స్థితిలో మహేవు సలహాతో, లేంటియర్ బృందం స్వయంగా, యాజమాన్యంతో సంప్రదింపులు జరపటానికి వెళ్ళింది. మేనేజర్ వీరు చెప్పేది వినక లేంటియరే కార్మికులను అనవసరంగా సమ్మెలోకి దింపాడని, కార్మికులను మొదటి ఇంటర్నేషనల్‌లో సభ్యులుగా జేర్పించి సమస్యను జటిలం చేశాడని ఆరోపించాడు. అతడి ఆరోపణలను మహేవు తిరస్కరిస్తూ తామెవ్వరం మొదటి ఇంటర్నేషనల్‌లో సభ్యులుగా చేరలేదనీ, యాజమాన్యం సృష్టించిన పరిస్థితులే కార్మికులకు సమ్మె చేయటం తప్ప మరో మార్గం లేకుండా చేసిందని వివరిస్తాడు. కానీ మేనేజరు యీ విషయంలో తాను చేయగల్గిందేమీ లేదని చెప్పి వాళ్ళను పంపించేస్తాడు.

సమ్మె చేస్తున్న కార్మికులు తాము ఏర్పాటు చేసుకొన్న ప్రావిడెంట్ ఫండ్ నుండి డబ్బు తెచ్చుకొని కాలం గడుపుతున్నారు. అయితే ఆ నిధి కూడా తరిగిపోతూండటంతో ఏం చెయ్యాలో తెలీక ఆలోచిస్తున్నారు. యాజమాన్యపు తొత్తయిన కార్మికులు సమ్మెను మానుకొని పనుల్లోకి చేరిపోదామని సలహా యివ్వటంతో కార్మికుల్లో గందరగోళం ఏర్పడింది.

ఆ సమయంలో వారితో లేంటియర్ ఒక పెద్ద సమావేశం నిర్వహించాడు. మూడువేల మందిపైగా పాల్గొన్న ఆ సమావేశంలో, కార్మికులకు ఇంటర్నేషనల్‌ను గురించి చెప్పి, అది తమకు సహాయం చేస్తుందనీ, అందులో చేరటం వలన కార్మికులకు (సమ్మెచేసే) ఎన్నో విధాలుగా ఆర్థిక సహాయంతోపాటు మద్దతు లభిస్తుందనీ, సమ్మెలో వున్నాం కనుక యిప్పుడు మనం సభ్యత్వ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, పరిస్థితులు చక్కబడ్డాక ఆనక చెల్లించవచ్చుననీ తెలియజేశాడు. అందుకు కార్మికులు ఏకగ్రీవంగా అంగీకరించటంతో, ఆ కంపెనీలోని 10 వేలమంది ఇంటర్నేషనల్‌లో సభ్యత్వం తీసుకొన్నారు. ఇంటర్నేషనల్ నుండి – వివిధ దేశాల కార్మికుల నుండి ప్రోగుచేసిన మొత్తాలు – సమ్మె చేస్తున్న కార్మికులకు ఆర్థిక సహాయం అందుతుంది.

ఐతే సమ్మె రెండు నెలలదాకా సాగటంతో, ఇంటర్నేషనల్ కూడా, నిధులు లేక ఆర్థిక సహాయం యివ్వలేకపోయింది. అయినా కార్మికులు – ప్రత్యేకించి కార్మిక కుటుంబాల స్త్రీలు – పొలాల్లో, అడవిలో దొరికే ఆకులు, అలమలు తిని జీవిద్దాంకానీ, సమ్మెను ఆపకుండా కొనసాగిద్దామనే దృఢమైన నిర్ణయాన్ని ప్రకటించారు. ఆకలితో మాడి చావటానికైనా సిద్ధపడ్డారుగానీ, యాజమాన్యానికి లొంగిపోవటానికి యిష్టపడలేదు. కార్మిక కుటుంబాలకు పచారీ సరుకులు యిచ్చే అంగడి యజమాని అంతవరకూ యివ్వాల్సిన అప్పు తీరిస్తే తప్ప సరుకులను ఇవ్వలేనన్నాడు.

ఇంతలో స్వతంత్ర పెట్టుబడిదారులు నడుపుతున్న బొగ్గు బావుల్లో సమ్మె జరగటల్లేదనే విషయం సమ్మెదారులకు తెలుస్తుంది. వారు ఆగ్రహంతో ఊగిపోతూ, సువేరిన్ రెచ్చగొట్టడంతో, ఆ గనుల్లో పని ఆపాలని నిర్ణయిస్తారు. ఇందుకు మనం అక్కడ ఎటువంటి అల్లరి లేకుండా, శాంతియుతంగా, బావుల్లోకి కార్మికులు దిగకుండా పికెటింగ్ చేద్దాం అని లాంటియర్ అంగీకరింపజేస్తాడు. ఆ ప్రకారమే ఆ గనుల దగ్గరకు వెళ్ళాక అల్లరిమూకలతో రెచ్చగొట్టబడి ఆగ్రహంతో వున్న కార్మికులు ఒక గనిలోని యంత్రాలను విధ్వంసం చేస్తారు. లేంటియర్ వారిని ఎంతగా అదుపు చేయాలని ప్రయత్నించినా ఆగకుండా ఆగమాగం చేస్తారు. అదే ఊపులో ఊళ్ళోకి వెళ్ళి తమకు సరుకులు అప్పుగా యివ్వ నిరాకరించిన దుకాణాన్ని ధ్వంసం చేస్తారు. దుకాణం యజమానిని, అతడి భార్యనూ చితకబాదుతారు. అది సరైన పద్ధతి కాదనీ, కార్మికులంతా ఊరేగింపుగా అన్ని బావుల వద్దకూ వెళ్దాం అని కార్మికులను ఒప్పించి, వారంతా ఊరేగింపుగా, జాతీయగీతం 'మార్సెల్లు' పాడుతూ మాకు 'తిండి కావాలి!' 'తిండి కావాలి!' అని నినాదాలు చేస్తారు. ఊరేగింపు వెళ్ళేదారిలో మేనేజర్ యిల్లు కనబడటంతో, కొందరు ఆ యింటిమీద దాడిచేసి, మేనేజరు భార్యనూ, కుమార్తెనూ చితక్కొడతారు.

దీంతో బొగ్గు కంపెనీ గని యజమాన్యం, గని ప్రాంతం అంతటినీ సాయుధ సైన్యంతో నింపుతుంది. ప్రతీ బొగ్గు బావి వద్దా సైన్యాన్ని కాపలా పెడుతుంది. అంతేకాక ఎటూ కార్మికులు సమ్మె విరమించ నిరాకరిస్తున్నారు కాబట్టి, బెల్జియం నుండి పోటీ కార్మికులను తెచ్చి పనిచేయించుకోవటానికి యాజమాన్యం నిర్ణయించి, ఆ పోటీ కార్మికులను రప్పించి రాత్రిపూట ఎవ్వరికీ తెలియకుండా బొగ్గుబావుల్లోకి పనిచేయ దింపుతుంది.

ఈ విషయం తెలుసుకొన్న సమ్మెచేస్తున్న కార్మికులు లోవారె బొగ్గుగని దగ్గరకు చేరుకొంటారు. బావిలోకి దింపిన బెల్జియం కార్మికులను వెంటనే పైకి తెప్పించమని అక్కడున్న సైనికులతో వాదనకు దిగుతారు. సైనికాధికారి వాళ్ళకు నచ్చజెప్పటానికి ప్రయత్నిస్తున్నా, మహేవూ కార్మికులను అల్లరి చేయొద్దు తాము సైనికులతో మాట్లాడుతామని చెప్తున్నా, సైనికులను కొందరు తీవ్రంగా బూతులు తిడుతూండటంతో ఆగ్రహం చెందిన సైనిక అధికారి ముగ్గురు అల్లరి చేస్తున్న కార్మికులను అదుపులోకి తీసుకొంటాడు. అందుకు రెచ్చిపోయిన కార్మికులు, ఆ సైనికులపై అక్కడ పడివున్న యిటుకలతో దాడి చేయడం

ప్రారంభించారు. వందలమంది తమ మీద యిటుకలు విసురుతూండటంతో తట్టుకోలేని సైనికాధికారి ఫైరింగ్ ఆర్డర్ యివ్వడంతో, సాయుధ సైనికులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో అల్లరిమూకలను వారిస్తున్న మహేవుకు గుళ్ళు తగిలి అతడు అక్కడికక్కడే మరణిస్తాడు. ఆ కాల్పులకు హతాశులైన కార్మికులు పారిపోతున్నా కూడా కాల్పులు జరగటంతో ఇద్దరు బాలలు, ముగ్గురు మహిళలతో సహా 14 మంది మరణిస్తారు. 25 మంది తీవ్రంగా గాయపడతారు. అనేకమందిని అరెస్టుచేసి జైలుకు పంపారు.

## సమ్మె విఫలం :

మారుమూల జరిగిన యీ ఉదంతం ప్రచారం కాకుండా జాగ్రత్తలు తీసుకొన్న కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమ్మెకు స్వస్తి చెప్పాలని నిర్ణయించింది. బెల్జియం పోటీ కార్మికులను వెనక్కి పంపేసింది.

తప్పుదారి పట్టిన కార్మికుల చర్యల పర్యవసానాన్ని కార్మికులు ప్రత్యక్షంగా చూశారనీ, తాను బావులను తిరిగి తెరుస్తున్నానని అందరూ పనిలోకి చేరాల్సిందని ప్రకటిస్తున్న పోస్టర్లను ఊరంతా అతికించింది. ఎవర్ని ఉద్యోగం నుండి తొలగించిందో, తమపై ఏవిధమైన కక్ష సాధింపు చర్యలు తీసుకోబోతోందో ఆ ప్రకటనలో తెలియజేయలేదు.

అప్పటికే రెండున్నర నెలలు గడిచినా, ఏ దారీ తెన్నూ లేక ఆకలితో అలమటిస్తున్న కార్మిక కుటుంబాలు సమ్మెను విరమించి, తిరిగి పనిలోకి వెళ్ళాల్సిన విధిలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. ఆ రకంగా సమ్మె విఫలమయింది. ఓడిపోయింది.

"కార్మికులు పనిలో జేరితే, డిస్మిస్ చేయబడ్డ కార్మికులను కూడా క్షమించి పనిలోకి తీసుకొంటాం!" అంటూ కంపెనీ పోస్టర్లు అతికించింది.

లేంటియర్‌తోపాటు అందరూ పనిలో చేరారు. వారు బావిలోకి దిగుతూండగా బొగ్గు బావి అంతా నీటితో నిండిపోయి వుంటుంది. అయినా గోడను త్రవ్వి నీటిని బయటికి పంపే ప్రయత్నాలు చేస్తుండగా, నీటి ఉధృతికి బావి మొత్తం కూలిపోయింది. బావిలోకి దిగిన కార్మికుల్లో కొందరు అలా కూలిపోవటం గమనించి, బయటికి పారిపోయారు. కొందరు చిక్కుకుపోయారు. వర్షాలు రావటం వలన వర్షపునీరు బావిలోకి వెల్లువలా రావటం వలన అలా జరిగింది. చిక్కుకుపోయినవారిలో – కూలిపోయిన బావిలో – లేంటియర్ కూడా వుంటాడు. గని ఇంజనీర్ భూగర్భంలో చిక్కుకుపోయినవారిని రక్షించే చర్యలు చేపట్టాడు. కార్మికులు యీ కార్యక్రమంలో ఇంజనీర్‌తోపాటు అహర్నిశలు శ్రమపడ్డారు. ఎట్టకేలకు 15 రోజుల అనంతరం, భూగర్భంలో అట్టడుగున చిక్కుకొన్న వారితోసహా యించుమించు అందరినీ రక్షించారు.

గని యాజమాన్యం తాము లేంటియర్‌ను పనిలో పెట్టుకోలేమనీ పనిలోంచి తీసివేస్తున్నామనీ, అతడికి వేరే పని దొరికేదాకా ఖర్చుల కోసం 100 ఫ్రాంకులు గ్రాంటు చేస్తున్నామనీ తెలుపుతుంది. అతడు ఆ మొత్తాన్ని తీసుకోక, తిరస్కరిస్తూ పనిమానివేసి మరొకచోటకు బయల్దేరాడు. మహేవు భార్యకు – లామెమోదుకు – ఒక ప్రత్యేకమైన కేసుగా పరిగణించి, కారుణ్యం దృష్ట్యా బొగ్గుగనిలో పనిచేయటానికి కంపెనీ యాజమాన్యం పని యిచ్చింది!

ఇప్పుడు లేంటియర్ యొక్క అధ్యయనం పూర్తి అయింది. బొగ్గుగనిలో పనిచేయటం వలన పరిపక్వత పొందాడు. అక్కడి అనుభవాలతో రాటుతేలి మరింత దృఢంగా తయారయ్యాడు. అతడు యిప్పుడు బూర్జువాలను మరింతగా ద్వేషిస్తున్నాడు. కార్మికుల దారిద్ర్యాన్ని కళ్ళారా చూసి, అనుభవించిన అతడు తన లక్ష్యాన్నీ, కార్యక్రమాన్ని మరింత విస్తృత పరచుకొని, కార్మికులను మరింతగా సంఘటితపరచి, వారి పోరాటం నిర్వహింపజేయాలని మరింత గట్టిగా నిర్ణయించుకొన్నాడు.

ఇప్పుడు మరింత జ్ఞానంతో సాయుధమై, విప్లవ సైనికుడిగా ముందుకు కదిలాడు. ఏదో ఒకరోజున కోట్లమంది కార్మికులు, భుజం భుజం కలిపి తమకు శత్రువులైన ధనవంతులకు వ్యతిరేకంగా పోరాడి వారి అధికారాన్ని లాక్కొంటారు. తామే యజమానులు (రాజ్యాధికారులు) అవుతారు! ఒక నవోదయం వస్తుంది. అది న్యాయం నిజాలతో కూడిన నవోదయమవుతుంది అని ఆలోచిస్తూ లేంటియర్ ముందుకు సాగేడు!

★ ★ ★

ఈ రకంగా భూగర్భంలో విత్తబడిన విప్లవ బీజాలు అంకురిస్తున్నాయన్న అర్థంతో తన నవలకు 'జర్మినల్' అనే పేరు పెట్టాడు ఎమిలీ జోలా! భూగర్భం లోతుల్లో వెదజల్లబడిన విప్లవ చైతన్యం మెల్లగా మొలకెత్తుతోందని అది ఒకరోజున భూమిపైకి చొచ్చుకు వచ్చి అంతిమంగా వెలుగును చూస్తుందనీ, లక్షలమంది కార్మికుల సైన్యం పుట్టుకొస్తోందనీ ఎమిలీ జోలా తన దార్శనికతను వెల్లడించాడు. విస్తృతమైన కాన్వాసుపై, కురుక్షేత్రం లాంటి బొగ్గుగని కార్మికుల సమ్మె పోరాటాన్ని చిత్రీకరించాడు.

1917లో లెనిన్ నాయకత్వాన విప్లవం విజయవంతమై కార్మికవర్గ నియంతృత్వాన సోవియట్ యూనియన్ స్థాపించబడటం ఆయన దార్శనికతను నిజం చేసింది. ఆయన బ్రతికివుంటే ఈ పరిణామానికి ఎంతగానో సంతోషించి వుండేవాడు.

నేటి 21వ శతాబ్దంలో కూడా యీ 'జర్మినల్' నవలకు ప్రాసంగికత వుంది. ఎందుకంటే యీనాడు కూడా ఆఫ్రికా దేశపు బొగ్గు, తదితర భూగర్భ గనుల్లోనూ, మనదేశంలోని కొంతకాలం జాతీయం చేయబడి తిరిగి ప్రైవేటీకరింపబడుతున్న బొగ్గు గనుల్లోని కార్మికుల పరిస్థితి నాటి మాదిరిగానే ఘోరంగా వుంది. సమ్మెచేసిన కార్మికులపై యిప్పటికీ ఆఫ్రికా దేశాల్లో సైన్యాలు కాల్పులు జరుపుతూనే వున్నాయి. మనదేశంలో కూడా ఆ కార్మికులపై తీవ్రమయిన నిర్బంధం – అణచివేతలు ప్రయోగింపబడుతున్నాయి. కార్మికవర్గం సంఘటితపడి పోరాడకుండా పలు దోపిడీ కార్మిక వ్యతిరేకశక్తులు పన్నాగాలు పన్నుతూనే వున్నారు. ఈ కార్మిక వ్యతిరేక శక్తులకు నయా ఉదారవాదంపేరిట సాగే సామ్రాజ్యవాదం యొక్క ప్రోత్సాహ, మద్దతులు బలంగా వున్నాయి.

కార్మికోద్యమంలో పనిచేసే ప్రగతిశీల, విప్లవ శక్తులకు యీ 'జర్మినల్' నవల మరింత పోరాటస్ఫూర్తిని, దీక్షను అందజేస్తుంది!

ఎవరైనా ఔత్సాహికులు యీ 'జర్మినల్' నవలను తెలుగులోకి అనువదించి, తెలుగు పాఠకలోకానికీ, ప్రత్యేకించి కార్మికవర్గానికి అందజేస్తారని ఆకాంక్షిస్తున్నాను. ●

స్మరించుకుందాం

# పుస్తకమణికి జోహార్లు!

\- పినాకిని

**పెళ్లిళ్లలో** కూడా పుస్తకాలే బహుమతులుగా ఇచ్చే మా మణిగారు భౌతికంగా ఇకలేరని తెలిసిన వెంటనే ఒక్క క్షణం దుఃఖం అనిపించింది. అనేక సంవత్సరాలుగా ఆయనతో వున్న జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా గుర్తుకొచ్చాయి. దక్షిణాదిలో అనేకమంది రచయితలకు నెల్లూరు, కావలి తదితర కాలేజీలలో చదువుతూ విద్యార్థి ఉద్యమాలలో, ఇతర ప్రజా ఉద్యమాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మణి గారితో ఏవో కొన్ని జ్ఞాపకాలు తప్పకుండా వుండే వుంటాయి. ఆ ప్రాంతంలో రకరకాల మంచి పుస్తకాలతో పరిచయమున్న వారంతా ఈ సందర్భంగా మణిగారిని, ఆయన నిలబెట్టిన 'మణి బుక్ స్టాల్'ని మరొకసారి గుర్తు చేసుకుంటూ వుంటారు. ఆయన పుస్తకాలు ఇచ్చేటప్పుడు వాటిపై స్టాంప్ వేయడం ఎప్పుడూ మర్చిపోరు. అలాగే అక్కడికి వచ్చిన వారి మనసులో కూడా ముద్రపడేలా ఏదోఒకటి చర్చిస్తారు. వయసుతోపాటు వచ్చే పరిమితులకు గౌరవం ఇచ్చి నెల్లూరు నుంచి ఆయన వెళ్ళిపోయినా చాలాకాలంపాటు మాతో ల్యాండ్ ఫోన్ కైనా అందుబాటులోనే వున్నారు. ఇప్పుడు కవరేజ్ ఏరియాలో కూడా లేకపోవడమే అందరి బాధకు కారణం. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఎన్నో కష్టాలకోర్చి నెల్లూరు వీధుల్లో అభ్యుదయ, హేతువాద, మార్క్సిస్టు సాహిత్యం అమ్ముతూ కనిపించిన మణిగారి ప్రత్యేకతని కొంచెం వివరంగానే చెప్పాలనిపిస్తుంది.

దేశంలోని అనేక ప్రాంతాల్లాగే దక్షిణాది రాష్ట్రాలలో కూడా జాతీయోద్యమం, సంఘ సంస్కరణోద్యమాలు, హేతువాద – నాస్తికవాద ఉద్యమాలు, పుస్తకాల ద్వారా సామాజిక చింతనను ప్రజలలో వ్యాప్తి చేసిన గ్రంథాలయోద్యమాలు మన నేలను ఇరువాలు దున్ని చదును చేసాయి. అటువంటి నేలపై అదనులో నాటిన ఎన్నో విత్తనాలు మొలకెత్తడానికి ఈ వాతావరణం ఉపయోగపడింది. సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతాల వ్యాప్తికి ఆనాటి భౌతిక పరిస్థితులతోపాటు ఈ చారిత్రక పరిస్థితులు కూడా తోడ్పడ్డాయని అందరం అంగీకరిస్తాం. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాలో కూడా సాగిన అనేక ఉద్యమాలలో సాహిత్యపు అందుబాటు కొరతను గమనించిన మణిగారు పోషణ, భావ ప్రచారాలను పెనవేసి పుస్తకాలనే వృత్తిగా మార్చుకున్నారు. మణిగారనే భౌతికవాద పుస్తకాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అవసరం వుంది. ఎందుకంటే ఆయన చాలామంది లాగా ప్రశ్నలకే పరిమితం కాలేదు. సమాధానాల మధ్య నడుస్తూ, అప్పుడప్పుడు ప్రశ్నిస్తూ, జీవితమంతా ఉద్యమాల మధ్య, ఉద్యమకారుల మధ్య గడిపారు. స్నేహపూర్వక సంఘర్షణలోంచి అందరి చేత ప్రేమించబడిన గొప్ప భావ సంఘర్షణా ప్రతీక మణిగారు.

సండే మార్కెట్లో బోర్డుతో సహా స్థిరంగా ఏర్పడిన మణి బుక్‌స్టాల్ మాత్రమే చూసినవారికి ఆయన గత కృషి తెలియకపోవచ్చు. సైకిల్ పై మోసుకొచ్చి రోడ్ల ప్రక్కన పుస్తకాలమ్మిన మణిగారి గురించి అర్థం కాకపోవచ్చు. నిరంతర పుస్తక ప్రచారకుడు, భావ ప్రచారకుడు అయిన మణిగారు అసామాన్య పట్టుదలతో పనిచేశారు. ఏవేవో ఉత్సవాలు, కాలేజీ వార్షికోత్సవాలు, మహాసభలు, అన్ని రకాల ఉద్యమ కార్యక్రమాల్లో ఆయన సైకిల్ కనిపించేది. గేటు లోపలో బయటో ఆయన పుస్తకాల సంచులు ప్రత్యక్షం అయ్యేవి. తానుగా కొంతసేపైనా ఆయా కార్యక్రమాలలో పాల్గొనడం ఒక అలవాటుగా సాగించాడాయన. ముగింపులోనో, భోజన విరామ సమయంలోనో తను తగిలించుకున్న గుడ్డ సంచిలోంచి నాలుగు పుస్తకాలు బయటకు తీసి కార్యకర్తలు, నాయకుల మధ్యలో తిరుగుతూ ఇది చూసావా? ఇది చదివావా? అని అడుగుతూ పనిలో పనిగా వారి క్షేమ సమాచారాలు తెలుకునేవాడు. ఈనాడున్న ఇన్ని రకాల అవకాశాలు లేని కాలంలో ఎవరైనా మాకీ పుస్తకం కావాలంటే తెప్పించి ఇచ్చేవాడు. సంవత్సరాల తరబడి ఇలాంటి కృషి సాగించిన అరుదైన వ్యక్తి మణిగారు. ఈ క్రమంలో వందలమందితో ఆయనకు స్నేహం ఏర్పడింది. అలా ఆయన పరిచయంతో తాము కొన్న పుస్తకాలు ఎంతోమందికి ఈ సమాజపు నడకను, సంఘర్షణను పరిచయం చేశాయి. ఔత్సాహిక కవులు, రచయితలకు కూడా ఏవో కొన్ని పత్రికల పేర్లు సూచించేవారు. అభ్యుదయాన్ని, విప్లవాన్ని కాంక్షించే కొందరు వ్యక్తులు, కొన్ని బృందాలు, వివిధ కమ్యూనిస్టు నిర్మాణాలు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూ, సంఘర్షణ పడుతూ నెల్లూరు జిల్లాలో కొన్ని ఉద్యమాలకు బాధ్యత వహించాయి. సారా ఉద్యమ కాలాన్ని ఒక ఉదాహరణగా చెప్పచ్చు. ఈ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న వారందరితో ఆయనకు ప్రత్యక్ష పరిచయం ఉండేది.

నెల్లూరులో రోడ్డు మార్జిన్ వ్యాపారులపై పోలీసు అధికారుల వేధింపులు ఒకనాడు బాగా సాగేవి. అలా ఒకరోజు సినిమాల్లో చూపించినట్టు పోలీసులు చిరువ్యాపారుల వస్తువులను వాహనాలతో తొక్కించి చిందరవందర చేసారు. అటువంటి దాడులను ఎదుర్కోవడంలో భాగంగా సండే మార్కెట్‌గా చిరువ్యాపారులు ఒకచోట సంఘటితమై నిలబడ్డారు. ఆ తర్వాత క్రమంలో మణిగారు తెరిచిన పుస్తకాల బంకు

ఆ మార్కెట్‌కి గొప్ప అలంకారంగా మారింది. ఈ చిరు వ్యాపారులను సంఘటితపరచడంలో ఏ నిర్మాణపు శక్తులు బాధ్యత వహించారో, ఇప్పటికీ వహిస్తున్నారో తెలుగు పాఠకులకు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అప్పటినుంచి మణిగారు ఆయన పేరుతో వెలసిన బుక్‌స్టాల్ ఒక ఉద్యమ కూడలిగా, ప్రజాసంఘాల కార్యకర్తలు వారు పంచే కరపత్రాలు ఇచ్చిపుచ్చుకునే అడ్డాగా అది కొనసాగింది. డిజిటల్ మాయా యుగంలో కూడా తట్టుకుని ఇప్పటికీ ఎంతో కొంత కొనసాగుతున్నది.

ఎప్పుడూ, దేనికీ లొంగని విలువైన జీవితం మణిగారిది. ముక్కుసూటిగా మాట్లాడే స్వభావం. నిక్కచ్చి మనిషి. చాలాకాలం పాటు ఇరుకైన చిన్న గదే వారి ఇల్లు. కొద్దిపాటి సామాన్లు, ఒక కిరోసిన్ స్టవ్, ఒక పాత సైకిల్ - ఇవే ఆయనకున్న ఆస్తిపాస్తులు. బాడుగ ఇళ్ల యజమానులతో, ఆయన భార్యతో సాగే సంభాషణల తీరు ఇప్పుడు గుర్తుకొస్తుంటే బ్లాక్ అండ్ వైట్ సినిమా రీల్ తిరుగుతున్నది. మా ద్రవిడ రూపం మణిగారి మొండితనంతో వేగుతూ చివరి వరకు ప్రయాణం సాగించిన భార్య వరమ్మను మెచ్చుకోకుండా ఎవరిమీ వుండలేక పోయేవాళ్ళం.

సైకిల్ పూర్తిగా అందక పరిగెత్తుకుంటూ ఎక్కి, పరుగెత్తుకుంటూ దిగే మణిగారిని ఆటపట్టించే నాలాంటి వారిని "చూస్తూ ఊరుకోకపోతే కొద్దిగా పుస్తకాల కట్టలు పట్టుకోవచ్చు కదయ్యా" అనేవాడు. బంకు పక్కన జాగ్రత్తగా సైకిల్ని బందోబస్తు చేసి షాపుని జాగ్రత్తగా తెరిచినప్పటి నుంచి ప్రతిరోజూ ఎలా గడిచేదో ఆయనకే తెలిసేది కాదు. అడ్రస్ అడిగిన వాళ్లకు అడ్రస్ చెప్పి ఏ ఊరు అని అడిగి వారి చేతిలో ఏదో ఒక కరపత్రం పెట్టి పంపిన నిరంతర భావ ప్రచారకుడు మణి గారు.

అనేకమంది వ్యక్తులతో మణి గారికి స్నేహం వున్నా, విద్యార్థులతో, ఉద్యమాల్లోకి కొత్తగా పరిచయమవుతున్న యువతీ యువకులతో గంటలు గంటలు మాట్లాడే ఓపిక, ఒక దీర్ఘకాల లక్ష్యం ఆయనకు వుండేవి. ఆయన అనుకున్న పద్ధతిలో వారికి పుస్తకాలు సూచించేవారు. అప్పటికే వివిధ సిద్ధాంతాలతో పరిచయం, ప్రవేశం వున్న వాళ్లయితే ఇతర సిద్ధాంతాలను, వ్యక్తుల ప్రతిపాదనలను కూడా చదవాలని ఒత్తిడి చేసేవారు. చదవడంలో ఏ పుస్తకం ముందు, ఏది తర్వాత అన్నది ఆయనతో మాకు సంఘర్షణ వుండేది. తక్షణ ఉద్యమ అవసరాల కోసం చదువుతూ కార్యక్రమాల్లో పాల్గొనే కార్యకర్తలతో చనువుగా వాదిస్తూ ఉండేవాడు. ఏదో ఒక కొత్త పుస్తకం ఇచ్చి "దీన్ని చదువు, తర్వాత చర్చిద్దాం" అనేవారు. తీరిక లేక చదివానని ఏదో ఒకటి వాదిస్తున్నవారితో "నువ్వు ముందుమాట, చివరి అట్టా చదివి మాట్లాడుతున్నావా" అంటూ పుస్తకం పూర్తిగా చదవలేదని కనిపెట్టేసేవారు. టవునంతా తిరిగి కరపత్రాలు పంచి కొన్ని ఆయన షాపులో పెట్టడానికి వెళ్ళినప్పుడు కాళ్లు, కాళ్ళ చెప్పులకు అంటిన మట్టిని బట్టి కరపత్రాలు జనానికి పంచేవారు ఎవరో, పంచిపెట్టకుండా కాలవలో వేసేవారెవరో కనిపెట్టేస్తానని భయపెట్టేవారు. తిరిగి తిరిగి అలసిపోయి వచ్చిన వాళ్లకు తన పక్కనే వుండే కూజాలో నీళ్లు చూపించి నాలుగు కొబ్బరి ముక్కలు ఇచ్చేవారు. అలా నాలుగైదు సార్లు కొబ్బరి ఇవ్వడం చూసి ఎక్కడిదని అడిగితే శుక్రవారం సాయంత్రం షాపులు కట్టేసేటప్పుడు అలా ట్రంకు రోడ్డుకెళ్లి షాపుల ముందు కొట్టినవన్నీ ఏరుకుని వస్తానని చెప్పేవారు. అంత సరదాగా తన హేతువాదాన్ని జీవితపు ఆచరణగా మార్చేసుకున్న వ్యక్తి మణి గారు. చాలాకాలం మేము కూడా ఆకలైనప్పుడు రూముల్లోంచి బయలుదేరి ఆయన కొబ్బరి ఫిలాసఫీని ఫాలో అయ్యే వాళ్ళం.

షాపులో అన్ని రకాల పుస్తకాలకే కాకుండా మా అందరి కరపత్రాలకు కూడా ఇంత ప్రత్యేకంగా చోటు కేటాయించిన ఉద్యమాల ప్రేమికుడాయన. మాలాంటి వాళ్ళు పెట్టిన కరపత్రాలు, పత్రికలను ఆసాంతం కూడబలుక్కుని చదివి, విమర్శనాస్త్రాలు అండర్‌లైన్ రూపంలో గీసి తన కుర్చీ వెనక దాచుకునేవాడు. మేము ఎప్పుడు కనిపిస్తే అప్పుడు బాణాలు విసిరేవారు. ఆరోగ్యం బాగా లేకపోయినా రకరకాల దీర్ఘకాలిక జబ్బులు వెంటబడినా అవన్నీ సరదా సంభాషణలో భాగమయ్యేవే కానీ దిగులు పడేవారు కాదు. ఆడంబరాలు, గొప్పలు చెప్పుకునేవాళ్లని, అబద్ధాలు ప్రచారం చేసేవాళ్ళని ఒక కంట కనిపెట్టి అలాంటి వాళ్ళ వల్ల తనకు ఎదురయ్యే ఇబ్బందుల్ని తనలోనే ఉంచుకుంటూ ఉద్యమాలలో అవిశ్రాంతంగా పనిచేసే వారికి కొన్ని జాగ్రత్తలు చెబుతూ ఉండేవారు. పరిశీలించుకోండని ఒక ఇంటి పెద్దలా హెచ్చరిస్తూ ఉండేవారు. ప్రజా ఉద్యమ కార్యకర్తలతో పాటు వాళ్ల కుటుంబాలకు కూడా మణిగారు సుపరిచితులే. నెలల తరబడి ఇళ్లకు వెళ్ళని కార్యకర్తల తల్లిదండ్రులు నెల్లూరు వచ్చినప్పుడు ఆయనను కలిసి తమ బిడ్డలు ఎలా ఉన్నారో వాకబు చేసి వెళ్తుండేవాళ్ళు. క్షేమ సమాచారాలు, వారు పడే బాధలు ఆయనకు చెప్పుకునేవాళ్లు. ఆ తల్లిదండ్రుల్లో చాలామందికి ఈ రకరకాల నిర్మాణాలు, వాటి నాయకులు, ఈ గొడవలేవి తెలిసేవి కావు. అలా వాళ్లను సాంత్వన పరచడం కూడా ఆయనకు ఒక అలవాటు.

ఉద్యమాల మధ్య ఎన్ని వైరుధ్యాలు ఉన్నా అవి వైషమ్యాలుగా మారుతున్నప్పుడు బాధపడేవారు. ఎన్నో ఉద్యమ సందర్భాలలో మాతోపాటు సంచి తగిలించుకొని కొద్ది దూరమైనా నడిచేవారు. శోభాదేవిగారు, శాయిగారు ఏర్పాటు చేసిన 'భోపాల్ విషాదం'పై ఫోటో ఎగ్జిబిషన్, "మనలో సగం" ఆర్ట్ ఎగ్జిబిషన్ తదితర సాంస్కృతిక ప్రదర్శనలు, సారా ఉద్యమం సందర్భంలో జనసాహితి, అరుణోదయ నిర్వహించిన అనేక ప్రదర్శనలు, అశ్లీల చిత్రాల వ్యతిరేక ఉద్యమం, అలా చెబుతూ పోతుంటే మణిగారిది ఉద్యమాలతో పెనవేసుకున్న "కదిలే పుస్తకాల చరిత్ర". చిన్న పుస్తకాల సమాధి లాంటి బంకు మధ్యలో నుంచి పైకి లేస్తూ కూర్చుంటూ దశాబ్దాల జీవన ప్రయాణాన్ని ఆయనే రాస్తే ఎన్ని పుస్తకాలు అచ్చులోకి రావాలి? తాము రాసిన పుస్తకాలు పాఠకుల వద్దకు ఎలా చేర్చాలో తెలియక తెగ తంటాలు పడే రచయితలకు నెల్లూరులో ఆయన చేసిన కృషి చక్కటి ఆదర్శం. అవసరమైన వారందరికీ పుస్తకాలను చేర్చడంలో తనదంటూ ఒక ఒరవడిని నిలబెట్టిన నడిచే

గ్రంథాలయం మణిగారు. ఇంతటి సాహిత్య కృషి తెలుగు సమాజానికి చేసి, ఆయనదంటూ ఒక్క పేజీ కూడా సొంత రచన లేని అసలైన సామాజిక రచయిత మా మణి గారు.

వందల మంది స్నేహితులు వున్న నెల్లూరును వదిలినందుకు చివరి సంవత్సరాలలో బాధపడినా వయస్సు, అశక్తత ఆయన్ని తన కొడుకు డాక్టర్ దుర్గేశ్ వుద్యోగరీత్యా ఉంటున్న అనంతపురం వైపుకి నడిపించాయి. అప్పుడప్పుడు అనంతపురం కెళ్ళి కలిసిన మిత్రులతో గంటలు గంటలు గడిపినా ఆయనకు తృప్తినిచ్చేది కాదు. మళ్లీ మిమ్మల్ని చూస్తానో లేదో అంటూ వెక్కివెక్కి ఏడ్చి సంతోషపడిన చిన్న పిల్లవాడు మా మణిగారు. ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలను చూసి “మీరంతా నాయకులుగా, నాయకురాళ్లుగా పనిచేస్తున్నందుకు నాకు గర్వంగా ఉంది” అంటూ కన్నీళ్ళను ధారగా కార్చే సున్నిత మనస్కుడు, నిష్కల్మషమైన వ్యక్తి మణిగారు. ఎంత ఆరోగ్యంగా వుంటే అంత ఎక్కువ కాలం ప్రజల్లో పని చేయవచ్చని జాగ్రత్తలు చెప్పే భౌతిక వాస్తవికుడు. ఆయన బాధంతా ఈ వ్యవస్థలో పెరిగిన, పెరుగుతున్న సామాజిక రుగ్మతలే! ఆయన ఆవేదనంతా పెరుగుతున్న దోపిడీ, అసమానతలే. “టెక్నాలజీ పెరుగుతుందే కానీ దానితోపాటు పెరుగుతున్న మూఢనమ్మకాల్ని కూడా ఎలా ఎదుర్కోవాలో సీరియస్‌గా ఆలోచించాలి కదా” అని తనను కలిసిన వారందరికీ చివరి రోజుల్లో చెప్పేవాడు.

భావ ప్రచారంలో చివరి వరకు శ్రమించిన మణిగారిని చాలామంది చాలా రకాలుగా గుర్తుంచుకుంటారు. ఈ దోపిడీ సమాజం మారాలని కోరుకున్న ఆచరణవాది ఆయన. వ్యక్తులుగా, సమూహాలుగా, సంస్థలు, నిర్మాణాలుగా సమాజం మధ్య జరిపే భావ సంఘర్షణ ఎలా సమన్వయంతో జరగాలన్న విషయంలో మణిగారు మనకు ఒక మంచి ఉదాహరణగా కనిపిస్తారు. అటువంటి మణిగారి కృషిని అందరం గుర్తుంచుకుందాం. మరణించిన రోజే ఆయన మరణ వాగ్మూలం అమలుచేయడంతో మణిగారి భౌతిక కాయాన్ని నేరుగా చూడలేక పోయామన్న బాధ చాలామంది లాగే నాకు కూడా మిగిలే ఉంది. కానీ చేసిన పనుల ద్వారానే మనుషులు గుర్తుండిపోవాలనే ఆయన ఆలోచనను గుర్తుచేసుకుంటూ మణిగారికి జోహార్లు! ●

# సామాజిక శాస్త్రవేత్త ఆచార్య ఇంతియాజ్ అహ్మద్ మరణం



**ఢిల్లీ** జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో 30 ఏళ్ల పాటు సామాజిక శాస్త్రాల విభాగంలో విద్యార్థులకు బోధన చేసిన ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్ 19-6-2023న తన 83వ ఏట మరణించారు. ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోండా జిల్లాలో 1940లో జన్మించారు. “భారతదేశ ముస్లిములలో కులము - సాంఘిక అంతరాలు” గురించి విశేష పరిశోధన చేసిన ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్ తన జీవితకాలం పొడవునా నిబద్ధ లౌకికవాదిగా గడిపారు.

ప్రొ. ఇంతియాజ్ లక్నో విశ్వవిద్యాలయంలో తన గ్రాడ్యుయేషన్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలో, అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేసి పి హెచ్ డి పట్టా పొందారు. వివిధ విశ్వవిద్యాలయాలలో పనిచేసిన పిదప 1972-2002 కాలంలో జెఎన్‌యులో చేరి పదవీ విరమణ వరకూ పనిచేశారు. అమెరికా, కెనడా, ఇటలీ లాంటి అనేక దేశాలలో ఎన్నో పరిశోధక పత్రాలు సమర్పించారు.

ముస్లిం సమాజం ఏకశిలా సదృశం కాదని వివిధ అంతరాలతో దొంతరల నడుమ జీవించే లక్షణాలు కలిగినదని ఆయన లోతైన పరిశోధన చేసి శాస్త్రీయంగా నిగ్గు తేల్చారు. ఇంకా వివిధ రూపాలలో ముస్లిం సమాజం యొక్క స్థితిగతులు తన పరిశోధక గ్రంథాల ద్వారా ఆయన బహిర్గత పరిచారు. హిందూ ముస్లిం చాందసవర్గాల నుండి విమర్శలు తీవ్రంగా ఎదుర్కొన్నా, తన మత విశ్వాసాలను కొనసాగిస్తూనే, లౌకికవాదిగా ఆయన జీవించారు.

విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్న ప్రొఫెసర్ ఇంతియాజ్ తరగతి గదిలోనూ, వెలుపల విద్యార్థులతో ఎక్కువ సమయం చర్చలు జరుపుతూ వారిలో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తూ, ఎన్నో సందేహాలు తీరుస్తూ... ఒక ఉత్తమ ఉపాధ్యాయునిగా జీవించారు. 2002 గుజరాత్‌లో జరిగిన మతపరమైన హింసాయుత అల్లర్లను సహేతుకంగా విశ్లేషించారు.

ప్రొఫెసర్ ఇంతియాజ్ అహ్మద్‌గారి మరణానికి ‘ప్రజాసాహితి’ సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సహానుభూతి తెలియచేస్తుంది. ●

స్మరించుకుందాం

# మణి - తానొక మణి, తన అంగడొక మణి

- తిక్కవరపు సుకుమార్ రెడ్డి, "ఒ-"

**1979లో** నెల్లూరుజిల్లా హేతువాదసంఘం ఏర్పడినప్పుడు మణిగారితో నాకు పరిచయమైంది. "నా పేరు పంకజాక్షన్. తాడేపల్లి పప్పు (షాపు) మణిగ, చిన్నప్పుడు బడిలో నమోదైందని, కేరళ రాష్ట్రం, కొల్లాం జిల్లా, దక్షిణపు పరవూరు తన పుట్టిల్లని", ఆయన తన గురించిన వొక పరిచయ కార్యక్రమంలో చెప్పుకున్నారు. 70ల ఉత్తరార్ధంలో, సుప్రసిద్ధ హేతువాది, వైద్యులు కోవూర్ హేతువాద ప్రచారం చేస్తూ, ఆం.ప్ర.లో పర్యటించిన దరిమిల, తెలుగునాట, ఇండియన్ రేషన్‌లిస్ట్ అసోసియేషన్ (భారత హేతువాద సంఘం)కి అనుబంధంగా, ఆం.ప్ర. హేతువాదసంఘం యేర్పడింది. ఆ క్రమంలో, దానికనుబంధంగా, రాష్ట్రంలో అక్కడక్కడ హేతువాదసంఘాలేర్పడ్డం, ఆ వరుసలో నెల్లూరు జిల్లా హేతువాదసంఘం యేర్పడింది. 82లో, రాష్ట్రంలో సంఘం చీలటంతో, వుద్యమం బలహీనపడి, 85కి నెల్లూరు జిల్లాలో నామమాత్రమైపోయింది. నెల్లూరుజిల్లాలో సంఘం పనిచేసినంతకాలం - మణి చాల చురుగ్గా పనిచేశారు. నాస్తిక, హేతువాద పుస్తకాలతో సంఘం యేర్పాటుచేసిన గ్రంథాలయం, వారింట్లోనే నడిచేది. సంఘంలో ఆయన తపనతో, ఆరాటంతో పనిచేశారు. ఆంధ్ర ప్రాంతంలో కోవూర్ వుపన్యాసం వినటంతో ఆయన మస్తిష్కం ప్రభావితమైనది.

హేతువాద సంఘంలో యేర్పడిన పరిచయంతో, 79లోనే యేర్పర్చి, నేను నడిపే "సింహపురి స్వచ్ఛంద రక్తదాతల బృందం"లో, 82లో మణి సభ్యులయ్యారు. తనది "ఎ(A)+" రకం రక్తం. వైద్యశాలల పిలుపుల మేరకు రక్తమిచ్చే విధానంలో ఆ సంస్థ రక్తాన్నందిస్తుంది. అందువల్ల, ఆయనలో వుండే రకం రక్తం అవసరమైనప్పుడు పిలిచేవాడిని. వాయిదా పెట్టకుండ, వెంటనే వచ్చి రక్తమిచ్చేవారు. ఆ విధంగ 3 సార్లు రక్త సహాయం చేశారు.

జీవన పోరాటంలో, పదమూడేళ్ళకే ఇల్లొదిలి వీధినపడి, యెన్నోచోట్ల హీనంగ, గౌరవంగ భావించే పనులు చేస్తూ, తెలుగు రాష్ట్రానికొచ్చి, నెల్లూరుకు చేరి స్థిరపడ్డారు. పాత తొక్కుడు బండి (బైస్కిల్ (సైకిల్))కి, దిట్టమైన 2 పెద్ద సంచుల్ని తగలించుకుని, వాటిలో వివిధరకాల పొగ చుట్టల్ని, బడ్డీ కొట్లకు కావాల్సిన కొన్ని వస్తువుల్ని పెట్టుకుని అమ్ముతుండేవారు. ఆ పన్చేస్తూ, హేతువాదసంఘం కరపత్రాల్ని, నాస్తిక, హేతువాద సాహిత్యాన్ని పంచుతూ అమ్ముతూ వుండేవారు. తెలుగువారే అనిపించేట్టు మాట్లాడ్డం అప్పటికే నేర్చుకున్నారు. సంఘం పన్జేసిన సంవత్సరాల్లోను, ఆ తర్వాత - వాగ్రూపంలో ఆయన చేసిన హేతువాద ప్రచారం చాల పెద్దది. ఆ క్రమంలో, నెల్లూర్లో చాల చిన్న బడ్డీ కొట్టును పెట్టుకున్నారు. దాంట్లో పుస్తకాల్నీ అమ్మేవారు. మొదట్లో "ప్రోగ్రెసివ్ బుక్‌స్టాల్" పేరుతో కొన్నాళ్లు నడిపి, తర్వాత "మణి బుక్‌స్టాల్"గా మార్చారు. అదీ బడ్డీ కొట్టు మాదిరి అంగడే; మొదటిదానితో పోలిస్తే - చెప్పుకోదగినంత పెద్దది. దానిలో ప్రగతిశీల సాహిత్యాన్ని మాత్రమే అమ్మటం మొదలుబెట్టారు. పుస్తకప్రియుల్తో పరిచయాలు పెరిగాయి. అంగడి వైశాల్యం అదనంగ పెరగలేదుగాని, పుస్తకాల సంఖ్య, అమ్మకాలు బాగ పెరిగాయి. పుస్తకాలమ్మటంలో వొక లక్షణాన్ని మణిలో నేను చూచాను. ఆయన తెలుగులో చదవటం చాల నిదానంగుండేది. ఐనా చదివి, వాటిలోని అంశాల్ని గుర్తుంచుకొని, అంగడికొచ్చేవారికి ఆయా పుస్తకాల్ని పరిచయం చేసి, వారు వాటిని కొనటానికి మొగ్గేటట్టు చేసేవారు. వారు వాటిని కొనటానికి రాకపోయినా, మణి చేసిన పరిచయానికి ఆకర్షితులై కొనేవారు. మణిలోని గొప్ప అసాధారణ లక్షణమిది. కాలం పెరిగేకొద్దీ ఈ అంగడి జిల్లావ్యాప్తంగ పుస్తకప్రియులకు పరిచయమైంది. పుస్తకాల్ని ముద్రించేవారు - ఆ పుస్తకం ఫలాన చోట్ల దొరుకుతుందని ప్రకటించే ఆయా పుస్తకాల పుటల్లో మణిబుక్‌స్టాల్ పేరు కనపడటం మొదలై, అది బాగ పెరిగింది. దాంతో - అంగడి పేరు రాష్ట్రవ్యాప్తంగ పరిచయమైంది. దేశంలోని తెలుగువాళ్లుండే ప్రాంతాలక్కూడ ఈ పేరు పరిచయమైందని చెప్పొచ్చు. ఇంతకీ మణి బుక్‌స్టాల్ పుస్తక ప్రచురణ సంస్థ కాదు. వాటినమ్మే చాల చిన్న అంగడి మాత్రమే. దానికి ఇంకెక్కడా అటువంటి అంగడ్లు లేవు. కానీ, దాని పేరు నలుదిసల ప్రాకింది. ఐనా, మణిది ఆ పాత తొక్కుడుబండే. మనిషీ ఆ పాత మనిషే. వివిధ ప్రగతిశీల వుద్యమాలవారికి అంగడి వాడుకబడినాక, ఆ అంగడి - అటువంటివాళ్ల సంగమ స్థలమై, వాళ్లు మాట్లాడుకునే ప్రదేశంగ అయింది. ఐతే, అంగట్లో కూర్చుని కాదు; దాంట్లో అంత స్థలమెక్కడుంది? ఆ కలయిక అంగడి ముందు వీధిలోనే. ఈ అంగడి అదనపు విశేషమిది.

ప్రార్థించే పెదవులకన్న సాయంచేసే చేతులు మిన్న అనే మాట మదర్‌తెరిసా మాటగా కొన్నేళ్ల క్రిందట ప్రచారంలోకొచ్చింది. తర్వాత సత్యసాయిబాబ మాటగ కూడ ప్రచారమైంది. ఈ ఆపాదింపు మణికి చిర్రెత్తించింది. ప్రముఖ హేతువాది రాబర్ట్ గ్రీన్ ఇంగర్‌సాల్ అనే పాశ్చాత్యుడు చెప్పిన మాట ఇది అని నిరూపించే సమాచారాన్ని యెవరినించైనా సేకరించి, సర్వసమాచార దర్శిని (ఇన్‌టర్‌నెట్) ద్వారానైనా పొంది, సాధికారికంగ వెల్లడి చెయ్యగోరుతూ మణి, తానెరిగిన పలువురికి చెప్పారు. జంటనగరాల హేతువాద సంఘ

స్థాపకుల్లో వొకరైన ఇసనాక మురళీధర్. "ఒ(ం)-" స్పందించి, ఆ బాధ్యతని స్వీకరించి, ఇంగర్‌సాల్ మహాశయుడు రాసిన వొక ఆంగ్ల కవితలోని పంక్తులివి అని పేర్కొని, సదరు కవిత మొత్తాన్ని తెలుగులోకి అనువదించి, పత్రికాముఖంగ వెల్లడి చేశారు. ఇంతకీ మణి 4వ తరగతి దాక మళయాళంలో చదివినవారు మాత్రమే. 4వ తరగతి చదివిన ఈ మానవుడు – నిజమైన అర్థంలో విద్వావంతుడు.

మణి వేదికమీదెక్కడా మాట్లాడినట్టు చూడ్లేదు; విననూ, చదవనూలేదు. హేతువాదం అంశాల్ని తన స్వీయ సృజనాత్మకవాదనా పటిమతో, చదువుకున్నామనుకునేవాళ్లను ఆశ్చర్యపొయ్యేట్టు చేసేవారు. వేదిక మీద మాట్లాడవయ్యా నాయనా అంటే ససేమిరా అనేవారు.

మణి ధనానికి పేద. చిన్న బాడుగింట్లో నివాసం. ముతక దుస్తుల ధారణ. ఆశయాలపట్ల రాజీపడని కఠినత్వం. మంచివారు. తాను నెల్లూరునొదిలి, విశ్రాంత జీవితం గడపబోతూ, తన అంగడిని అమ్ముకుండ, తన అంగడుండిన "సండే మార్కెట్" వ్యవహారాల్ని చూస్తుండిన వామపక్ష రాజకీయ సంస్థకి అప్పగించిన ఘనుడు మణి. సొంతాస్తి స్వార్థానికి తొలిమెట్టని ఆయనభిప్రాయం.

1987లో నెల్లూరు నేత్రదాతల సంస్థ స్థాపకులు ఇద్దరిలో వొకరిగ, ఆ సంస్థ కార్యదర్శిగ, 82 నుంచి అవయవ, దేహ సమర్పణలు గురించి యోచిస్తూ, విషయ సేకరణ చేస్తున్న వ్యక్తిగ, 91లో – నెల్లూరుకు వైద్యకళాశాల రానున్నట్టు వస్తుండిన ప్రభుత్వవార్తల నేపథ్యంలో – నెల్లూరుకు వైద్య కళాశాలొస్తే, దేహదానమిస్తా అని పత్రికాముఖంగ ప్రకటించారు. నన్నెరిగిన మణి, "మరణ ఆదేశము" పేరుతో తన నేత్ర, దేహ సమర్పణల గురించి, దేహ సమర్పణ వీలుగాకుంటే, తన అంత్యక్రియలు హేతువాద పద్ధతిలో యెట్ల జరపాలో వివరిస్తూ, నేత్ర, దేహ సమర్పణల అమలు బాధ్యతని నాకప్పగిస్తూ, 7-3-93న, తన జీవిత సహచరి, కుమారుడు, మిత్రుడుగ నేను సాక్షులుగ, నా సహకారంతో కరపత్రాల్ని ముద్రించి, పంచారు. అవి అయిపోగా, అప్పటికి తాను నెల్లూరును వదిలి, విశ్రాంత జీవితం గడుపుతూ, నన్ను కోరి, 2వ సారి ముద్రింపజేసుకుని, పంచినారు. మణి దంపతుల యేకైక సంతానం దుర్గేశ్, కొందరి తోడ్పాటుతో వైద్యశాస్త్రం చదువుకుని, వైద్యునిగ కుదుటపడిన తర్వాత, అనంతపురంకు కొంత దూరంలోని బత్తలపల్లిలో, ఫాదర్ ఫెర్రర్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పక్షాన నెలకొల్పిన వైద్యశాల్లో ఉద్యోగం చేస్తుంటే, ఆ ప్రాంగణంలోనే కుమారుని వద్ద వుండి, తర్వాత ఆ సంస్థకు చెందిన – కర్నాటక సరిహద్దుకు దగ్గర్లోని కణేకల్లులోని వైద్యశాలకి బదిలీ అవగా, 2014లో వారి నివాసం అక్కడకు మారింది. మణికి దీర్ఘకాలంగ మధుమేహ వ్యాధుండేది. దానివల్ల కాలికి పుండు యేర్పడి, బత్తలపల్లి వైద్యశాల్లో చాలరోజులుండినారు. ఆ తరుణంలో, వారి సహచరి వరహాలమ్మ కణేకల్లులో 2016లో రాత్రివేళ మరణించారు. తన అనారోగ్యం వల్ల, ఆమెను కడసారి మణి చూడ్లేకపోయారు. 2010లో బత్తలపల్లిలో వున్నప్పుడు, అనంతపురంలో అనంత దేహదాతల సంస్థ యేర్పడ్తే, మణి దంపతులు ఆ సంస్థలో సభ్యులుగ చేరుండినారు. తర్వాతక్కడ వొక వైద్యుడు నేత్ర సమర్పణ సౌకర్యాన్ని కల్పించారు. ఐతే, ఆ వైద్యుడు అందుబాటుగాక, ప్రత్యామ్నాయం లేక, ఆమె నేత్ర సమర్పణ జరగలేదు. అనంతపురం ప్రభుత్వ వైద్యకళాశాలది మాటలే తప్ప క్రియ లేకపోవటం వల్ల వారి దేహ సమర్పణా జరగలేదు. తదనంతర కాలంలో మణికి కాలి వ్రణం మానింది. నెల్లూరు మిత్రుల్తో అప్పుడప్పుడు మాట్లాడ్తుండేవారు. గత కొన్నేళ్లుగ అది ఆగిపోయింది. గతనెల రాత్రి మామూలుగానే వుండి, పడుకుని, 16 వేకువన నిద్రిస్తూ, తన 93వ ఏట మరణించారు. ఆయన ఆధార్ పత్రంలో – తన పుట్టిన తేది 1-1-1931గ వుంది. తొలుత మణి దేహాన్ని దేహ సమర్పణ కోసం నెల్లూర్కు తరలించాలని యోచించారు. నిర్ణీత కాలపరిమితి దృష్ట్యా, సాంకేతిక కారణాల వల్ల అది అలవిగాదని భావించి, కణేకల్లుకు బళ్లారి దగ్గర కాబట్టి, విచారిస్తే – అక్కడి ప్రభుత్వ వైద్యకళాశాల దేహాన్ని స్వీకరిస్తామని చెప్పటంతో, విజయనగర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు మణి కుమారుడు, వైద్యుడు దుర్గేశ్ – తండ్రి దేహాన్ని అమూల్య కానుకగ సమర్పించారు. ఈ సందర్భంలో జరగాల్సిన మణి నేత్ర సమర్పణ మాత్రం వివిధ కారణాల వల్ల సాధ్యం కాలేదు. ఆ మేరకు అది విచారకరమే.

కేరళలో పుట్టి, ఆం.ప్ర.లో ఎదిగి, మరణించి, కుమారుని తోడ్పాట్తో కర్నాటకలో తన గమ్యస్థానమైన వైద్యకళాశాలను చేరుకున్నారు సమాజ మిత్రుడు మణి. విద్యాసంస్థలో నామమాత్రం చదివిన మణి, వైద్యం గురించి బొత్తిగా తెలీని మణి ఆ వైద్య కళాశాల్లోని బోధకుల చేతుల్లో బోధనోపకరణమై, అక్కడి వైద్య విద్యాభ్యాసకులకు తన దేహాన్ని విప్పి చూపి, వైద్య విజ్ఞానశాస్త్ర జ్ఞానాన్ని బోధిస్తారు. మణి మహాశయుడు మరణానంతర లౌకిక జీవితాన్ని సాధించారు.

ఇక్కడొక గుండెల్ని పిండే అంశాన్ని చెప్పకోవాల్సుంది. తన జీవిత సహచరి కడసారి చూపు తనకి దక్కక, ఆమె నేత్ర, దేహ సమర్పణలు అమలుగాక, ఆనాటికి 85 యేళ్ల వృద్ధుడు మణి హృదయం యెంతగా దుఃఖించిందో, క్షోభించిందో.... పోనీ – 93లో – 30 సంవత్సరాల క్రిందట తాను ప్రకటించిన తన నేత్ర, దేహ సమర్పణ కోరికల్లో ఒకటైనా అనువైంది గదా, ఆనందిద్దామంటే – తాను మరణించాడు గదా....


మణి నిజంగ మణే. ఆయన పుస్తకాలంగడీ మణే. ఈ రెండు మణులు – మిలమిల మెరుస్తూ కళ్లకు జిగేల్మనిపించే, మిరుమిట్లుదొల్పే మణులు కావు. అందరనుకునే లేదా వ్యవహరించే మణులనే మెరిసే రాళ్లకు సమాజోపయుక్తమైన విలువ – పాతకాలంనాటి పెద్దెద్దుల బండి చక్రమంత పెద్ద సున్న. వాటికున్న డబ్బు విలువ – మనుషులు కల్పించిన కృత్రిమ విలువేగాని, సహజసిద్ధమైనది గాదు. అదొక అలంకార వస్తువంతే. నిజానికి ఇటుకరాయికున్న సమాజోపయుక్తమైన విలువ – ఈ మిలమిల మెరిసే మణులనబడే రాళ్లకు లేదు; రాదు. కాగా, మణి, ఆయన పుస్తకాలంగడి – వాస్తవమైన అర్థంలో మణులు. మణి మరణించినా, మణి బుక్ స్టాల్ వుంది. అది విజ్ఞానకాంతుల్ని ప్రసరిస్తూనే వుంటుంది. ఇంక మణి – వైద్య విద్యాభ్యాసకులకు తానందించే వైద్యవిజ్ఞానశాస్త్ర పరిజ్ఞానంతో – తాను పరోక్షంలో వుండి, తన శిష్యుల ద్వారా అసంఖ్యాక అనారోగ్య బాధితులకు స్వస్థత చేకూరుస్తారు. వ్యాధి పీడితుల, మృత్యువు కౌగిలిలోకి పోనున్న అనేకుల ప్రాణాల్ని రక్షిస్తారు. ●

## దేశ విభజన వస్తువుగా సాహిత్యం-11

# భీష్మ సాహ్నీ నవల 'తమస్'

– కొత్తపల్లి రవిబాబు

**'తమస్'** అంటే చీకటి, అంధకారం. 1947 నాటి భారత ప్రజల మానసిక స్థితి అంధకారంతో నిండి వుండగా దాని నుండి వారు బయటపడటాన్ని చిత్రించిన ఈ నవలను ప్రసిద్ధ హిందీ రచయిత భీష్మ సాహ్నీ 1974లో రాశారు.




భీష్మ సాహ్నీ రావల్పిండి పట్టణంలోని ఒక ఆర్యసామాజిక కుటుంబంలో 1915 అగస్టు 8న జన్మించారు. రావల్పిండిలో పాఠశాల విద్య తర్వాత లాహోర్ ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీషు సాహిత్యంలో ఎం.ఏ. పూర్తిచేశారు. ఛండీఘర్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. పొందారు. కొంతకాలంపాటు తన తండ్రి చేస్తున్న దిగుమతి వ్యాపారంలో పాలు పంచుకుని అది నచ్చక స్థానిక కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. ఆ కాలంలోనే కాంగ్రెసుపార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొంతకాలం అంబాలాలోనూ, అమృతసర్‌లోని ఖల్సా కళాశాలల్లో అధ్యాపకునిగా పనిచేశారు. పంజాబ్ కాలేజి టీచర్స్ యూనియన్లో క్రియాశీల కార్యకర్తగా వున్నారు.

దేశ విభజన జరిగిన 1947లో ఢిల్లీకి వలస వచ్చారు. ఆనాటి మత కలహాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. ఢిల్లీ విశ్వవిద్యాలయ కళాశాలలో అధ్యాపకునిగా చేరారు. 1953లో ఆయన తన మొదటి కథాసంపుటి 'భాగ్యరేఖ'ను ప్రచురించారు. 1957లో మాస్కో వెళ్ళి అక్కడి విదేశీ భాషల ప్రచురణాలయంలో ఏడేళ్ళపాటు అనువాదకునిగా పనిచేశారు. 20 రష్యన్ పుస్తకాలను హిందీలోకి అనువదించారు. వాటిలో టాల్‌స్టాయ్ కథలు, 'రిజరక్షన్' వున్నాయి. 1963లో తిరిగి వచ్చి ఢిల్లీలో అధ్యాపకునిగా చేరారు. 1965 నుండి 1967 వరకు 'నయీ కహానియా' అనే సాహిత్య పత్రికకు సంపాదకునిగా వున్నారు. 1975లో 'తమస్' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, ఆఫ్రో ఆసియన్ రచయితల సంఘంవారి 'లోటస్ అవార్డు మొదలైనవి అందుకున్నారు. మొత్తం 6 నవలలు, 10 కథాసంపుటాలు, 4 నాటకాలు, తన తమ్ముడు, నటుడు, దర్శకుడు ఐన బలరాజ్ సాహ్నీ జీవిత చరిత్ర రాశారు. 1998లో ప్రభుత్వం 'పద్మభూషణ్'తో సత్కరించింది. 2002లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌తో గౌరవించబడ్డారు. ఆయన తమ్ముడు బలరాజ్ సాహ్నీ భారత ప్రజానాట్యమండలి (IPTA) కళాకారునిగా కృషిచేస్తుంటే, దానివైపు ఆకర్షితుడై కాంగ్రెసు పార్టీని వదలిపెట్టారు. 1975–85 మధ్య అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కృషి చేశారు. ఆఫ్రో–ఆసియా రైటర్స్ అసోసియేషన్ వారి పత్రిక 'లోటస్'కు సంపాదకత్వం వహించారు. సఫ్దర్ హష్మీ హత్య తర్వాత స్థాపించిన 'సహమత్'కు సంస్థాపక ఛైర్మన్‌గా వున్నారు. 2003 జులై 11న తన 88వ యేట మరణించారు.

గోవింద నిహ్లానీ 'తమస్' నవలను జనవరి 1988లో టెలివిజన్ ఫిల్మ్‌గా తీసి విడుదల చేశారు. అయితే మరచిపోయిన విభజన గాయాలను మరల ఈ చిత్రం రేకెత్తిస్తుందని దూరదర్శన్‌లో ఈ సినిమా ప్రసారాన్ని ఆపివేయాలని కోరుతూ బొంబాయి హైకోర్టులో కొందరు కేసు వేశారు. 'తమస్' నవల ద్వారా నేర్చుకొనేదేమీ లేదు. మతపరమైన అంశాలు ఈనాటి యువతలో విషం నింపుతాయి కనుక ప్రసారం ఆపివేయాలని పిటీషనర్లు వాదించారు. అయితే న్యాయమూర్తులు భక్తవర్ లెంటిన్, సుజాత మనోహర్‌లు తీర్పునిస్తూ "ఆనాటి విషాదకాలపు చిత్రీకరణ 'తమస్', రెండు మతాలకు సంబంధించిన మతవాదులు, తీవ్రవాదులు లక్ష్యాలకనుగుణంగా మతహింసను ఎలా రెచ్చగొట్టారో ఆ నవల చిత్రించింది. మత సామరస్యాన్ని భగ్నం చేస్తూ మతవాదులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ద్వేషపూరితమైన ఉద్రిక్తతలను ఎలా సృష్టించారో ఆ నవల తెలియచేసింది. అంతిమంగా మానవ ప్రకృతిలో అంతర్గత వుండే మంచితనం విజయం సాధిస్తుందనీ, ఇరుమతాలవారు సామరస్యం సాధిస్తారనీ నవలలో సందేశం వుందనీ ఈ నవల రెండు మతాలలోనూ వున్న మతతత్త్వవాదులను చిత్రీకరించిందనీ, ఏ ఒక్క మతం పట్లా ద్వేషం రగిలించే సంఘటనలు నవలలో లేవనీ, మతతత్త్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన సందేశం స్పష్టంగా వుందనీ తీర్పులో పేర్కొన్నారు.

దీనిపై సుప్రీమ్ కోర్టులో అప్పీలు వేయగా అక్కడి న్యాయమూర్తులు కూడా బొంబాయి హైకోర్టు తీర్పును సమర్థిస్తూ తమ తీర్పులో ఇలా అన్నారు. 'తమస్' కథాకాలంనాడు ఒక గొప్ప విషాద సంఘటన చోటు చేసుకుంది. మతోన్మాదులు ఎదుటవారి వాదనలు పట్టించుకోరు. ఎటువంటి మినహాయింపులూ ఇవ్వరు. తాము చెప్పేదే సరైనదనీ, సత్యమనీ మొండిపట్టు పడతారు. ఒక గుణపాఠాన్ని నేర్పే చరిత్రను ఈ చిత్రం ప్రదర్శిస్తోంది. ఇది సమాజంలో కల్లోలం చిత్రిస్తుందనీ, నేరాల్ని ప్రేరేపిస్తుందనీ మేము నమ్మటంలేదు".

ఇటు న్యాయవ్యవస్థేగాక, ప్రజాతంత్రవాదులు, లౌకికవాదులు, ట్రేడ్‌యూనియన్లు, విద్యార్థిసంఘాలు మహిళాసంఘాలు, శాస్త్రజ్ఞులు, చలనచిత్ర సంఘాలు సి.పి.ఐ., సి.పి.యం. లాంటి రాజకీయ పార్టీలు 'తమస్'ను గట్టిగా, నిస్సందేహంగా సమర్థించారు.

దూరదర్శన్ కూడా తన నిర్ణయానికి కట్టుబడి ఈ సీరియల్ ఆరు భాగాలను ప్రసారం చేసింది. 1947 తర్వాత కూడా అనేక సందర్భాలలో మతఘర్షణలు, మతహింస సంఘటనలు చోటుచేసు కుంటూనే వున్నాయి. ప్రజలలో మత సామరస్యాన్ని పెంపొందించటానికి ఇటువంటి నవలలు, చిత్రాలు పదేపదే రావాల్సిన అవసరం వుంది. గోవింద నిహ్లానీ ఈ నవల గురించి రాస్తూ "రాజకీయ అధికారం కోసం మతాన్ని ఉపయోగించుకోవడం ఎంత ప్రమాదకరమో, ఎంత వినాశాన్ని సృష్టిస్తుందో హెచ్చరించే నవల ఇది" అన్నారు. ఇప్పుడు మరల మతతత్త్వ రాజకీయాల కేంద్రంగా నడుస్తున్న నేటి పరిణామాల దృష్ట్యా ఇటువంటి సాహిత్యం మానవుల్లో మానవత్వాన్ని పెంపొందిస్తుంది అనడంలో సందేహం లేదు.

హిందీలో రాసిన ఈ నవలకు ఇంగ్లీషులో మూడు అనువాదాలు వచ్చాయి. మొదటిది జయరతన్ 1981లో చేసిన అనువాదం. అయితే దీనిలో అనువాదకుడు, మూలంలో వున్న కొన్ని పేరాలను, వాక్యాలను తొలగించినందున, భీష్మ సాహ్నీయే 2001 మేలో ఇంగ్లీషులోకి అనువదించారు. మూడో అనువాదం డైసీ రాక్‌వెల్ (Daisy Rockwell) 2016లో చేశారు.

భీష్మ సాహ్నీ రాసిన 'పాలి', 'అమృత్‌సర్ ఆగయాహై' కథలు కూడా దేశ విభజన నేపథ్యం కల రచనలే.

ఒక నాటకీయ సన్నివేశంతో నవల ప్రారంభమౌతుంది. నత్తు అనే అతను చనిపోయిన జంతువుల తోలు వలచి అమ్ముకునే మాదిగ కులస్థుడు. మురాదీ ఆలీ అనే ముస్లిం మతస్థుడు నత్తును ఒక పందిని చంపి, దాని శవాన్ని ఇస్తే ఐదు రూపాయలు ఇస్తానంటాడు. కనుక బయట తిరిగే ఒక పందిని పట్టుకొని ఒక చీకటి కొట్లో వేసి దాన్ని చంపడానికి నత్తు చేసే ప్రయత్నాలతో నవల ప్రారంభమౌతుంది. 'పందిని చంపినవాడే బంటు' అనే సామెత ప్రకారం నత్తు ఎన్ని కత్తిపోట్లు పొడిచినా అది చావదు. చివరకు దాన్ని చంపే ప్రయత్నం మానేసి, మురాద్ ఆలీ ఇచ్చిన ఐదు రూపాయలు తిరిగి ఇచ్చేద్దామను కుంటాడు. ఆఖరి ప్రయత్నంగా ఒక పెద్ద బండరాయిని దానిపై విసిరితే, ఆ గాయంతో పంది మరణిస్తుంది. ముందే చేసుకున్న ఏర్పాటు ప్రకారం దాన్ని పారిశుద్ధ్య కార్మికుడు తన బండిలో తెల్లవారుఝామున తీసుకొనిపోతాడు. ఒక పశువుల వైద్యునికి, పందిపై పరీక్షలు చేయడానికి పంది శవం కావాలని మురాద్ ఆలీ నత్తుకు చెప్పి ఆ పని చేయిస్తాడు.

అయితే తెల్లవారిం తర్వాత రావల్పిండి పట్టణంలో ముస్లిం వర్గాలలో ఆందోళన చెలరేగింది. అది 1947 దేశ విభజన కాలం హిందూ-ముస్లిం ఘర్షణలు జరుగుతున్న సమయం. ఉదయమే మసీదు మెట్లమీద పంది శవం వుంటుంది. ముస్లిములకు పంది మాంసం నిషిద్ధం. వారిని రెచ్చగొట్టడానికి హిందువులు ఇలా చేసారని ముస్లిం సమాజం తలుస్తుంది. ఫలితంగా అల్లర్ల గురించి పుకార్లు పుడతాయి. అవి విన్న నత్తు తను చంపిన పందేనా అది అని అనుమానపడతాడు. కాదులే అనుకుంటాడు. తను రాత్రి పందిని చంపిన విషయం ఎవరికైనా తెలిస్తే తన గతి ఏమిటని మథనపడతాడు. ఆరోజు ఒకచోట మురాద్ ఆలీ కనబడతాడు కాని తనను ఎరగనట్లు పలకరించకుండా పోతాడు. మురాద్ ఆలీయే అల్లర్లు సృష్టించడానికి పందిని చంపించి మసీదు మెట్ల మీద హిందువులే వేసారనే పుకారు ప్రచారం చేసినట్లు పాఠకులకు అర్థమౌతుంది. నత్తు ఆరోజంతా అన్యమనస్కంగా వుంటాడు. తప్పు చేసినట్లు బాధపడుతుంటాడు. చివరకు భార్య తరచి తరచి అడగ్గా విషయం చెప్పి, ఎవరికీ చెప్పవద్దని ఆమెతో చెప్పి సాంత్వన పొందుతాడు. ఆ తర్వాత రెండు రోజులకు మతఘర్షణల్లో ఒకదానిలో నత్తు మరణిస్తాడు.

మరో అధ్యాయంలో ఆ వూరిలో ప్రభాత్ ఫేరీలో కలిసే వివిధ మతాలవారు, వృద్ధులు, యువకులు పాఠకులకు పరిచయమౌతారు. వారిలో బక్షీ, జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి, వృద్ధుడు అజీజ్, రామదాసు మాస్టారు, మెహతాజీ, (కాంగ్రెసు కార్యకర్త, జీవిత భీమా ఏజెంటు); అజిత్‌సింగ్, దేశరాజ్, కాశ్మీరీలాల్, జనరల్, దేవదత్ (కమ్యూనిస్టు), శంకరలాల్ తదితరులు వారిలో వారు వాదులాడు కుంటూనే ప్రభాత్ ఫేరీ నిర్వహిస్తూ వుంటారు. మసీదు మెట్లపై పంది శవాన్ని వేసినరోజు వారు పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తూ, ఆ చనిపోయిన పందిని కాళ్ళు పట్టుకుని మసీదు మెట్ల నుంచి లాక్కుపోయి దూరంగా రాళ్ళగుట్ట వెనుక పడేస్తారు. ఈలోగా ఒక ఆవును తరుముకుంటూ వెళ్తున్న వ్యక్తిని చూస్తారు. పట్టణంలో ఉద్రిక్త వాతావరణం గుర్తించి వారిలో కొందరు జిల్లా డిప్యూటీ కమీషనర్, బ్రిటిష్ జాతీయుడు రిచర్డ్ వద్దకు వెళ్ళి, పరిస్థితి వివరించి పోలీసులను అప్రమత్తం చేయమనీ, కర్ఫ్యూ విధించమనీ, తగిన జాగ్రత్తలు తీసుకోమనీ అభ్యర్థిస్తారు. పోలీసులపై, సైన్యంపై తనకు అధికారాలు లేవనీ, రిచర్డ్ వారితో చెప్తాడు.

ఈలోగా సత్సంగ్‌కు చెందిన మహాత్మా వానప్రస్థజీ, హిందువులు ఆత్మరక్షణ కోసం ఆవనూనె, బొగ్గులు తమ ఇంట్లో వుంచుకోమనీ, మరిగే ఆవనూనెను, మండే బొగ్గు నిప్పులను శత్రువు వచ్చినపుడు వారిపై వేయాలనీ ఉద్బోధిస్తాడు. అప్పటికే ఒక ఆవును నరికి దాని

ముక్కలు హిందూ ధర్మశాల వద్ద పడేసినట్లు వార్త వస్తుంది. ప్రతి వార్డులో వార్డు కమిటీలు పెట్టుకోవాలనుకున్నా, ఆ పట్టణంలో రెండు వార్డుల్లో తప్ప మిగిలిన అన్ని వార్డుల్లోనూ హిందూ, ముస్లిముల కుటుంబాలు కలిసి వున్నాయి. నయా మొహల్లా, రాజ్‌పురా వార్డులు మాత్రమే కేవలం హిందూ వార్డులు. లాలా లక్ష్మీనారాయణ కొడుకు రణవీర్ తాలింఖానా నడిపే దేవవ్రత్ శిష్యునిగా దీక్ష తీసుకునే క్రమంలో రణవీర్ చేత ఒక కోడిని చంపిస్తాడు. కోడిని చంపలేనివాడు శత్రువునెలా చంపగలడని శిష్యుడిని రెచ్చగొడ్తాడు. తాను ముందుగా ఒక కోడిని ఎలా చంపాలో చూపించి రణవీర్ చేత మరొక కోడిని చంపిస్తాడు. నూనె కాయడానికి కావలసిన కళాయి, స్వీట్స్ దుకాణం యజమాని వద్ద వుందని – అది తేవటానికి రణవీర్, ధర్మదేవ్‌ను వెంటబెట్టుకుని వెళ్తాడు. ఆ దుకాణం యజమాని వీరిని అడ్డుకుంటే 15 ఏళ్ళ రణవీర్ సహనం కోల్పోయి అతన్ని చంపేస్తాడు. ఆవిధంగా యువతను మతతత్త్వవాదులు ఎలా రెచ్చగొట్టారో రచయిత చిత్రిస్తాడు.

లాలా లక్ష్మీనారాయణకు ఇరుగు పొరుగు మహమ్మదీయ కుటుంబాలే వున్నాయి. వారు ఆయనకు ధైర్యం చెబుతుంటారు. తాము అల్లరిమూకను అడ్డుకొని రక్షిస్తామంటారు. కానీ లాలా అక్కడి నుండి తన మిత్రుడు షా నవాజ్ బ్యూక్ కారులో భార్యను, కూతురు విద్యను తీసుకొని సదర్ బజార్‌లో తన మిత్రుని వద్దకు వెళ్ళిపోతాడు.

ఆరోజు హిందువుల మార్కెట్ తగులబడి 17 దుకాణాలు మసి అయ్యాయి. రోడ్లమీద మూడు నాలుగు శవాలు కన్పించాయి. ఆ తర్వాతరోజు ప్రజలు తమ ఇళ్ళ తలుపులు మూసేసారు. ఆఫీసులు, దుకాణాలు మూసివేశారు. ఒక శ్మశాన ప్రశాంతత నెలకొంది. షానవాజ్ – తన స్నేహితుడు రఘునాథ్, జానకిలను ఒక సురక్షిత ప్రాంతానికి చేర్చి వారిని చూడటానికి వెళ్తాడు. వారు తాము విడిచి వచ్చిన ఇంట్లో నగలపెట్టె మరచిపోగా, దాన్ని తేవడానికి షానవాజ్ ఆ ఇంటికి వెళ్తాడు. అక్కడ కాపలాదారుడు మిలఖీ సహాయంతో పై అంతస్తులో వున్న నగలపెట్టె తెస్తూ, తనముందు మెట్లు దిగుతున్న మిలఖీ తలవెనుక పిలక చూసి ఉద్రేకానికి గురై అతన్ని క్రిందకు తోసేస్తాడు. అతడు మెట్లపై నుంచి పడి మరణిస్తాడు. బయట వాతావరణం షానవాజ్ పై పడి, తన హిందూ మిత్రులను రక్షించినవాడే, ఈ పనిమనిషిని అకారణంగా మృత్యువుకు గురిచేస్తాడు.

మత విద్వేషం బాగా తలకెక్కిన రణవీర్ తన మిత్ర బృందంతో తాము ఆయుధాలు సమకూర్చుకున్న ఇల్లు వున్న వీధిలో ముస్లిములు ఎవరైనా వెళ్తుంటే వారిని చంపడానికి సన్నద్ధులై వుంటారు. జలాల్‌ఖాన్ ఎదురు ఇంట్లో వుంటాడు. ఎత్తయిన దృఢకాయుడు. అతను బయట నుండి ఇంటిలోకి వెళ్తుంటే అతనిపై దాడిచేయాలనుకున్నవారికి దాడి చేయకముందే ఇంట్లోకి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత వారు సమాధి ఎదురింట్లో వుండే వృద్ధుడు పీర్‌సాహెబ్ కనబడతాడు. అతడు రోడ్డుమీదకు వచ్చేసాడు కనుక దాడిచేయలేదు. ఆ తర్వాత పన్నీరు, అత్తరు అమ్మే సాయిబు ఆ వీధిలోకి వస్తాడు. ఇంద్ర అతని ప్రక్కన నడుస్తూ, మాట్లాడుతూనే అతన్ని కత్తితో పొడిచి, కత్తిని ప్రేగులు తెగేటట్లు తిప్పి చంపేస్తాడు. ఇటువంటి చర్యలకు కారణమేమీ లేదు. తమ మతంవారు కాకపోవడమే కారణం.

మరోవైపు మతఘర్షణలు గ్రామాలకు ప్రాకాయి. ఇలాహి బక్ష్ గ్రామంలో అందరూ మహమ్మదీయులే. కాని ఆ గ్రామంలోని అంగడి మాత్రం హరనామ్‌సింగ్‌ది. అతని భార్య బంతో. వీరిద్దరూ సిక్కులు. కొడుకు ఇక్బాల్ సింగ్ మరో గ్రామంలో బట్టల దుకాణం పెట్టుకున్నాడు. కూతురు జస్‌బోర్ సిక్కులు అత్యధికులుగా వున్న వూరిలో వుంది. ఆ గ్రామంలో వారెవరూ హరనామ్‌సింగ్‌పై దాడికి రారు. కానీ ఖాన్‌పూర్ నుండి డోలు వాయిస్తూ వచ్చే అల్లరి మూకలను ఆపగల్గేవారు లేరు. కనుక కరీంఖాన్ అనే వృద్ధ మిత్రుడు హరనామ్‌సింగ్, బంతోలను తక్షణం పారిపొమ్మనమని సలహా ఇస్తాడు. కొన్ని నగలు మూటగట్టుకొని, కొన్ని నగలు పెరట్లో పాతిపెట్టి దంపతులిద్దరూ వూరి పొలిమేర్ల చేరతారు. అల్లరిమూకలు హరనామ్‌సింగ్ ఇల్లు దోచుకుని తగలబెడ్తారు. అది రాత్రి సమయం తాము పెంచిన మైనాను పంజరం నుండి విడిచిపెడతారు. అది పొలిమేర వరకూ వచ్చి 'మీకు శుభం కలుగుతుంది' అని చెబుతుంది. తెల్లవారే సమయానికి డోక్ మరీద్‌పూర్ అనే చిన్న గ్రామానికి చేరి, ఆ గ్రామంలోని మొదటి ఇల్లు తలుపు తడతారు. అది ముస్లిముల ఇల్లు. ఎహెసాన్ ఆలీ, అతని భార్య రాజో, కొడుకు రంజానా, కోడలు ఆకరాంలు వుండే ఇల్లు. తండ్రి, కొడుకు ఆ వూరి మగవారితోపాటు ఇలాహి బక్ష్ గ్రామానికి దోపిడీకి వెళ్ళి – హరనామ్‌సింగ్ అంగడిని దోచుకుంటారు. వాళ్ళు తిరిగివస్తే తమ ఇంటిలో వున్న సిక్కులను బతకనీయరు. బయటకు వెళ్తే గ్రామస్తులు దాడిచేస్తారు. అటువంటి క్లిష్ట సమయంలో రాజో కీలకమైన నిర్ణయం తీసుకుని హర్‌నామ్‌సింగ్ దంపతులకు నిచ్చెన వేసి అటకమీద దాక్కోమంటుంది. ఎహెసాబ్ ఆలీ దోచుకున్న పెద్ద ట్రంకుపెట్టెతో ఇంటికి వస్తాడు. రాజో భర్తతో వారికి ఆశ్రయం ఇచ్చిన సంగతి చెబుతుంది. ఎహెసాబ్ ఆలీకి హర్‌నామ్‌సింగ్ బాగా తెలుసు. ఇద్దరికీ డబ్బు ఇచ్చి పుచ్చుకోవడం వుండేది. ఆలీరాం తన మామ తెచ్చిన ట్రంకు పెట్టె తాళం బ్రద్దలు కొడుతుంటే, ఆమెను హర్‌నామ్‌సింగ్ వారించి, ఆ ట్రంకు తమదే అనీ, తాళం చెవి ఇస్తూ పగలకొట్టవద్దని చెబుతాడు. అటక మీంచి క్రిందకు దిగిన దంపతులను గడ్డివేసే గదిలో కూర్చోపెట్టి బయట తాళం వేశారు. కాని ఇంటికి వచ్చిన రంజాద్‌కు భార్య ఆకరాం వీరికి ఆశ్రయమిచ్చిన సంగతి చెబుతుంది. రంజాద్ ఉగ్రుడై గడ్డి గది తలుపు బ్రద్దలు కొడతాడు. హర్‌నామ్‌సింగ్‌ను రంజాద్ గుర్తుపడతాడు. అతని అంగడిలో టీ తాగేవాడు. గొడ్డలి వున్న చేయి పైకి లేవలేదు. పరిచయం వున్నవాడూ, ఇంటిలో ఆశ్రయం పొందినవాడిని చంపడం కష్టమైంది. మతమౌఢ్యం, విద్వేషం నిండిన వాతావరణంలో సైతం ఒక సన్నని గాటువేసి గీత గీసినట్లయింది. రంజాద్ ఆ గీతను దాటలేకపోయాడు.

అర్ధరాత్రి సమయంలో రాజో, దంపతులిద్దరినీ ఊరి బయటకు తీసుకెళ్ళి, హర్‌నామ్‌సింగ్ వద్ద తీసుకున్న తుపాకీతోపాటు, వారి ట్రంకు పెట్టెలో వున్న నగలమూటను ఇచ్చి సాగనంపుతారు.

ఇలాహిబక్ష్, మురాద్‌పూర్ గ్రామాలు దోచుకొని తిరిగివస్తున్న బృందానికి ఒక సిక్కు కనబడ్డాడు. అతడు దాక్కున్న తొట్రలో నుండి బయటకు లాగి ఇస్లామ్ మతంలోకి మారమన్నారు. లేకపోతే చంపేస్తామన్నారు. అతడు హర్‌నామ్‌సింగ్ కొడుకు ఇక్బాల్‌సింగ్. అతన్ని ఇమామీ దీన్ ఇంటికి తీసుకెళ్లి మతమార్పిడి కార్యక్రమం చేస్తారు. ఆవు మాంసం ముక్కను నోటిలో కుక్కుతారు. కలామా మూడుసార్లు చదివించారు. పేరు షేక్ ఇక్బాల్ మహమద్‌గా మారుస్తారు. ముస్లిం వితంతువుతో వివాహం చేస్తారు. సయ్యద్‌పూర్ గ్రామంలో సిక్కులందరూ తమ కుటుంబాలతో గురుద్వారా చేరతారు. గ్రామాలలో అల్లర్లను అరికట్టడానికి ప్రజలకు నచ్చచెప్పడానికి కమ్యూనిస్టు పార్టీ తరఫున వచ్చిన సోహన్‌సింగ్ సలహాలను వినకపోగా అతన్ని కొట్టబోతారు. మహమ్మదీయులు సమావేశమైన చోట గులామ్‌ఆలీ కోటకు కమ్యూనిస్టు పార్టీ తరఫున వెళ్ళి ఉద్రేకాలను చల్లార్చడానికి ప్రయత్నించిన మీర్‌దాదా మాట ఎవరూ వినరు. అలా సోహన్ సింగ్ మీర్‌దాదా మాటలు రెండు మతాలవారు వినరు. గురుద్వారాలో సమావేశమైన స్త్రీలలో టీ దుకాణపు హర్‌నామ్‌సింగ్ కూతురు జస్‌బీర్‌కౌర్ కూడా వుంది. గ్రామంలో చెదురుమదురు సంఘటనలు జరగవచ్చని, సిక్కులు తగిన సంఖ్యలో వున్నందున, మహమ్మదీయుల వ్యాపారాలు, వృత్తులు సిక్కులతో ముడిపడి వున్నందున సిక్కుల వద్ద ధనం, తుపాకులు వున్నందున పెద్దగా అల్లర్లు జరగవని సిక్కు పెద్ద తేజాసింగ్‌జీ ఊహించాడు. కాని పరిస్థితి తారుమారై పోయింది.

బల్‌దేవ్‌సింగ్ తన తల్లిని ఇంటివద్ద వదలి గురుద్వారాలో రక్షణ కోసం వచ్చాడు. తురకలు వచ్చి తన తల్లిని చంపేసి వుంటారని వూహించి, 'రక్తానికి రక్తం' అంటూ అరుచుకుంటూ వెళ్ళి అక్కడి సందు మొదట్లో వున్న కమ్మరి కరీం బక్ష్ గుండెలు చీల్చి గురుద్వారాకు తిరిగివస్తాడు.

ప్రక్క గ్రామాలకు చెందిన ముస్లిములు సయ్యద్‌పూర్ గ్రామంపై దాడిచేశారు. ఈ కొట్లాటలో పాల్గొన్న ఇరుమతాలవారు శారీరకంగా ఇరవయ్యో శతాబ్దంలో వున్నా, మానసికంగా మధ్యయుగంలో వున్నారు. రెండు రోజులపాటు భయంకరమైన పోరాటం జరిగింది. ఇద్దరి వద్దా ఆయుధాలు అయిపోయాయి. గురుద్వారాలో ఏడు శవాలు పడి వున్నాయి. పహారా కాస్తున్న నిహంగ్‌సింగ్, కమ్యూనిస్టుపార్టీ కార్యకర్త సోహన్‌సింగ్ శవాలు వాటిలో వున్నాయి. తమ తమ మతాలవారు సోహన్‌సింగ్, మీర్ దాదాలను ద్రోహులుగా పరిగణించారు.

సిక్కు సమాజపు స్కూలు బంట్రోతు, భాగామయీ, వృద్ధుడైన సౌదాగర్ సింగ్, ఇంకా మరికొన్ని శవాలు గ్రామం బయటా, నూతి దగ్గరా పడి వున్నాయి. రొట్టెల దుకాణంలో పనిచేసే ఇద్దరు కుర్రాళ్ళు చంపబడ్డారు. సిక్కు సమాజపు స్కూలును తగులబెట్టారు. ఇంకా కొన్ని ఇళ్ళు తగలబడుతున్నాయి. దాడిచేస్తున్న మహమ్మదీయులకు డబ్బు ఇచ్చి రాజీ కుదుర్చుకుందామంటే వారు రెండు లక్షలు అడిగారు. అంత డబ్బు సిక్కుల వద్ద లేదు. చీకటి పడుతోంది. శత్రువులు గురుద్వారా వైపు వస్తున్నారు. ఈలోగా స్త్రీలందరూ అక్కడకు సమీపాన గల బావి దగ్గరకు జస్‌బీర్‌కౌర్ నాయకత్వాన చేరారు. ముందు ఆమె బావిలోకి దూకింది. ఆ తర్వాత తమ పిల్లల్ని, శిశువుల్ని పట్టుకుని 27 మంది సిక్కు స్త్రీలు ఆ బావిలో దూకారు. ముస్లిం అల్లరిమూక గురుద్వారా దగ్గరకు వచ్చేటప్పటికి ఒక్క స్త్రీ కూడా లేదు.

తెల్లవారుతుండగా కాకులు, గ్రద్దలు, రాబందులు గ్రామంలో స్వైరవిహారం చేస్తున్నాయి. చెల్లాచెదురుగా శవాలు పడి వున్నాయి. ఇళ్ళపై దోపిడీ జరిగిన చిహ్నాలు కనబడుతున్నాయి. లావుపాటి కసాయి పెద్దకొడుకు గురుద్వారా వెనుకనున్న కిటికీలకు నిప్పుపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సమయంలో ఆకాశంలో విమానం మోత వినబడింది. సిక్కులు, ముస్లిములు విమానంలో వున్న సైనికులకు అభివాదం చేశారు. ప్రభుత్వం ఈ మృత్యుకాండ ఆపడానికి సంసిద్ధమైనదని తెలుసుకొని సంతోషించారు. అల్లర్లు అణగిపోయాయి. ఈ అల్లర్లలో ఆస్తులు లూటీ అయ్యాయి. ఇళ్ళు తగలబెట్టుకున్నారు. వందలాదిమంది చనిపోయారు. వందలాదిమంది జాడ తెలియలేదు. చాలమంది హిందూ యువతులు తమను ఎత్తుకొనిపోయిన ముస్లిములకు లొంగిపోయి మతం మార్చుకొని వివాహాలు చేసుకున్నారు. ప్రకాశో అనే అమ్మాయిని అల్లారఖా ఎప్పటినుంచో ప్రేమించి ఈ సందర్భంగా పెళ్ళిచేసుకుంటాడు. ఒక స్త్రీపై మూకుమ్మడి లైంగికదాడి గురించీ, చనిపోయిన స్త్రీ శవాన్ని అనుభవించడం, ఒక నిమ్నకులం స్త్రీపై లైంగిక దాడి చేసి చంపేయడం లాంటి సంఘటనలు ఇంకా ఈ నవలలో రచయిత చిత్రించారు.

రావల్పిండి డిప్యూటీ కమీషనర్‌గా చేసిన బ్రిటీష్ జాతీయుడు రిచర్డ్. అతని భార్య లిజా మధ్య భారతీయులపై జరిగిన ఆసక్తిదాయకమైన సంభాషణతో ఈ వ్యాసం ముగిద్దాం. రిచర్డ్ ఇండియాలో బ్రిటీష్ సామ్రాజ్య ప్రతినిధి. భారతీయ చరిత్ర పట్ల మక్కువ కల్గినవాడు. భారతీయ కళామర్మజ్ఞుడు. జిల్లా న్యాయాధికారి జిల్లా డిప్యూటీ కమీషనర్.

మత కలహాలపై రిచర్డ్, లిజా మాట్లాడుకునే సందర్భంగా హిందువులను, ముస్లిములను, సిక్కులను గుర్తుపట్టడం ఎలా అన్న విషయం చర్చించుకుంటారు. మతకలహాలను ఆపడం గురించి లిజా అడిగితే రిచర్డ్ "వారు మనకు వ్యతిరేకంగానూ, వారిలో వారు వ్యతిరేకంగానూ పోరాడుతున్నారు" అంటే

లిజా : జోకా?

రిచర్డ్ : మతం పేరుతో వాళ్ళలో వాళ్ళు కొట్లాడుకుంటున్నారు. స్వాతంత్ర్యం పేరుతో మనతో కొట్లాడుతున్నారు.

లిజా : అతి తెలివి చూపకు – రిచర్డ్. నాకూ కొంత తెలుసు. స్వాతంత్ర్యం కోసం వారు నీకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుతుంటే, మతం పేరుతో వారిలోవారే కొట్లాడుకునేట్లు చేస్తున్నావు.

అంటూ ఒక నగ్న సత్యాన్ని లిజా చెబుతుంది.

వచ్చే సంచికలో : **అనితాదేశాయ్ నవల Clear Light of Day**

వ్యాసం

# ఒరిస్సా రైలు ప్రమాద దుర్ఘటనలో ప్రజల ప్రాణాలను గాలిలో దీపాలుగా చేసిందెవరు?

- ప్రసన్న

**సుమారు** 1500 కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన దుర్ఘటన జూన్ 2 సాయంత్రం ఒరిస్సాలోని బాలాసోర్ సమీపంలో జరిగింది. 2004 సునామీ కారణంగా శ్రీలంకలో జరిగిన రైలు ప్రమాదం తర్వాత, ఇంత పెద్ద ప్రమాదం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. దాదాపు 300 మంది ప్రాణాలు తీసి, 1200 మందిని క్షతగాత్రులను చేసిన ఈ ఘోర దుర్ఘటన జరగకుండా నివారించి ఉండలేమా? ఇది యాదృచ్ఛికంగా జరిగిందేనా? ఈ దుర్ఘటనకు ముందు తర్వాత ఎవరి పాత్ర ఏమిటి?

## వెల్లివిరిసిన మానవత్వం

ప్రమాదం జరిగిందని తెలియగానే ప్రయాణికులను కాపాడడానికి స్థానిక ప్రజలు చేసిన కృషి మనందరం గమనించాం. వెంటనే స్టేషన్‌కి చేరుకుని వీలైనంత ఎక్కువమందిని హాస్పిటళ్ళకు తరలించినవారూ, బోగీలలో ఇరుక్కుపోయినవారిని కాపాడేందుకు అవసరమైన పరికరాలు తమ ఇళ్ళ నుండే తెచ్చి సమష్టిగా శ్రమించినవారూ, హాస్పిటళ్ళ ముందు స్వచ్ఛందంగా బారులు తీరిన రక్తదాతలు ఇలా స్థానిక సామాన్య ప్రజలు మానవత్వమూ, బాధ్యతాయుతమైన స్పందనలతో ప్రపంచ ప్రజలందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారు. నిబంధనల మేరకు తగిన సరంజామాతో ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగడానికి కొంత సమయం పట్టినప్పటికీ, ఉద్యోగులు చేసిన కృషి కూడా అసాధారణం. రెస్క్యూ ఆపరేషన్ అనంతరం కొంతమంది ఉద్యోగులు నీటిని చూసినా కూడా రక్తంగా భ్రమించి భీతావహులయ్యేంతగా ఆ దుర్ఘటన వారిని మానసికంగా కృంగతీసింది. అంతలా నిమగ్నమై వారు కూడా విధులు నిర్వహించారు. మరి మన ప్రజాప్రతినిధుల, రాజకీయ నాయకుల సంగతేంటి? ప్రజాసేవ చేయకుండా క్షణం కూడా బతకలేని మన నేతాగణం ఈ సందర్భంలో ఎలా వ్యవహరించింది??

## పడగవిప్పిన రాజకీయం

ఒక మతోన్మాద ముఠా ఈ దుర్ఘటన జరగగానే స్థానిక రైల్వే ఉద్యోగులలో ముస్లింలు ఎవరు ఉన్నారు? సమీపంలో ముస్లిం ప్రార్థనా మందిరాలు ఎక్కడ ఉన్నాయో వెతకడం ప్రారంభించారు. తమ పరిశోధనలో ప్రమాదం జరిగిన బహానగా బజార్ స్టేషన్ మాస్టర్ ముస్లిం అనీ, పక్కనే ఒక మసీదు ఉందని కనిపెట్టేశారు. ఆ మసీదులోనే కుట్ర పురుడు పోసుకుందనీ, కుట్రదారు అయిన స్టేషన్ మాస్టర్ పరారీలో ఉన్నాడని తమ సోషల్ మీడియా విభాగం ద్వారా పుకార్లు పుట్టించారు. కొన్ని మీడియా సంస్థలు నిష్పాక్షికంగా ఈ విషయమై దర్యాప్తు చేయగా, ఆ స్టేషన్‌లో అసలు ముస్లిం ఉద్యోగి ఎవరూ లేరనీ, వారు మసీదుగా పేర్కొన్న నిర్మాణం ఇస్కాన్‌వారి హిందూ మందిరమేననీ తేలింది. దీంతో తమ మతం పాచిక పారలేదని గ్రహించిన సోషల్ మీడియా విభాగం తోక ముడిచింది. మరోవైపు అధికార విపక్ష నేతలు ఓదార్పు పేరిట, తమ మందీ మార్బలంతో, ఘటనా స్థలంలో బల ప్రదర్శనకు దిగడం సహాయ చర్యలలో తీవ్ర జాప్యానికి కారణమైంది. ఈ విధంగా ఒకవైపు ప్రజలు - ఉద్యోగులు క్షతగాత్రులను కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తుండగా, మరోవైపు మన నేతాశ్రీలు తమ పైశాచిక అరాచకత్వాన్ని ప్రదర్శించారు.

## దుర్ఘటనలో వర్గకోణం

ఖనిజ సంపన్న ఒరిస్సా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలలో ఉద్దేశపూర్వకంగా నిరుద్యోగం పెంచి పోషించబడింది. గనుల యజమానులకు కారుచౌకగా కూలీలు అందుబాటులో ఉండాలంటే అక్కడ ఆ మాత్రం నిరుద్యోగం ఉండక తప్పదు మరి! నిరుద్యోగం - పేదరికం నుండి తమ కుటుంబాలను కాపాడుకోవడానికి సుదూర ప్రాంతాలకు తరలిపోతున్న వలస కార్మికులకు రైలు బండ్లే దిక్కు! ఇలా ఒరిస్సా, బీహార్, బెంగాల్ నుండి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు పొట్ట చేతపట్టుకుని నిత్యం వేలాదిమంది ప్రయాణం చేస్తుంటారు. జూన్ 2న ప్రమాదానికి గురైన కోరమాండల్, యశ్వంతపూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ రైళ్ళు రెండూ కూడా వలస కార్మికుల రైళ్ళుగా ప్రసిద్ధి చెందినవే. ప్రమాదం వలన జరిగిన ప్రాణ నష్టం, అంగవైకల్యం కంటే మిన్నగా, రేపు తమ కుటుంబాలకు పూట గడవడం ఎలాగన్న ఆవేదనకు గురవుతున్న అభాగ్యులే వీరంతా. కరోనా సందర్భంగా వలస కార్మికుల పాదయాత్రలతో రక్తమోడిన జాతీయ రహదారుల సాక్షిగా, దేశమంతా వారి దయనీయ స్థితిని చూసింది. 'వలస భారతం' పేరుతో జనసాహితి ఈ దేశ సంపదల వెనకున్న కన్నీళ్లనీ, రక్తాన్ని అక్షరబద్ధం చేసింది. సంపన్నుల పార్థివ దేహాలను సగౌరవంగా (అవసరమైతే) విమానాలలో తరలించే పాలకులు, ఈ అభాగ్య వలస కార్మికుల కళేబరాలను గుట్టలుగా మునిసిపల్ ట్రక్కుల్లో రవాణా చేయడం చూసి దేశమంతా విస్తుపోయింది.

## (అ)క్రమంగా ప్రై'వేటు'

భారతదేశంలో తొలిసారి సరుకు రవాణా రైలు 1836లో, ప్రయాణికుల రైలు 1853లో ప్రారంభమయ్యాయి. అప్పటి బ్రిటిష్ పాలనలో కొన్ని ప్రైవేటు కంపెనీలకు కూడా రైళ్ళు నడపడానికి

అనుమతి ఇచ్చారు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1944లో రైల్వేరంగాన్ని జాతీయం చేశారు. రైలు ప్రయాణంతో ప్రజా జీవితం ఎంత బలంగా ముడిపడి ఉందంటే, స్వాతంత్ర్యానంతరం 1948, 1956, 1990, 1998లలో విడతల వారీగా జరిగిన ప్రైవేటీకరణలో అనేక రంగాలు బలైపోయినప్పటికీ, రైల్వేని ప్రైవేటీకరించే సాహసం పాలకులు చేయలేకపోయారు. 2009లో రైల్వే ఆపరేటింగ్ విభాగం మినహా మిగిలిన అన్ని విభాగాలనూ ప్రైవేటీకరించారు. పారిశుధ్యం – ఆహార సరఫరాలతో పాటు అత్యంత కీలకమైన ట్రాక్ నిర్వహణ, మరమ్మత్తులు మొదటి దశలోనే ప్రైవేటుపరం కాగా, బిబేక్ దేబ్‌రాయ్ కమిటీ సిఫార్సుల పేరుతో మరిన్ని విభాగాలను ప్రైవేటుపరం చేశారు.

## క్షమార్హం కాని నిర్లక్ష్యం

ఆదాయం కోసం కొత్తగా అనేక గూడ్స్ రైళ్ళు, ప్రయాణికుల రైళ్ళు వేస్తున్నారు. అందుకు అనుగుణంగా కొత్త లైన్లు గాని కొత్తగా సిబ్బందిని గాని పెంచడం లేదు. ఎప్పుడో దశాబ్దాల క్రితం మంజూరైన 14 లక్షల 95 వేల ఉద్యోగాలు మాత్రమే ఇప్పటికీ రైల్వేలో ఉన్నాయి. అందునా ప్రతి ఐదు ఉద్యోగాల్లో ఒకటి ఖాళీగా ఉండగా, ఖాళీగా ఉన్న వాటిలో సగం ఉద్యోగాలు భద్రతా విభాగానివే. దానివల్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల మీద తీవ్రమైన పనిభారం పడుతుంది. ప్రమాదాల నివారణకు సంబంధించిన విధులు నిర్వహించే భద్రతా విభాగంలో పని భారం మరింత అదనంగా ఉంది. ఎలాంటి ఉద్యోగ భద్రతా లేని కాంట్రాక్టు ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలన్నిటిలో కలిపి 21 లక్షల 12 వేలమంది ఉండగా, వారిలో మూడవ వంతు రైల్వేలోనే ఉన్నారు.

దేశపు మొత్తం రైల్వే లైన్‌లో 15% రూట్లలో, తమ సామర్థ్యానికి మించి 125% లోడ్‌తో పనిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు గంటకు 150 కిలోమీటర్ల సగటు వేగంతో ప్రమాదాలు జరగకుండా రైల్వేలను నడుపుతుండగా, కేవలం 50 కిలోమీటర్ల సగటు వేగంతో కూడా మన దేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది వ్యవస్థాగతమైన అసమర్థతకి స్పష్టమైన నిదర్శనం.

## కుట్ర ఎవరిది?

దేశంలో జరుగుతున్న రైలు ప్రమాదాల్లో 70% పట్టాలు తప్పడం వల్ల జరుగుతున్నాయి. పురాతన బోగీలు, నిర్వహణ లేని పట్టాలు, తగిన సాంకేతికత లేని సిగ్నళ్ళు ఇందుకు కారణమని కాగ్ స్పష్టం చేసి చాలాకాలం అయింది. గత 16 సంవత్సరాలలో జరిగిన ప్రమాదాల వలన ఈ దేశానికి జరిగిన నష్టం దాదాపు 87 వేల కోట్లు. ఇన్ని ప్రాణాలు పోతున్నా, ఇంత నష్టం జరుగుతున్నా, సామాన్యులు ప్రయాణించే రైళ్ళ భద్రత కంటే ఎగువ మధ్యతరగతి, సంపన్నుల కోసం కొత్త వందేభారత్ రైళ్ళు ప్రారంభించడానికీ, దాన్ని తమ రాజకీయ ప్రయోజనాలకు ప్రచారం చేసుకోవడానికే మోడీ ప్రభుత్వం తహతహలాడుతుంది. దేశ ఆర్థికవ్యవస్థకు జీవనాడి లాంటి రైల్వే వ్యవస్థకు ప్రత్యేక బడ్జెట్ ఉన్నప్పుడు తమ అవసరాలు – ప్రాధాన్యతలను రైల్వేశాఖ నిర్ణయించుకునేది. రైల్వేకి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టే పద్ధతిని మోడీ ప్రభుత్వం రద్దుచేశాక, ఇప్పుడు ప్రాధాన్యతలను ఆర్థికశాఖ నిర్ణయించడం జరుగుతుంది. ఫలితంగా రైల్వే ట్రాకుల నిర్వహణకు కూడా బడ్జెట్ కేటాయింపులు క్రమంగా తగ్గిపోతున్నాయి.

పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా జనరల్ బోగీలు పెంచకపోగా ఇంకా తగ్గించడం పేద ప్రయాణికులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుంది. అపరాధ రుసుము చెల్లించి స్లీపర్ బోగీలలో వేలాది కిలోమీటర్లు ప్రయాణిస్తున్న వలస కార్మికులను మనం నిత్యం చూస్తున్నాం. పెరుగుతున్న రైళ్ళ సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని పెంచకపోగా కనీసం ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేయకపోవడం ఉద్యోగుల మీద తీవ్ర పనిభారానికి కారణమై ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దేశ ప్రజల ప్రాణభద్రతకు సంబంధించిన రైల్వేలో అనేక కీలక విభాగాలను ప్రైవేటీకరించడం వల్ల, లాభాపేక్ష తప్ప సామాజిక బాధ్యతలేని పెట్టుబడిదారుల చేతుల్లో ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలుగా మారిపోయాయి.

కుట్రపూరితంగా ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి పెట్టుబడి దారులకు లాభాలను దోచిపెడుతున్న పాలకులే ఇలాంటి ప్రమాదాల వెనక ఉన్న కుట్రదారులు. ఈ కుట్రలను తిప్పి కొట్టి శ్రామిక ప్రజలకు భద్రతను హామీ ఇచ్చే, సౌకర్యవంతమైన వ్యవస్థను సాధించుకోవాలంటే శ్రమజీవులు – ఉద్యోగులు భుజం భుజం కలిపి పోరాడాల్సిందే! ●

# భీమ్ ఆర్మీ చీఫ్ పై హంతక దాడిని ఖండిస్తున్నాం!

**నిర్బంధాలు,** బెదిరింపులకు భయపడకుండా మొక్కవోని ధైర్యంతో దళిత హక్కుల సాధన కోసం పీడితులకు అండగా ఉన్న చంద్ర శేఖర అజాద్ రావణ్‌పై జూన్ 28వ తేదీన హిందూత్వ మతోన్మాద శక్తులు ఉత్తరప్రదేశ్‌లోని షెహరాన్పూర్‌లో తుపాకులతో హంతక దాడికి తెగబడ్డాయి. ఉత్తరప్రదేశ్‌లో 8 సంవత్సరాల క్రితం భీమ్ ఆర్మీని స్థాపించి కుల, మత ఉన్మాదాలకు వ్యతిరేకంగా దళితుల ఆత్మగౌరవ పోరాట పతాకగా చంద్రశేఖర అజాద్ నిలబడ్డారు. దీన్ని తట్టుకోలేని యోగి ప్రభుత్వం కక్ష గట్టి అనేక తప్పుడు కేసులు బనాయించి ఆయనను, ఆయన అనుచరులను జైళ్లల్లో నిర్బంధించింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అనుచర ఫాసిస్టు మూకలే పై దాడికి పాల్పడ్డాయి.

ఈ దాడిని జనసాహితి తీవ్రంగా ఖండిస్తున్నది.

భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ అజాద్ రావణ్‌పై కాల్పులు జరిపిన దోషులను కఠినంగా శిక్షించాలి! కాల్పులకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వమే బాధ్యత వహించాలి!

**– జనసాహితి**

వ్యంగ్యం

# యాగం

- శంకరం

**21**వ శతాబ్దం రెండవ సంవత్సరం గోద్రాలో యాగం మొదలైంది.

యాగానికి పునాదిరాళ్ళు బాబ్రీ మసీదును కూల్చివేసిన రాళ్ళతో కట్టారు.

సమిధిలు జాజ్వల్యమానంగా పోఖ్రాన్ అణు విస్ఫోటనం నుండి వెలువడిన మంటల వలె ప్రజ్వరిల్లుతున్నాయి.

ఋత్విక్కులు మహోత్సాహంగా ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ సమిధలను, ఆజ్యాన్ని వేస్తున్నారు.

కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 ఎత్తివేయబడి, జమ్మూకాశ్మీర్ రెండు ముక్కలయ్యింది.

మేకిన్ ఇండియా పేరుతో విదేశీ కంపెనీల దోపిడీ మరింత పెరిగింది.

అకస్మాత్తుగా విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు రప్పించడానికి పెద్దనోట్లు రద్దయ్యాయి.

ప్రజాసంక్షేమం ఉద్దేశించి బ్యాంకులు విలీనం చేయబడ్డాయి.

ప్రభుత్వరంగ సంస్థల నుండి ప్రభుత్వ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి.

లక్షల కోట్ల కార్పొరేటు పన్నుకు మినహాయింపు లభించింది.

మూడు వేల కోట్లతో ఐక్యతా ప్రతిమ ఐదువేల మంది ఆదివాసులను బయటకు పంపింది.

కార్మికులకు సంబంధించిన చట్టాలు కుదింపబడ్డాయి.

కరోనా పేరుతో ఆకస్మిక లాక్‌డౌన్ వలస కార్మికులకు మోక్షం కలిగించింది.

రైతులకు వ్యతిరేకంగా చేయబడిన నల్లచట్టాలకు 70 మంది రైతుల బలి.

యజ్ఞగుండంలోని మంటలు ఉవ్వెత్తున పైకెగిసాయి.

పన్నెండు వందల కోట్ల ప్రజాధనంతో నూతన రాజభవనం వెలసింది.

మణిపూర్ విధ్వంసం, రెజ్లర్లపై లాఠీఛార్జితో పూర్ణాహుతి జరిగింది.


రాజదండం చేతికి వచ్చింది. ●






కుమారన్ ఆశాన్

( 1873 - 1924)



16

సింగంపల్లి
అశోక్‌కుమార్

# మహాకవి కుమారన్ ఆశాన్

## మలయాళ నవశక సాహితీసేద్య కిసాన్
## సాంస్కృతిక విలువల పరిరక్షణ జవాన్
## మరణం యొక్క తాత్విక చికిత్సా నిశ్శబ్దం
## 'వీణపూవు' శబ్దంగా ధ్వనించెను ఆశాన్

**'మీకై మీరే ధర్మశాస్త్రాలను మార్చండి, లేకుంటే ధర్మశాస్త్రాలే మిమ్మల్ని పతనం చేస్తాయి' అంటూ సనాతనవాదులను హెచ్చరించిన మహాకవి కుమారన్ ఆశాన్ భారతీయ మలయాళ సాహిత్య కవి, రచయిత, తత్వవేత్త, సంఘసంస్కర్త. ఆధునిక మలయాళ కవిత్రయమైన మహాకవి కుమారన్ ఆశాన్, వల్లథోల్ నారాయణ మీనన్, ఉల్లూరు యస్. పరమేశ్వర్ అయ్యర్‌లలో ఒకరు.**

ప్రాథమిక స్థాయిలోనే బడి చదువుకు స్వస్తి చెప్పిన ఆశాన్‌కు బెంగాలీ సాహిత్యం పునరుజ్జీవనం చెందుతున్న కాలంలో కలకత్తాలో చదవుకునే అవకాశం కలిగింది. సంస్కృతంతో బాటు తమిళం, ఇంగ్లీషు భాషా సాహిత్యాలలో ప్రావీణ్యం సంపాదించారు.

ఆశాన్ తొలుత కొన్ని భక్తి రచనలు చేశారు. తరువాత 'వీణపూవు, దురవస్థ, నళిని, లీల, చండాల భిక్షుకి, కరుణ, ప్రరోదనం, చింతా విష్టాయ సీత'వంటి సాహిత్యంలో ఫ్యూడల్ అణచివేతలు, వర్గ దృక్పథం, సామ్రాజ్యవాదం, భౌతికవాదం, అంతరానితనం, స్త్రీ వ్యక్తిత్వం తదితర అంశాలపట్ల అవగాహనతో సామాజిక వ్యాఖ్యానం సంతరించుకున్న రచనలు చేశారు. ప్రబోధాత్మక స్వరంతో కాకుండా దళిత, దళితేతర జీవన వాస్తవిక పరిస్థితుల సృజన ద్వారా మలయాళ సాహిత్యంలో మహాకవి అయ్యారు.

ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీనారాయణగురు, తన ప్రత్యక్ష గురువు కావడం ఆశాన్ జీవితంలో ఒక మలుపు. దళిత సాహిత్య, సామాజిక రంగాలలో గొప్ప గెలుపు.

'స్నేహ(ప్రేమ) గాయకన్'గా పేరుపొందిన కుమారన్, భావానుభూతికి ప్రాముఖ్యత నిస్తూ అన్యాపదేశంగా పుట్టుకనుండి మరణం వరకు మానవ జీవిత విషాదాన్ని పుష్పసంకేతం ద్వారా అత్యద్భుతంగా వర్ణించిన ఖండకావ్యం 'వీణపూవు' మలయాళ సాహిత్యంలో క్లాసిక్‌గా ప్రశంసలందుకుంది. సీత స్వగతంగా చిత్రించిన 'చింతా విశిష్టాయ సీత' మరొక ఖండ కావ్యం. కొందరు విమర్శకులు దీన్ని ఆశాన్ రచనలలో విశిష్టమైనదిగా భావిస్తారు.

1922లో మద్రాసు విశ్వవిద్యాలయం 'మహాకవి' అనే ఉపసర్గను ప్రదానం చేసింది. 1973లో ఆశాన్ శతజయంతికి స్మారక తపాలాబిళ్లను కేంద్రప్రభుత్వం విడుదల చేసింది.

'మలయాళీ కవిత్వాన్ని ఆధునికం చెయ్యగలిగిన మలయాళ కవిత్రయంలో కుమారన్ ఆశాన్ ప్రథముడు...మహాకావ్యం అంటూ తాను ఏదీ రాయకపోయినా కుమారన్ ఆశాన్ మహాకవి అనిపించుకోగలిగాడు' అంటూ ప్రముఖ మార్క్సిస్టు తెలుగు విమర్శకులు కె.వి.ఆర్ ప్రశంసలందుకున్న ఆశాన్ ట్రావెన్‌కోర్‌లోని చిరయిన్‌కీజు తాలూకాలోని కైక్కర గ్రామంలో 1873 ఏప్రిల్ 12న జన్మించారు, 1924 జనవరి16న ట్రావెన్ కూర్ అలెప్పీలో ఆయన ప్రయాణిస్తున్న రిడీమర్ అనే పడవ పల్లనానదిలో బోల్తా పడటంతో నీట మునిగి కన్నుమూశారు. ఆయన్ని దహనంచేసిన ప్రదేశాన్ని కుమారకోడి అని పిలుస్తారు. ఆశాన్ ముఖచిత్రంగా 1996 జనవరి 'ప్రజాసాహితి' సంచిక వెలువడింది.

## సినిమా సమీక్ష

### సుఖశాంతుల నేల అన్వేషణలో

# ‘జోయ్‌ల్యాండ్ (2022)’

– బాలాజీ (కోల్‌కతా)

**కాన్స్** ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రీమియర్ అయిన మొదటి పాకిస్తాన్ సినిమా ‘జోయ్‌ల్యాండ్’ (2022). ఈ సినిమాకు అక్కడి ప్రేక్షకులు స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడమే కాకుండా దానికి ఆ ఫెస్టివల్ అన్‌సెర్టెన్ రిగార్డ్స్ జ్యూరీ అవార్డు, ‘ఎల్జీబీటీక్యూ’ అంశంపై వచ్చిన సినిమాగా క్వీర్ పామ్ అవార్డులతో సత్కరించారు. ఈ సినిమా 95వ అకాడెమీ అవార్డుల కోసం పాకిస్తాన్ ఎంట్రీగా ఎంపికవడమే కాకుండా, ఉత్తమ విదేశీ సినిమా అవార్డుల షార్ట్ లిస్టులోకి కూడా చేరింది. అంతర్జాతీయంగా మరెన్నో అవార్డులు సంపాదించుకున్న ఈ సినిమాపై పాకిస్తాన్ మొదట్లో నిషేధం విధించింది. తర్వాత ఎన్నో కట్స్‌తో విడుదల చేసింది. పాకిస్తాన్ పంజాబు ప్రాంతంలో ఇప్పటికీ నిషేధం వుంది. ఆ దేశంలోని చాలా మత సంస్థలు ఈ సినిమాను దుయ్యబట్టాయి. ఇవన్నీ చూసినప్పుడు ఒకప్పుడు మన దేశంలో ‘ఫైర్’ సినిమాపై చెలరేగిన వివాదం గుర్తొస్తుంది. ఏముందీ సినిమాలో? ఎందుకంత వివాదం?




**పాత్రల పరిచయం :**

1. లాహోర్‌లోని మధ్యతరగతి రాణా పరివారం. కుటుంబ పెద్ద అమానుల్లా (సల్మాన్ పీర్జ్యాదా). వీల్ చైర్లో పడి వున్నా, అతడి మాటే చెల్లుబాటౌతుంది ఆ ఇంట్లో.

2. అతడి పితృస్వామ్యతత్వాన్ని పుణికి పుచ్చుకున్న పెద్ద కొడుకు సలీం (సోహైల్ సమీర్).

3. సలీం భార్య నుచ్చీ (సర్వత్ గిలానీ) ఒక మగపిల్లాడి కోసం వరుసగా ఆడపిల్లల్ని కంటున్న యంత్రం, ఇంటికి పనిమనిషి. పితృస్వామ్యాన్ని అమలు చేసే మగవాళ్ల మధ్య ఆ స్వామాన్ని తుచ తప్పకుండా స్వీకరించిన మనిషి ఈమె. ఈ పాత్రలతో ఎవరికీ ఇబ్బంది ఉండదు. ఇబ్బంది తెచ్చే క్యారెక్టర్లు వేరే వున్నారు.

4. వారిలో మొదటి వాడు సలీం తమ్ముడు హైదర్ (అలీ జునేజో). ‘వదిన చాటు బిడ్డ’లా ఆమెకు అన్ని పనుల్లోనూ చేదోడు వాదోడుగా ఉంటాడు. అతడికి ఉద్యోగం లేదు. ఇంటి పనీ, వంట పనిలో తేడా లేకుండా కష్టపడుతుంటాడు. ముగ్గురు ఆడపిల్లల ఆలనాపాలనా బాబాయ్‌దే. ఎందుకంటే మగబిడ్డ కోసం వేచిచూస్తున్న ‘మగాడి’కి తన ఆడపిల్లలపై పెద్దగా ఆసక్తి లేదు.

5. హైదర్ భార్య ముంతాజ్ (రస్తీ ఫరూక్) ఒక బ్యూటీ పార్లర్లో పనిచేస్తుంది. ఉద్యోగం చేసే స్వేచ్ఛను ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని హైదర్‌కు ఆమె పెళ్లికి ముందే చెప్పేసింది. సహజంగానే ఆమె ఉద్యోగం చేయడం, ఆమె భర్తకు ఉద్యోగం లేకపోవడం ఇంట్లోని ‘మగాళ్లకు’ నచ్చదు.

**కథలో మెలిక :**

వదినకు ఈసారి కూడా ఆడపిల్లే పుడుతుంది. ‘నీకేమైనా పిల్లల్ని కనే ఉద్దేశం వుందా?’ హైదర్‌కు తండ్రి ప్రశ్న. ‘ముంతాజ్ ఇప్పుడే వద్దంటోంది’ – హైదర్ జవాబు. ‘వద్దంటోందా లేక నీ వల్ల చేతకావడం లేదా?’ తండ్రి మాటల పొడుపు. హైదర్‌కు తన అన్నయ్య కుమార్తెలతో ఆడుకోవడం ఇష్టం. కుర్బానీ కోసం మేక మెడ కొయ్యడం అతడి వల్ల సాధ్యం కాని పని. (అతడి కంటే ధైర్యంగా ఆ పని అతడి భార్య చేస్తుంది.) ఈపాటి కథలోనే మనకు హైదర్ సెక్సువల్ ఓరియెంటేషన్ అర్థమైపోతుంది. ఉద్యోగం లేకపోవడంతో అతడి అన్నయ్య కూడా అతడ్ని సేవకుడిలా ట్రీట్ చేస్తున్నాడు. తనకంటూ గౌరవం, గుర్తింపూ అవసరం. స్నేహితుడు కైసర్ సహాయంతో అతడికో చవకబారు థియేటర్లో సెక్స్ ఉద్దీపక డాన్సు చేసే బీబా (అలీనా ఖాన్) అనే ట్రాన్స్‌వుమన్ (శస్త్ర చికిత్స ద్వారా స్త్రీగా శరీర భాగాల మార్పిడి చేసుకున్న పురుషుడు) దగ్గర బ్యాక్‌గ్రౌండ్ డాన్సరుగా ఉద్యోగం దొరుకుతుంది. అటువంటి థియేటర్ అంటే సమాజంలో చాలా చిన్న చూపు. అందుకే ఇంట్లో థియేటర్ మ్యానేజర్ పోస్ట్ అని అబద్ధం చెబుతాడు.

ఇప్పుడు ఆరో ముఖ్యమైన పాత్ర బీబా పరిచయం. ఆడా, మగా అనే మెజారిటీ సెక్సువాలిటీనే మనకు బాగా అర్థమయ్యేది. శారీరక పరంగానో, మనోవైజ్ఞానికపరంగానో భిన్న లైంగికత అనేది మన మామూలు బుర్రలకు అర్థం కాదు. అటువంటి భిన్న వ్యక్తుల పట్ల అవగాహన ఉండదు కనుకనే వారి బాధల పట్ల సానుభూతి కూడా సమాజంలో అరుదు. అంతెందుకూ? సొంతింటి వాళ్లే పరాయివారిలా చూసినపుడు వేరే వారి ప్రేమ వారికెక్కడ దొరుకుతుందీ? అందుకే,

థర్డ్ జెండర్ వారుగానీ, ట్రాన్స్‌జెండర్ వారుగానీ సమాజంలో తమకు దక్కాల్సిన కనీసపు గౌరవస్థానం కోసం మనలాంటి అవగాహనా రాహిత్యపు వెనుకబడిన సమాజాల్లో చాలా సంఘర్షణ చేయాల్సి వస్తుంది. బీబా పాకిస్తాన్ సమాజిక నేపథ్యంలో ఆ పోరాటమే చేస్తోంది. సెక్సు బొమ్మగా చూసే విష పురుషుల మధ్య చాలా భయంకరమైన పని పరిస్థితుల్లో తన కనీసపు జీవనోపాధి సంపాదించడమే కాక, మరింత సంపాదించి ఎదగాలని ప్రయత్నిస్తున్న బీబాను చూస్తే చాలా ఆశ్చర్యం వేస్తుంది హైదర్‌కు. పైగా ఇంట్లో ఎవరూ పట్టించుకోని తనతో నిష్కరతుగా ప్రేమతో మాట్లాడే బీబాపై హైదర్‌కూ, తనను సాటి మనిషిలా గౌరవంగా చూసే హైదర్‌పై బీబాకూ ప్రేమ ఏర్పడుతుంది. తన భార్యకు దూరమై బీబాకు దగ్గరైన హైదర్ శారీరకంగా బీబాతోనూ ఏమీ చేయలేని అశక్తుడు అన్న విషయాన్ని బీబా కనుగొంటుంది. అతడిలోని 'స్త్రీ తత్వం' వారి అత్యంత సన్నిహిత సందర్భంలో బయట పడిపోతుంది. బీబా అతడ్ని గెంటేస్తుంది.

## ముంతాజ్ విషాదం :

తన భర్త హైదర్‌కు ఉద్యోగం రావడంతో ముంతాజ్‌కు జాబ్ మాన్పించేస్తారు. ఆమెకు ఉద్యోగం చేయాలన్న కోరిక బలంగా ఉంటుంది. స్వతంత్రంగా వుండాలని ఉంటుంది. ఆ విషయం ఆమె భర్తకూ, ఆమె తోబుట్టువు నుచ్చీకీ బాగా తెలుసు. వీరిలో ఎవరూ ఆమెకు సపోర్టివ్వరు. నుచ్చీ కూడా తానొక డ్రెస్ డిజైనర్ కావాలనుకున్న కోరికను బలంగా అణుచుకున్నదే! తన తోటికోడలు ఉద్యోగం వదులుకోవడం ఆమెకు పెద్దగా బాధనిపించలేదు. కానీ ఇంటికీ, వంటింటికీ పరిమితమైపోవడం ముంతాజ్‌కు మెడకు ఉరేసినంత విషాదం. భర్తతో మరో సుఖం దొరకేది లేదు. వారికి ప్రైవసీ దొరకడమే కష్టం. ఆ దంపతుల మధ్యలో ఆ ఇంటి ఆడపిల్లలు నిద్రపోతుంటారు. పైగా, ముంతాజ్ సెక్సువల్ ఓరియెంటేషన్ మరోలా ఉంటుంది. అటువంటి ఓ సందర్భం ఆమె బావ గారి కంట పడుతుంది కూడా! (ఈ దృశ్యం మనకో 'హింట్'ను వదుల్తుంది.)

ఇదిలా వుంటే ముంతాజ్ ప్రెగ్నెంట్ అన్న విషయం తెలుస్తుంది. ఆమె నాలుగు నెలల పిండాన్ని సెక్స్ నిర్ధారణ చేసి కడుపులో ఉన్నది మగబిడ్డ అని తెలుసుకుంటారు. (దర్శకుడు తెలివిగా ఆ బిడ్డకు తండ్రి ఎవరు అన్న విషయాన్ని ప్రేక్షకుల యోచనకే వదిలేస్తాడు.) వారసుడు రాబోతున్న వార్త ఆ ఇంటి ముసలాడికి చాలా హ్యాపీగా ఉంటుంది. ఆ ఇంట్లో ఉన్న ఆడపిల్లల్ని ప్రేమగానే చూస్తారు గానీ, మగపిల్లాడికి దక్కబోయే గారాభమే వేరు!

## ముంతాజ్ ప్రతీకారం :

తల్లి కావడం తన జీవిత పరమావధి కాదు. ఉద్యోగం చేస్తూ స్వేచ్ఛగా ఉండడం తనకెక్కువ ఆనందాన్నిచ్చే విషయం. ఆ ఆనందం తన నుంచి దూరం ఔతుండగా, తనను మరింత గృహబంధీగా మార్చబోయే గర్భమొకటి! ఇప్పుడు గర్భంలో ఉన్నది మగశిశువని తెలియగానే తన కంటే ఎక్కువ ఆనందిస్తున్నారు పురుషపుంగవులు! అందుకే వారి ఆనందం చూస్తుంటే తనకు మరింత చిర్రెత్తుకొస్తోంది. తనకేమైనా ఫర్వాలేదు, వారికి ఆనందం మాత్రం అందకూడదు. అందుకే మామగారి జన్మదిన వేడుకల్లో ఆమె ఆ ఇంటి ఆడపిల్లల్తో పరుగులు పెడ్తూ, గంతులేస్తూ ఆడుకుంటుంది. ఏ మాత్రం జారిపడినా కడుపులోని బిడ్డకు ప్రమాదం. (నిండు గర్భిణీ అయిన నుచ్చీకి ప్రమాదవశాత్తూ ఉమ్మనీరు కారి ఆకస్మికంగా ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితిని సినిమా ఆరంభంలోనే చవిచూసిన కుటుంబమది.) పుట్టబోయే బిడ్డ ఆ కుంటుంబానికి వారసుడు. ఆడపిల్లను ఉద్యోగం చేసుకోనివ్వని ఆ ఇంటి కోసం ఉద్యోగం వెలగబెట్టి, అధికారం చెలాయించబోయే మగపిల్లాడు వస్తున్నాడు. ఆ సుఖాన్ని ఆ ఇంటి పుంసత్వానికి దక్కకుండా చేయాలి. అదే ఆమె కసి, ఆమె ధిక్కారం.

మామగారి 70వ జన్మదిన వేడుక ముగిశాక, ఆమె టాయిలెట్ ట్యాంక్‌లో దాచుకున్న బాటిల్‌ను బయటికి తీసి, అందులోని ద్రవమంతా తాగేస్తుంది. టాయిలెట్ దగ్గర ఆ సీసా పట్టుకుని వున్న ఆమెను హైదర్ చూస్తాడు గానీ, తన వ్యక్తిగత విషాదం కారణంగా, ముభావంగా పట్టించుకోకుండా వెళిపోతాడు. అప్పటికి ఆమె ఆ మందు తాగి ఎంతో సేపు కాలేదు. హైదర్ సకాలంలో ఎంక్వైరీ చేసి, ఆమెను ఆసుపత్రికి చేర్చినట్లైతే, (సినిమా మొదట్లో తన వదిన విషయంలో చేసినట్టు) పెద్ద విషాదం తప్పేది. భర్త అలా చేస్తాడన్న చిరు ఆశ కూడా వమ్మయింది. చివరికి ఆమె శవమై మిగిలింది.

## ఆ చావుపై మండి పడ్డవారూ – పశ్చాత్తాపపడ్డవారూ :

హైదర్‌కి దూరమైనా, అతడి విషాద ఘడియల్లో అతడ్ని ఓదార్చడానికి వస్తుంది చాలా పరిపక్వతగల బీబా. ముసలాడికి కోడలి చావు కంటే కడుపులోని మనవడి చావు ఎక్కువగా బాధించినట్టు వుంది. 'ఇంటి వారసుడ్ని చంపే హక్కు ఆమెకెవరిచ్చారు?' అని ఇంట్లో శవముండగానే అరుస్తాడు ఆ శవం బావ సలీం. ఎన్నడూ లేనంతగా నుచ్చీకి కోపం కట్టలు తెచ్చుకుంటుంది. కొంచెం రెట్టించిన స్వరంలోనే 'ఈమె చావుకు కారణం ఈ ఇంట్లోని వారిమంతా' అని అరుస్తుంది నుచ్చీ. తను కూడా తన తోటికోడలి చావుకు కారణమైంది. ముంతాజ్‌ను తనలా మార్చింది తనే! ముంతాజ్‌కు లూజుగా వున్న బట్టలు ఇష్టం. కానీ తన ఇష్టత ప్రకారం బిగుతుబట్టలు వేయించింది. 'పని మానెయ్యడం' పెద్ద విషాదం కానట్టు సర్దిచెప్పింది. తనొక్కతే ఇంటి పని ఎందుకు చేయాలని పేచీపెట్టింది. ఇప్పుడు మగరాయుళ్ల మధ్య ఏకైక స్నేహితురాలిలా వుండే తోబుట్టువును కోల్పోయింది.

హైదర్‌కు ఈ చావు మరింత విషాదాన్నీ, పశ్చాత్తాపాన్నీ కలుగ జేసింది. పెళ్లి నాటి సంగతులు గుర్తొస్తాయి అతడికి. పెళ్లికి ముందు రహస్యంగా ముంతాజ్‌ను కలిశాడతను. 'తాము స్నేహితుల్లా ఉండగలిగితే, తనను ఉద్యోగం చేసుకోనిస్తే తను పెళ్లికి రెడీ' అంటుంది ఆమె. తను ఓకే అనడంతో, మంచి భర్త దొరకబోతున్న సంబరం ఆమె మోహంలో చూశాడు. కానీ ఈనాడు ఆమె చావును ఆపలేకపోయాడు.

సముద్రం ఒడ్డున కూర్చుని, ఆ విశాల సాగరాన్ని చూట్టం ఆమెకిష్టం. తామిద్దరూ ఏదో రోజు సముద్రం చూట్టానికి వెళతామనుకున్నారు. ఇప్పుడు తనొక్కడే బయల్దేరాడు. తనపై ఏ ఆంక్షలూ లేనట్టు, ప్రశాంతంగా రైలెక్కాడు. కిటికీలోంచి వస్తున్న చల్లగాలిని ఆస్వాదిస్తూ, గమ్యం చేరి, సముద్రం ఒడ్డుకు వెళ్లి ఆ విశాల, అవిశ్రాంత అలలు వస్తున్న వైపు సాగిపోతున్నాడు. (మొదటి దృశ్యంలో తెల్లటి వస్త్రం కప్పుకున్న హైదర్‌ను మనం చూస్తాం. శవంపై కప్పే 'కఫన్' కూడా తెల్లని వస్త్రమే!)

## ఐదొందల యేళ్లకు ముందే వచ్చిన సినిమా :

'ఫైర్' సినిమాపై వివాదం రేగినపుడు సమలైంగికతపై ఎంతో మంది మేధావులు చర్చించారు. అర్ధ నారీశ్వరుడూ, మోహినీ అవతారం, అయ్యప్ప – ఇలా ఎన్నో పౌరాణిక పాత్రల్ని విశ్లేషించి భిన్న లైంగికత అనాదిగా ఉన్నదే అని వాదించారు. 'శిఖండి – ఇంకా ఎవరూ చెప్పని మరికొన్ని కథలు' పుస్తకంలో దేవదత్ పట్నాయక్ ఎన్నో పౌరాణిక పాత్రలకు సరికొత్త భాష్యాలు చెబుతూ స్త్రీత్వం, పురుషత్వం, క్వియర్ తనం అనే అంశాల మూలాలు అన్వేషిస్తాడు. (తెలుగు అనువాదం హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారు వేశారు.) ఇస్లాం మతం సమలైంగికతను 'హరామ్'గా భావిస్తుంది అన్న ఒక్క మాటతో తేల్చేస్తే సమస్య తీరిపోదు. అదే పాకిస్తాన్‌లో సమలైంగిక వివాహాల్ని చట్టబద్ధం చేసిన చట్టాలూ వచ్చాయి. వాటిని వ్యతిరేకించే జనాలు కూడా గరిష్ఠ సంఖ్యలోనే ఉన్నారు. ఇంకా 'ఎల్జీబీటీక్యూ'లోని ఇతర సెక్షన్లు ఉండనే ఉన్నాయి. చాలా సానుభూతితో కూడుకున్న సెన్సిటివ్ సమాజం మాత్రమే భిన్న లైంగికతలను అర్థం చేసుకోగలదు. అటువంటి దశకు మనమూ, పాకిస్తాన్‌లాంటి సమాజాలూ ఎన్నటికి చేరగలవో సందేహమే! అసలు మన పయనం పాతరాతి యుగాలవైపు వెళ్తుందేమో అని మరో అనుమానం! అటువంటి స్థితిలో ఇది వేళకు ముందొచ్చిన సినిమానే కాదు, కొన్ని యుగాలకు ముందొచ్చిన సినిమా! ఈ సినిమాను భవిష్యత్తరాల వాళ్లు సరిగా మూల్యాంకనం చేసుకోవచ్చు. ఇప్పుడే మెచ్చిన వాళ్లు అవార్డులిచ్చారు.

ఇది క్వియర్ మువీ అంటున్నారు గానీ, విష పుంసత్వాన్నీ, జెండర్ రోల్స్‌నీ, పితృస్వామ్యాన్నీ బాగా ఎండగట్టిన సినిమా. ఒకే సినిమా ఇన్ని అంశాలు (ఎల్జీబీటీక్యూతో సహా) చర్చించడం ఓవర్ డోస్ అయిందేమో! అందుకే అన్ని నిరసనలు కన్పించాయి. యూ ట్యూబర్లు కూడా భయపడుతూనే సమీక్షలు చేశారు.

## సినిమా గొప్పతనం – నటీనటులు :

ప్రధాన పాత్రధారులు ప్రతి ఒక్కళ్లూ చాలా బాగా నటించారు. ఇందులో ఫయ్యాజ్ ఆంటీ (సానియా సయీద్) అనే మరో పాత్ర ఉంది. వయసు మళ్లిన విధవరాలు ఆమె. ఆమె పాత్ర ద్వారా ఆమె కుమారుడి విషపుంసత్వాన్నీ, ముసలి అమానుల్లా పితృస్వామ్యపు డొల్లతనాన్నీ ఒకేసారి ఎండగడతాడు దర్శకుడు సాయిమ్ సాదిక్. ఈ సినిమా ప్రొడ్యూసర్లలో ఒకరు మన దేశపు అపూర్వ గురుచరణ్ కాగా, ఇంకొకరు సర్మద్ సుల్తాన్ ఖూసత్ అనే పాకిస్తాన్ నటుడూ, దర్శకుడూ. కథను దర్శకుడు మ్యాగీ బ్రిగ్స్‌తో కలిసి రూపొందించాడు. అబ్దుల్లా సిద్దికీ సంగీతం, జో సాదే సినెమాటోగ్రాఫీ, సెట్స్, సౌండ్ డిజైన్ అన్నీ అద్భుతంగా కుదిరాయి. పాత్రధారుల శ్వాసరోధ పరిస్థితిని వర్ణించేందుకా అన్నట్టు సినిమాను పాతరోజుల నాటి 1:1 రేషియోలో పిక్చరైజ్ చేశారు. కథను ఎంత పకడ్బందీగా, అందంగా రాశారంటే, ఇందులో ఎన్నో సామాజిక అంశాల్ని చర్చించడానికి వీలు దొరికింది. ఒక్క ఫ్రేమ్ కూడా వేస్ట్ కాకుండా, ప్రతి దృశ్యాన్నీ అర్థవంతంగా చిత్రీకరించారు.

## సినిమా టైటిల్‌కి అర్థమేంటి?

'జోయ్‌ల్యాండ్' అనేది ఆ వూరికి వచ్చిన ఒక సర్కస్ కంపెనీ పేరు. నుచ్చీ డ్రెస్ డిజైనర్ కావాలన్న తన కోరికను చంపుకుని, పితృస్వామ్యాన్ని అంగీకరించి బ్రతుకుతోందన్నది తెలిసిందే. ముంతాజ్ కొంత స్వేచ్ఛను అనుభవించి కూడా మళ్లీ వ్యవస్థ చట్రంలోకి చిక్కుకుంది. ఈ తోటికోడళ్లిద్దరూ 'జోయ్‌ల్యాండ్'లోని రంగుల రాట్నం ఎక్కినపుడు మాత్రం, ఆ కొద్ది సమయం పాటు గట్టిగా కేకలు వేస్తూ బాగా ఎంజాయ్ చేస్తారు. ఆ కొన్ని క్షణాలు తామనుకున్నట్టు పరిపూర్ణంగా జీవిస్తారు. అటువంటి 'జోయ్‌ల్యాండ్' అందరికీ అన్నివేళలా తమ జీవితాల్లో అవసరం అన్నట్టు సినిమాకు ఆ పేరు పెట్టారు. ఈ సినిమాలో జెండర్ రోల్స్, సెక్సువాలిటీ చట్రంలో ఊపిరి సలపనివ్వని పరిస్థితుల్లో బ్రతుకుతున్న క్యారెక్టర్లు చాలా కనిపిస్తారు. వ్యవస్థలో పై చేయిగా వున్న వాళ్లు కూడా వ్యవస్థలో దుష్టులని పిలవబడాల్సిన దుస్థితిలో బ్రతుకుతున్న వారే! సలీం, అమానుల్లా, ఫయ్యాజ్ కొడుకూ, బీబాతో పార్టీల్లో అసభ్యంగా ప్రవర్తించే వారూ, బీబా రహస్యాంగం ఎలా వుంటుందో తెలుసుకోగోరే వారూ, మెట్రోలో బీబాను ఆడవాళ్ల సీటులో కూర్చోనివ్వని ఆడవాళ్లూ – ఇలా అందరూ పరోక్షంగా వ్యవస్థ బాధితులే. వ్యవస్థను ఎదిరించి, తన అస్తిత్వాన్ని నిలుపుకోడానికి నిత్య పోరాటం చేసే ఏకైక పాత్ర బీబా మనకు సదా గుర్తుండిపోతుంది.

ఓ చోట బీబాకు హైదర్ ఒక కథ చెబుతాడు. 'ఒక దోమ, ఒక కోడితో ప్రేమలో పడుతుంది. ఆ రెండూ ముద్దు పెట్టుకుంటాయి. కోడి డెంగూతో చనిపోతుంది. దోమ బర్డ్ ఫ్లూతో చనిపోతుంది. ప్రేమ చావుకే దారితీస్తుంది.' అని కథ ముగిస్తాడు. ఏ దేశంలోనూ, ఏ సమాజంలోనూ ప్రేమికులు చావకూడని రోజులు రావాలి అన్నది ఈ సినిమా ఆశ!

వెన్నెల, బాపూచైతన్యలు
తమ పాప ఆద్య చేత
'ప్రజాసాహితి' ఈ నెల సంచిక ప్రచురణకు
ఆర్థిక సహాయం అందించారు.
వారికి కృతజ్ఞతలు.

# "వెర్రిపడగలు"

## 2వ ముద్రణకు ముందుమాట

శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' కవిత రాసిన సంవత్సరం 1934లోనే విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు' నవలను రాశారు. అయితే వారిరువురి నడుమ వయసు తేడా 15 సంవత్సరాలు. వారి ఆలోచనల నడుమ తేడా రెండు యుగాలంతటిది.

"ఉన్నచోటు చాలును మీకు, ఇంకా వెనక్కి పోతామంటారు కూడా మీలో కొందరు" అని శ్రీశ్రీ రాసింది విశ్వనాథవారికి పూర్తిగా వర్తిస్తుంది. చారిత్రకంగా కాలంచెల్లిన యుగకవి విశ్వనాథ అయితే, రాబోవు సామ్యవాద యుగదూత శ్రీశ్రీ. మౌలికంగా విశ్వనాథ ఫ్యూడల్ రాచరిక యుగ సాంస్కృతిక ప్రతినిధి. శ్రీశ్రీ శ్రామికవర్గ విప్లవ కవి.

ఈ చిన్న పుస్తకం విశ్వనాథ సత్యనారాయణ రచించిన ప్రఖ్యాతి చెందిన 'వేయి పడగలు' నవలపై 1975లో ముక్కామల నాగభూషణం చేసిన విమర్శ. సరిగా ఆ నవల వెలువడిన 40 సంవత్సరాల పిదప ఈ విమర్శ వెలువడింది. అలాంటి విమర్శనాత్మకమైన పెద్ద వ్యాసం రాయడం వెనక ఒక తీవ్ర రాజకీయ ప్రభావం ఉంది. అదేమంటే ఫ్యూడల్ యుగ సాహిత్య సాంస్కృతిక ప్రతినిధి అయిన విశ్వనాథను శ్రామికవర్గ సోషలిస్టు ప్రపంచానికి తలమానికమైనదిగా పేరుగన్న సోవియట్ యూనియన్‌కు చెందిన సాహిత్య విశ్లేషకులు ఆకాశానికి ఎత్తి పొగడటం!

"ఎందువల్లనోగాని విశ్వనాథవారి రచనలను సోవియట్ రష్యాలోని తెలుగు భాషాధ్యయన కేంద్రానికి చెందిన శ్రీమతి పెత్రోనిచేవ మెచ్చుకుంటోంది. గురజాడ వారి పూర్ణమ్మ కంటే విశ్వనాథ వారి కిన్నెరసాని ఆమెకు గొప్పదిగా కనిపిస్తోంది. ఇంతవరకు 'చెలియలికట్ట', 'వేయి పడగలు' రష్యన్ భాషలోకి అనువదింపబడనందుకు ఆమె బాధపడుతోంది." **(పరిశీలనకు కారణం ఏమిటి?.... 10వ పేజీ)**

రష్యా వారి ధోరణులను గమనించి ఒకనాటి కమ్యూనిస్టు ఉద్యమంలో క్రియాశీల పాత్ర నిర్వహించిన ముక్కామల నాగభూషణం సహించలేక రాసినదే "వెర్రి పడగలు" పుస్తకం.

ఈ పుస్తకం వెలువడిన 1975 డిసెంబర్ నాటికి భారతదేశంలో ఇందిరా గాంధీ విధించిన అత్యవసర పరిస్థితి, దాని నిర్బంధం అత్యంత తీవ్రంగా సాగుతూన్న రోజులవి. మనం గుర్తుపెట్టుకోవాల్సినది ఏమంటే సోవియట్ యూనియన్ 1975–77 నాటి అత్యవసర పరిస్థితిని (తాను పూర్తిగా కూలిపోయేదాకా) సమర్థించింది. అంతేకాదు 'వెర్రి పడగలు' రాసేనాటికి ఒక సంవత్సరన్నర ముందు జరిగిన భారతదేశవ్యాపిత రైల్వే కార్మికుల సమ్మెను (1974మే) సోవియట్ యూనియన్ బహిరంగంగా వ్యతిరేకించింది. అదే కాలంలో ఆ దేశ అధినేత భారతదేశానికి వచ్చి ఇందిరా ప్రభుత్వానికి ప్రతిపక్షాలే అవసరం లేదు అని ప్రకటించి వెళ్ళాడు. ఇన్ని ఉన్నా చాలామందికి లాగానే ఈ రచయితకు సోవియట్ యూనియన్ ఆనాటికే సోషలిస్టు పంథా నుండి వైదొలగి, తమ దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించుకుని, వెనుకుబడిన దేశాలపై సామ్రాజ్యవాదతత్త్వాన్ని ప్రదర్శిస్తోందని అర్థం చేసుకోలేకపోయారు. ఏది ఏమైనా ప్రపంచానికే మార్గదర్శకులు అనుకుంటున్న సోషలిస్టు దేశపు సాహిత్యకారులు, రాచరిక భావజాల తత్త్వాన్ని నిలువెత్తు ఆవహించుకుని ఉన్న విశ్వనాథ లాంటి వారిని పొగడటాన్ని జీర్ణించుకోలేక చేసిన రచన ఇది.

ముక్కామల వారి 'వెర్రి పడగలు' వెలువడిన వెంటనే ఈ పుస్తకం మరొక విశ్లేషణాత్మక స్పందనకు దోహదపడింది. అది 1976లో దివికుమార్ చేసిన రచన : **ఫ్యూడల్ సంస్కృతి : రివిజనిస్టు రష్యా పొగడ్తలు!**

సోవియట్ యూనియన్ కూలిపోవడానికి 15 సంవత్సరాల ముందే వెలువడిన ఈ వ్యాసం 1978లో 'జనశక్తి' పత్రికలోనూ, సోవియట్ యూనియన్ కూలిపోయిన వెనువెంటనే వెలువడిన 'ప్రజాసాహితి' 1991 అక్టోబర్ సంచికలోను ప్రచురితమైంది. గోర్బచేవ్ చేసిన పొరపాట్ల వల్లనే సోషలిస్టు వ్యతిరేక సాంస్కృతిక వాతావరణం ఏర్పడిందనే భావన, వాదన తప్పు అని పై వ్యాసం స్పష్టం చేసింది.

అర్ధవలస, అర్ధఫ్యూడల్ సామాజిక లక్షణంగా ఉన్న భారతదేశాన్ని యథాతథ స్థితిలో మిగిల్చివేసే సోషల్ సామ్రాజ్యవాద తత్త్వం వల్లనే రామాయణం కావ్యాన్నే కాకుండా విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యాన్ని, 'వేయి పడగలు' లాంటి ఫ్యూడల్ తత్త్వ వెనకబాటుతనపు రచనలను చాలా విశిష్టమైనవిగా వారు ఆకాశానికి ఎత్తి పొగుడుతున్నారని, అంతేకాక సాంస్కృతిక పతన విలువలు ఆ దేశంలో పెరిగిపోతున్నాయని దివికుమార్ వ్యాస సారాంశం!

1984 ఆగస్టు – సెప్టెంబరు 'ప్రజాసాహితి' సంచికల్లో **"సోవియట్ యూనియన్లో వర్తమాన సాహిత్యం"** అనే 14 పేజీల వ్యాసం – రామకృష్ణారెడ్డి రాశారు. మహిళలపట్ల పెరుగుతున్న పితృస్వామిక చవకబారు ధోరణులూ, కార్మికులపట్ల అధికార నిరంకుశత్వంతో కూడిన మేనేజర్ల ప్రవర్తనలు, శ్రమదోపిడీకి ప్రశంసలూ మొదలైనవి ఆయా కథల్లో ప్రతిబింబించిన తీరుల్ని విశ్లేషిస్తూ అవన్నీ సోషలిస్టు స్వభావాన్ని వీడిన బూర్జువా సంస్కృతిగా రచయిత నిర్ధారించారు. అందుకు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చారిత్రాత్మక రచన **'తాకట్టులో భారతదేశం'** లాంటి గ్రంథాలను కూడా పరిశీలించినట్టు రామకృష్ణారెడ్డి చెప్పారు.

1990 అక్టోబర్ 'ప్రజాసాహితి'లో మండే అరుణ కుమార్ పేరుతో కొత్తపల్లి రవిబాబు రాసిన **'శోష' లిస్టు రష్యా : నేటి సంస్కృతి** అనే వ్యాసం వెలువడింది. సోవియట్ యూనియన్ కూలిపోవడానికి ఒక సంవత్సరం ముందు సంచిక ఇది. పతన సాంస్కృతిక విలువలు ముఖ్యంగా మహిళల పట్ల ఎంత ఘోరంగా సాగుతున్నాయో వివరించిన వ్యాసం అది. కమ్యూనిస్టు ముసుగులో ఉన్న సోషలిస్టు దేశం అని పై వ్యాస రచయిత విస్పష్టంగా తేల్చి చెప్పారు. ఆ విధంగా సోవియట్ యూనియన్ కూలిపోవటం అనే ప్రక్రియను 'ప్రజాసాహితి' ముందే గుర్తించగలిగింది.

ముక్కామల నాగభూషణం ప్రధానంగా 'వేయిపడగలు' నవలలోని ఫ్యూడల్ భావజాల లక్షణాలను ఈ రచనలో ఎక్కువ పేజీలలో ప్రస్తావించి వాటిని ఎండగట్టారు.

దానికంటే ముందు గురజాడవారి 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ'ను విశ్వనాథవారి 'కిన్నెరసాని' కావ్యాన్ని పోల్చి ఊహాజనితమైన కళాసృష్టి కంటే జీవిత వాస్తవిక సమస్యలను కళాత్మకంగా చిత్రించటం ఎక్కువ కష్టమైన పని అనీ, ప్రయోజన కరమైనదని రాశారు.

విశ్వనాథవారి "చెలియలికట్ట" నవలలోని రత్నావళి పాత్రను లియో టాల్‌స్టాయ్ సృష్టించిన, అన్నా కెరినినా అంత గొప్పదిగా సోవియట్ రచయితలు పోల్చటం పట్ల నిరసనగా మరొక వ్యాసం కూడా ఇందులో ఉంది.

"కుళ్ళిపోయిన సమాజాన్ని మార్చేందుకు ఉదారబుద్ధితో లియో టాల్‌స్టోయి అన్నా కెరినినాను సృష్టించారు. గతించిన కాలంలోని వర్ణాశ్రమ ధర్మాలను సమర్ధించేందుకు, వాటిని పునరుద్ధరించేందుకు విశ్వనాథ వారు రత్నావళిని సృష్టించారు. ఈ రెండు పాత్రలు ఒకటేనని చెప్పటం తప్పు కాదా?" (పుట 18)

పాత సంప్రదాయాలను పట్టుకు వేలాడేందుకు విశ్వనాథ వారు ప్రయత్నించారని వారి ప్రయత్నాలను పెత్రోనిచేవా లాంటి సోవియట్ రచయితలు సమర్థించినా మరెవరు సమర్థించినా సరే పరిణామక్రమాన్ని మాత్రం అడ్డుకోజాలరని ముక్కామల స్పష్టం చేశారు.

'చెలియలికట్ట' నవలపైన 1939లోనే 'ప్రజామిత్ర' పత్రికలో ఒక పరామర్శ వెలువడింది. తర్వాత కాలంలో గొప్ప ఫోటోగ్రాఫర్‌గా, నిక్కరు నాగేశ్వరరావుగా ప్రసిద్ధి చెందిన, కేవలం 5వ తరగతి వరకే చదివిన ముమ్మనేని నాగేశ్వరరావు (తెనాలి) రాసిన విమర్శనాత్మక వ్యాసం ఇది. కాలంచెల్లిన భావజాల ప్రచార ధోరణిపట్ల విశ్వనాథ వారి యావను, అందువల్ల రూపొందిన రచనాశైలిలోని గొడ్డుతనాన్ని ఆయన బహిర్గతపరిచారు.

'చెలియలికట్ట'లో కంటే విశ్వనాథవారి భావాలు 'వేయి పడగలు'లో మరింత స్పష్టంగా బయటపడ్డాయని సోదాహరణంగా ఈ పుస్తక రచయిత ముక్కామల రుజువు చేశారు.

జ్ఞానపీఠం అవార్డు, పద్మ విభూషణ్ బిరుదు అందుకున్నా, కవి సమ్రాట్‌గా పిలిపించుకున్నా ఫ్యూడల్ సంస్కృతిలో కాలం చెల్లిపోయిన వాటిని, ఇంకా అమలులో ఉన్న ఆచార వ్యవహారాలను, ముఖ్యంగా సాంఘిక సంబంధాలను నిర్దేశించే మనుధర్మశాస్త్రపు వర్ణాశ్రమ ధర్మాలను, స్త్రీల అణచివేతలనూ, భావజాల రంగంలో సంస్కృతిగా పరిరక్షించే విశ్వనాథ వారి ప్రయత్నాలను ముక్కామల ఎండగట్టారు.

"వేయిపడగల పాము / విప్పారుకొని వచ్చి / కాటందుకొన్నది / కలలోన రాజును."

పై కవితాపంక్తులతో 'వేయి పడగలు' నవల ప్రారంభ మవుతుంది.

విశ్వనాథ వారికి ఫ్యూడల్ రాచరికం మీద, దాని సాంఘిక నిర్మాణ రూపం అయిన నిచ్చెనమెట్ల కులవ్యవస్థ పైన, వాటి సంస్కృతి నుండి పుట్టిన, మూఢవిశ్వాసాల మయమైన పరలోక భావజాలాల పైన విపరీతమైన వ్యామోహం. వాటికి చిన్నమెత్తు సంస్కరణనైనా కలలో కూడా ఆయన భరించలేరు. అందుకే బ్రిటిష్ వలసవాద పరిపాలనకు ముందున్న ఫ్యూడల్ రాచరిక వ్యవస్థలోకి ప్రవేశించిన ఆధునిక పెట్టుబడి, దాని నిర్మాణరూపాలైన రైళ్లు, విద్యుత్తు, నీటిసరఫరా ప్రాజెక్టులు, అన్ని కులాల స్త్రీ పురుషులు నూతన విద్యను అందుకోవడాన్ని ఆయన సహించలేరు. అవన్నీ రాచరికానికి నష్టం కలిగించేవేనన్న పరమ విశ్వాసం ఆయనది. అందుకే పాశ్చాత్య విద్య ద్వారా అందిన అనేక ఆధునిక భావజాలాలు, శాస్త్రీయ సిద్ధాంతాలు, శ్రామిక జనావళి సాగించే పోరాటాలు ఆయనకు గిట్టవు. అవన్నీ పాము పడగలులా కలలోకి వచ్చి ఆయనను భయపెడుతుంటాయి. అందుకే సనాతన మత ధర్మాలకు, మనువాద భావజాలాలకు, మూఢ భక్తి ప్రపత్తులకు పెద్ద రక్షణ కవచంలా నిలబడి తన పాండిత్య ప్రకర్షనంతా (కొద్ది మినహాయింపులతో) వాటిని కాపాడేందుకే వెచ్చించారు. గురజాడకు కందుకూరికి కూడా 'కామ్రేడ్' బిరుదులిచ్చాడు.

ఆయన కంటే ముందు కోట వెంకటాచలం అనే ఆయన పురాణాలన్నీ చరిత్రలేనన్నట్లు కొన్ని రచనలు చేస్తే ఈయన వాటిని పుంఖానుపుంఖాలుగా పురాణవైర గ్రంథమాల పేరుతో శాస్త్రీయ చరిత్రకు విరుద్ధమైన తలకిందుల కూట సాహిత్యాన్ని టన్నుల కొద్దీ సృష్టించారు. అవన్నీ ఇప్పుడు సంఘ పరివారశక్తుల అబద్ధాల ఫ్యాక్టరీకి, వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా సామాజిక మాధ్యమాలలో వ్యాప్తి చేసేందుకు ముడిసరుకుగా ఉపయోగపడుతున్నాయి.

విశ్వనాథ వారి అభూత కల్పనలు, మూఢవిశ్వాసాలతో నిండిన సాహిత్య ధోరణులపై రాచమల్లు రామచంద్రారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావు తదితరులు గట్టి విమర్శలే చేశారు.

అవి కూడా ఆసక్తిపరులైన వారు తప్పక చదవాల్సిన రచనలు.

బ్రిటీష్ వలస పాలకులు భారత ఫ్యూడల్ సమాజాన్ని పాశ్చాత్య పెట్టుబడి ప్రయోజనాలకు అనువైన కొన్ని మార్పులకు గురిచేసిన అంశాలు 'వేయిపడగలు' నవలలో విశ్వనాథ ప్రస్తావిస్తారు. ఆ మార్పులకు ఆయన పడిన కలవరపాటు, పైన ఉటంకించిన పద్యంలో చూడొచ్చు. నిజానికి బ్రిటిష్ వలస పరిపాలన, భారత సామాజిక వ్యవస్థను అర్థ వలస అర్థ ఫ్యూడల్ వ్యవస్థగా తమ దోపిడీకి అనువైన ప్రదేశంగా మార్చి నల్లదొరలకు ఆగస్టు 1947లో అధికారాన్ని బదిలీ చేసి వెళ్లారు. వారు తమ ప్రత్యక్ష పరిపాలనను వదులుకున్నప్పటికీ భారతదేశాన్ని పరాధీన వ్యవస్థగానే మిగిల్చి వెళ్లారు. అదే కాలక్రమంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు సులువుగా లొంగిపోయింది. అంతేకాక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ నిరంకుశ రాజకీయ ఫాసిస్టు రూపాల్లో తప్ప పరిపాలన కొనసాగించలేని స్థితి ఏర్పడగానే భాజపాకు పాలనాధికారాలు లభించాయి. దీనితో సాంస్కృతిక రంగంలో అభివృద్ధి నిరోధకత్వం, తిరోగమనవాదం అంచనా కట్టలేనంత విపరీతమైపోయింది.

విశ్వనాథ వారిది ఆధ్యాత్మిక మూఢవిశ్వాసాల తాత్త్విక దారిద్ర్యం అయితే, బ్రిటీషువారి రాకకు పూర్వం ఏనాడూ ఆ పేరుతో లేని హిందూమతం పేరిట ఉన్మాదాల్ని మతవిద్వేషాలను రెచ్చగొట్టే కార్పొరేట్ ఫాసిస్ట్ రాజకీయం నేటి భాజపా వారిది.

ఈ పరిస్థితులలో అభివృద్ధి నిరోధక సాంస్కృతిక ధోరణులపై 47 సంవత్సరాల క్రితం కలం ఎత్తిన ముక్కామల నాగభూషణంగారి 'వెర్రి పడగలు' పాఠకుల అవగాహన కొరకు తిరిగి అందజేస్తున్నాం.

తెలుగు ప్రజానీకం దీనిని ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

**9 ఫిబ్రవరి 2023**
**విజయవాడ**

**జనసాహితి**

# 7వ అంతర్జాతీయ ఫైజ్ సాహిత్య ఉత్సవం

**ప్రపంచమంతటా** వివిధ దేశాలలో నివసిస్తున్న ప్రసిద్ధ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ అభిమానులందరితోటి కూడిన 7వ అంతర్జాతీయ ఫైజ్ ఉత్సవం, పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలో 2023 ఫిబ్రవరి 17 నుండి ఫిబ్రవరి 19 వరకూ జరిగింది. ఈ ఉత్సవాన్ని ఫైజ్ ఫౌండేషన్ ట్రస్టు లాహోర్ ఆర్ట్స్ కాన్సులేట్‌లు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఉత్సవం ఫైజ్ అహ్మద్ ఫైజ్ కుమార్తెలయిన సలీమా హష్మీ, మునీజా హష్మీలు పర్యవేక్షణలో జరిగింది.

కళలు, సాహిత్యం, సంగీతం, సినిమా రంగాలకు చెందిన ప్రముఖులు యీ ఉత్సవంలో పాల్గొన్నారు. భారతదేశం, పాకిస్తాన్ తదితర దేశాలకు చెందిన అభ్యుదయ ఆలోచనాపరులైన ప్రముఖులు యీ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి మన దేశం నుండి ప్రముఖ సినీ గేయ రచయిత జావేద్ అక్తర్‌తోపాటు బొంబాయికి చెందిన ప్రముఖ సాహిత్యవేత్త అతుల్ తివారీ, అమృత్‌సర్ నుండి అరవింద్‌సింగ్‌లు పాల్గొన్నారు.

ప్రపంచమంతటి పలు దేశాల నుండి వచ్చిన ఫైజ్ అభిమానులతో పాటు, పాకిస్తాన్‌లోని వామపక్ష భావజాలంతో కూడిన అనేకమంది యువకులు యీ సాహిత్యోత్సవంలో పాల్గొన్నారు.

ఈ ఉత్సవంలో ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవితలను వల్లించటంతోపాటు, ఆయన కవిత్వ ప్రాశస్త్య, ప్రాముఖ్యతలను చర్చించారు. అంతేకాక ఆ ఉత్సవంలో పాకిస్తాన్‌లో గల అభ్యుదయ ఉద్యమాన్ని గురించి కూడా వారు చర్చించారు. అభ్యుదయ భావాలను గురించి చర్చించారు.

లాహోర్‌లో నివసించే ఒక యువ కథకుడైన ఆలి ఉస్మాన్ బాజ్వా, ఈ ఉత్సవం – పాకిస్తాన్‌లో జరిగిన ఒక ప్రముఖమైన ఘటన అనీ, ఈ ఉత్సవాన్ని వామపక్ష భావజాల దృక్పథంతో నిర్వహించటం దీని విశిష్ట లక్షణం అంటూ పేర్కొన్నాడు. ఫైజ్ అహ్మద్ ఫైజ్ తన మాతృభాష అయిన పంజాబీలో కూడా కవితలు వ్రాశాడనీ ఈ ఉత్సవంలో పంజాబీ కవితలపై ఒక సెషన్‌ను నిర్వహించటం ఎంతో ఆసక్తిదాయకంగా వుందనీ తెలియజేశాడు.

ఈ సందర్భంగా జావేద్ అక్తర్ మాట్లాడుతూ "భారతదేశ ప్రభుత్వానికీ, భారతదేశ ప్రజలకూ పాకిస్తాన్ పాలకులతో అభిప్రాయ భేదాలు, విభేదాలూ వుండవచ్చును. కానీ వారు పాకిస్తాన్ దేశపు ప్రజల పట్ల ఎందుకు కోపాన్ని వ్యతిరేకతను పెంచుకోవాలి? పాకిస్తాన్‌లోని సాధారణ ప్రజలు భారతదేశంతో స్నేహాన్ని కోరుకొంటున్నారు. కానీ యీ వాస్తవాన్ని ప్రధాన స్రవంతి మీడియా అణచిపెడుతోంది" అంటూ వివరించారు.

ఈ ఉత్సవంలో ఇంగ్లీషు, ఉర్దూ, పంజాబీ పుస్తకాలు ఆవిష్కరింప బడ్డాయి. వాటిపై చర్చలు జరిగాయి. అంతేకాక "పాకిస్తాన్ రాజకీయాల్లో మహిళల పాత్ర", "పాకిస్తాన్‌లో ఆర్థిక రాజకీయాలు", "పాకిస్తాన్ సినిమాలలో మహిళల పాత్ర" అన్న విషయాలపై కూడా చర్చలు జరిగాయి. ఈ ఉత్సవం సందర్భంగా జరిగిన చర్చలు దోపిడీ, అన్యాయం, సంపదను కొల్లగొట్టుకుపోవటం లాంటి అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు స్ఫూర్తినిచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.

ఈ ఉత్సవం భారతదేశానికీ పాకిస్తాన్‌కూ మధ్య స్నేహసంబంధాలు పెంపొందించే పాత్రను పోషించగలుగుతుందని ఫైజ్ అహ్మద్ ఫైజ్ కుమార్తె సలీమా హష్మీ చెప్పారు.

ఈ విధంగా ఫైజ్ అహ్మద్ ఫైజ్ సాహిత్యోత్సవం, ఒక అనుకూల పాత్రను పోషిస్తే అటు పాకిస్తాన్‌లోని ప్రధాన స్రవంతి మీడియా గానీ, యిటు భారతదేశంలోని ప్రధాన స్రవంతి మీడియా గానీ నామమాత్రంగా కూడా ఉత్సవ ప్రాముఖ్యతను పట్టించుకోకపోగా, పాకిస్తాన్ మీడియా అయితే బెలూచిస్తాన్‌లో ఒక బాలుడి కిడ్నాప్ ఉదంతాన్ని ప్రముఖ వార్తగా ప్రచారం చేసింది.

ఇక భారతదేశపు ప్రధాన స్రవంతి మీడియా అయితే, పాకిస్తాన్‌ను నిందించే ఒక సంచలన వార్తను యీ ఉత్సవం నుండి తీసుకొని, పాకిస్తాన్‌ను మరొకసారి నిందించటానికి వాడుకొని, విద్వేషాన్ని (పాకిస్తాన్‌పై వ్యతిరేకతను) రెచ్చగొట్టింది.

ఆ ఉత్సవంలో జరిగే చర్చల సందర్భంగా ఒకరు జావేద్ అక్తర్‌ను ఒక ప్రశ్న అడిగారు. అందుకు ఆయన జవాబునిస్తూ 26/11 ముంబయి తీవ్రవాద దాడిలోని ముద్దాయిలు, నేటికీ పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారు అని చెప్పారు. ఈ జవాబుకు ఆ ఉత్సవంలో అధిక సంఖ్యలో ప్రేక్షకులుగా వున్న పాకిస్తానీయులు చప్పట్లు కొట్టారు. అయితే, పాకిస్తానీ ప్రజలు – పాకిస్తానీ పాలకుల విధానాల పట్ల వ్యక్తం చేసిన వ్యతిరేక నిరసనలను దాచిపెట్టి భారత ప్రధాన మీడియా "పాకిస్తాన్‌లో ప్రవేశించిన జావేద్ అక్తర్, పాకిస్తాన్‌ను చీల్చి చెండాడేడు!", "జావేద్ అక్తర్ పాకిస్తాన్‌ను దూరంగా వెళ్ళిపొమ్మని హుంకరించాడు" లాంటి సంచలనాత్మక శీర్షికలతో, భారత పాలకుల పాకిస్తాన్ విద్వేష భావజాలాన్ని ప్రచారం చేసింది.

ప్రధాన మీడియా ఎటువంటి దుష్ట ప్రచారానికి పాల్పడ్డా, ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవితలతో స్ఫూర్తిపొందిన, ఉత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు, సభ్యులందరూ ముక్తకంఠంతో ఫైజ్ వ్రాసిన "హమ్ దేఖేంగే!" (అన్యాయ, అక్రమాల అంతం చూస్తాం మేం!) అంటూ నినదించారు. పలు విప్లవ నినాదాలను, యీ ఉత్సవం సాగినంత సమయంలోనూ యిచ్చారు.

"కులీన సాహిత్య ఉత్సవాలు" బడా కార్పొరేట్ల భాగస్వామ్యంతో 'ఘనంగా' నిర్వహింపబడుతున్న యీ రోజుల్లో ప్రగతిశీలక భావాల చోదకశక్తితో నిర్వహింపబడిన యీ ఫైజ్ అహ్మద్ ఫైజ్ అంతర్జాతీయ సాహిత్య ఉత్సవం దోపిడీ, అణచివేత, అసమానతలకు గురిచేయ బడుతున్న యీ భారత ఉపఖండ ప్రజలకు ఒక ఆశావహ ధైర్యాన్నీ, పోరాట ప్రేరణను యిచ్చింది. ●

# ఆధ్యాత్మికత ముసుగులో అనాథ సేవకులమంటూ పసిపాపలను కాటేస్తున్న పూర్ణానంద సరస్వతి వంటి స్వాముల ఆగడాలను నిలదీద్దాం!

**జూన్** 13వ తారీఖున విశాఖపట్నంలోని జ్ఞానానందాశ్రమం నుండి ఓ పదిహేనేళ్ళ బాలిక, ఆ ఆశ్రమంలో తాననుభవిస్తున్న నరకయాతనలను తాళలేక తప్పించుకొని పారిపోయింది. విశాఖ రైల్వేస్టేషన్లో తిరుమల ఎక్స్‌ప్రెస్ ఎక్కి ప్రయాణంలో పరిచయమైన ప్రయాణికురాలితో తాననుభవించిన కష్టాలు చెప్పుకున్నది. బాలిక కష్టాలకు చలించిపోయిన సహ ప్రయాణీకురాలు కృష్ణాజిల్లా కంకిపాడులో హాస్టల్‌లో చేర్చేందుకు ప్రయత్నించింది. కాగా హాస్టల్ నిర్వాహకులు పోలీసు స్టేషన్ నుండి ఉత్తరం తెస్తే చేర్చుకుంటామని చెప్పడంతో, పోలీసులను ఆశ్రయించగా వారు దిశ పోలీసేస్టేషన్‌కు కేసు అప్పగించారు. తదుపరి బాలిక ఫిర్యాదును అనుసరించి బాలికపై రెండేళ్ళుగా అత్యాచారం చేస్తూ నరకం చూపిస్తున్న జ్ఞానానందాశ్రమ నిర్వాహకుడు పూర్ణానంద సరస్వతిపై ఐపిసి సెక్షన్ 376 మరియు పోస్కో చట్టం ద్వారా కేసులు పెట్టారు.

తల్లిదండ్రులిరువురినీ కోల్పోయిన తనను రెండేళ్ళక్రితం అమ్మమ్మ రాజమండ్రి నుండి విశాఖ తీసుకువచ్చి జ్ఞానానందాశ్రమంలో చేర్పించిందని, అప్పటినుండీ పూర్ణానంద స్వామి తనను రేప్ చేస్తూనే ఉండేవాడని బాలిక తెల్పింది. గొలుసులతో కట్టివేసి బెడ్‌రూమ్‌లో బంధించేవాడని, కేవలం రెండు చెంచాల అన్నం మాత్రమే పెట్టేవాడనీ, కాలకృత్యాలు అక్కడే తీర్చుకోవాలనేవాడనీ, వారానికి ఒక్కసారే స్నానానికి అవకాశం యిచ్చేవాడనీ బాలిక చెప్పిన విషయాలు మానవత్వమున్న ఎవ్వరినైనా తీవ్రంగా కలచివేస్తాయి. రెండు మాస్టర్ డిగ్రీలు, ఒక బి.ఇడి, ఒక లా డిగ్రీ సైతం ఉన్న పూర్ణానంద సరస్వతి స్వాములవారు గత మూడు దశాబ్దాలకు పైగా ఈ ఆశ్రమ పెద్దగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా 2012లో కూడా ఇదే స్వాములవారిపై మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదు అయ్యిందనీ, అది యింకా విచారణలోనే ఉందనీ పోలీసులు తెలియచేశారు.

అనాధ బాలలకు ఆశ్రయం కల్పిస్తామనే ముసుగులో, ఏ దిక్కూలేని వారిని అత్యాచారాల చిత్రహింసల పాలుజేస్తూ తెగబడుతున్న పూర్ణానందస్వామి వంటివారిని కఠినంగా శిక్షించాలి. ప్రజల భక్తిని, అమాయకత్వాన్నీ, అవకాశంగా తీసుకుని అరాచకాలకూ, అకృత్యాలకు పాల్పడుతున్న ఆశారామ్‌బాపూ, డేరాబాబా, ఫాదర్ థామస్ పరేక్కులం, నిత్యానంద వంటి దొంగ బాబాలను, ఇటువంటి అకృత్యాలకు తమ నిర్వహణలోని ఆశ్రమాలను ఆలవాలంగా మార్చుతున్న నిర్వాహకులను కఠినంగా శిక్షించాలి. అనాధ బాలలు, నిస్సహాయ మహిళలు, వృద్ధులు తదితరుల సంరక్షణ బాధ్యతను ధార్మిక సంస్థల దయా దాక్షిణ్యాలకు వదిలివేయకుండా ప్రభుత్వాలు చేపట్టాలి!

## ఉపా చట్టాన్ని రద్దు చేయాలి!

**ప్రొఫెసర్** హరగోపాల్, డాక్టర్ పద్మజ షా లతో సహా 152 మంది పైన వరంగల్లు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్లో 10 నెలల క్రితం ఉపా చట్టం కింద నమోదు చేసిన పోలీసు కుట్ర కేసు ఒకటి ఇటీవల బయటపడింది. ప్రజా ఉద్యమాల అణచివేత విధానాలలో కేంద్ర ప్రభుత్వపు అడుగు జాడలలో తెలంగాణ ప్రభుత్వం కూడా నడుస్తున్నట్లు దీని ద్వారా అర్థమవుతుంది. శిక్షణలో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా చట్టబద్ధ పాలన గురించిన పాఠాలు బోధించే హరగోపాల్ లాంటి వారికే ఇలాంటి గతి పట్టడం పాలకులలో పెరుగుతున్న నిరంకుశ విధానాలను, అప్రజాస్వామిక తత్వాలను బట్టబయలు చేస్తోంది.

పౌరసమాజం నుండి నిరసన వెలువెత్తిన ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా లతో పాటు ఇంకొక నలుగురిపైనున్న 'ఉపా' కేసును రద్దు చేసింది. అంటే మిగిలిన 146 మందిపై ఉపా కేసు కొనసాగుతున్నదన్నమాట! ఈ తరహా కన్నీటి తుడుపు విధానాలను ఏ ప్రజాస్వామ్యవాదీ మెచ్చలేదు. తక్షణమే మిగిలిన 146 మందిపై మోపిన కేసులు కూడా ఉపసంహరించమని జనసాహితి డిమాండ్ చేస్తోంది.

కనీస చట్టబద్ధహక్కైన బెయిల్ని కూడా నిరాకరిస్తున్న ఉపా చట్టాన్ని మొత్తానికి మొత్తంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. వరవరరావు లాంటి రచయితపై ఇతర ప్రజాస్వామిక వాదులపై మోపిన కేసులను ఉపసంహరించుకుని వారికి స్వేచ్ఛగా సంచరించే అవకాశాలను ఇవ్వవలసిందిగా, మరొకసారి జనసాహితి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది...

**– జనసాహితి**

# ద్రౌపదీ! ఆయుధం అందుకో శ్రీకృష్ణుడు ఇక రాడు!

ద్రౌపదీ! ఆయుధం అందుకో
శ్రీకృష్ణుడు ఇక రాడు..

గోరింటాకు చేతులతో కత్తి పట్టుకో
నీ చీరను నువ్వే కాపాడుకో
శకుని జూదమాడుకుంటున్నాడు
మెదళ్లన్నీ అమ్ముడైపోతాయి
ద్రౌపదీ! ఆయుధం అందుకో
శ్రీకృష్ణుడు ఇక రాడు..

ఇంకా ఎంతకాలమని
వేచి చూస్తావ్!
అమ్ముడైపోయిన మీడియాను
ఏమని రక్షణ అడుగుతావ్!
దుశ్శాసన సభలో సిగ్గులేని
వారంతా నీ మానాన్ని
ఏం కాపాడుతారు?
ద్రౌపదీ! ఆయుధం అందుకో
శ్రీకృష్ణుడు ఇక రాడు..

నిన్నటి వరకు రాజు
గుడ్డివాడు మాత్రమే..
ఇప్పుడు చెవిటి, మూగ కూడా..
ప్రజల నోళ్లకు కుట్లు వేశారు
చెవులకు కట్లు కట్టారు
ఈ కన్నీళ్లు నీవేనని నువ్వే చెప్పుకో
ఎవరికి ఏం చెప్పగలం?
ద్రౌపదీ! ఆయుధం అందుకో
శ్రీకృష్ణుడు ఇక రాడు..

(భారతీయ రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా కొన్నాళ్లుగా ఉద్యమిస్తున్న రెజ్లర్ వినేశ్ ఫోగట్ తాజాగా ఓ కవితను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హిందీ కవి పుష్యమిత్ర ఉపాధ్యాయ్ రాసిన ఆ కవితను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇదీ ఆ కవిత!)

కవితలు

# డిలీట్

- సుంకర గోపాల్

ఈ పాదాలు నావే
అడుగులు మాత్రం
రాజ్యం వేయమంటోంది
ఈ కళ్ళు నావే
చూపులు మాత్రం
రాజ్యమే నిర్దేశిస్తుంది
నాలుగు అంగుళాల నాలుక మీద
రాజ్యమే రుచి ముద్రలు వేస్తోంది

గుండ్రంగా ఉన్న భూమిని
బల్ల పరుపుగా వాక్యం చేయమంటోంది
చేతులకు పసుపు, కుంకాలు పూసుకుని
దేశపు పటం మీద
పది వేళ్లను ముద్రించమంటోంది

రెండూ గడ్డే తింటున్నప్పుడు
రెండూ తెల్లని పాలే ఇస్తున్నప్పుడు
పిడకల్ని మండించే నిప్పు,
తోడు నిలబడే గాలికి లేని
ఈ రాతియుగపు ఆలోచన
హృదయం లేని మనిషిగా,
ఒకే ఒక జంతువును
కీర్తించడానికి, మొక్కడానికి మీకేందుకుప్రభువా!

నేనేం పాఠం చదవాలో, ఏ బొమ్మ గీయాలో
నిర్ణయించడానికి
సిలబస్
మీ మేనిఫెస్టో కాదు,
పార్టీ ముసాయిదా పత్రం కాదు
అసలు ముందు
తొలగించాల్సిన
మొట్ట మొదటి అధ్యాయం నువ్వే

కవిత

# ఆ దారిలో!

- తమ్మినేని అక్కిరాజు

ఆ దారిలో!
అన్నీ భయాలు
అన్నీ భ్రమలు
అన్నీ మాయలు
మంత్రాలుమహిమలు!

ఆ దారిలో!
దైవ లీలలు
అభూత కల్పనలు
పురాణ గాథలు
అన్నీ మహాత్మ్యాలు!

ఆ దారిలో!
జన్మజన్మలు
పూర్వ జన్మలు
పునర్జన్మలు
కారణ జన్మలు!

ఆ దారిలో!
కల్పిత గాథలు
పరలోకాలు
దేవలోకాలు
ఊహాలోకాలు!

ఆ దారిలో!
వరాలు శాపాలు
కర్మ ఫలాలు
యజ్ఞ యాగాలు
ముక్తి మోక్షాలు!

ఆ దారిలో!
అవతార పురుషులు
మునులు రుషులు
బాబాలు అమ్మలు
సాధు సంత్ లు!

ఆ దారిలో!
లింగ పూజలు
అంగ ప్రదర్శనలు
దిగంబరాలు
అఘోరాలు!

ఆ దారిలో!
శ్మశానాలు
భూత వైద్యం
కాష్మోరా లు
ఆత్మ ఘోషలు!

ఆ దారిలో!
నైవేద్యాలు
అభిషేకాలు
దేవుడితో
వ్యాపారాలు!

ఆ దారిలో!
కలలు కల్పనలు
దివ్యదృష్టులు
దైవ నిర్ణయాలు
జగన్నాటకాలు!

ఆ దారిలో!
సర్వం మిథ్య
అంతా శూన్యం
'నేను'ఉన్నాను
'నువ్వు'భ్రమ!

ఆ దారిలో!
జన్మ రాహిత్యం
జ్యోతి వెలగటం
దేవుణ్ణి చేరటం
పరలోక సౌఖ్యం!

ఆ దారిలో!
అశాస్త్రీయం
జనంతో
మైండ్ గేమ్
దారి మళ్లించటం!

ఆ దారిలో!
అంతా కన్ఫ్యూజన్
ఉన్నది లేనట్లు
లేనిది ఉన్నట్లు
కుట్ర క్రియేషన్!

ఆ దారిలో!
స్వార్థపరుల
కుటిలాత్ముల
కుబేరుల
త్రిశంకు స్వర్గం!

ఆ దారిలో!
'మనిషి'లేడు
పనికిరాడు
నిమిత్తమాత్రుడు
ఆత్మహీనుడు!

ఆ దారిలో!
స్త్రీలకు అంతులేని
అవమానాలు!
పాతివ్రత్యాలు
సహగమనాలు!

ఆ దారిలో!
ముళ్ళూ రాళ్ళూ
ద్రోహుల యతనం
'మనిషి' పతనం
తిరోగమనం!

ఆ దారిలో!
'మను' మాయ
భూతం ప్రేతం
తిష్ట వేసింది
జాగ్తే రహో!

# చైతన్యవాహిని

**18-6-2023 :** చార్వాక ఆశ్రమ విలువలకు కట్టుబడి నిజాయితీగా జీవించిన చార్వాక సంస్మరణ సభను జూన్ 18వ తేదీన నిడమర్రు, చార్వాకాశ్రమంలో నిర్వహించారు. చార్వాకాశ్రమ నిర్మాత బి. రామకృష్ణగారి చిన్న కుమారుడు చార్వాక మానసిక అనారోగ్యంతో జూన్ 11వ తేదీన బలవన్మరణం చెందారు. ఈ అకాల మరణం రామకృష్ణగారి కుటుంబ సభ్యులకే కాక, వారు నిర్మించి అభివృద్ధి చేసిన నాస్తిక సంఘం సభ్యులను, వారి సంఘముతో నిత్య సంబంధాలు కలిగిన విప్లవ ప్రజా సంఘాల వారిని విచారానికి గురిచేసింది.

ఈ సభను రామకృష్ణగారి పెద్ద కుమార్తె, జనసాహితి ప్రధాన కార్యదర్శి అరుణ నిర్వహించారు. మండు వేసవి కాలాన్ని లెక్కచేయకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాక సుదూర ప్రాంతాల నుండి కూడా విచ్చేసిన నాస్తిక సంఘం పరివారము, వివిధ విప్లవ ప్రజా సంఘాలవారు, కుటుంబసభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సభను అరుణ ప్రారంభిస్తూ.. చార్వాక అకాలమరణం బాధను కలిగించేదే అయినా, చార్వాకాశ్రమ విలువలకు, సిద్ధాంతాలకు కట్టుబడి ఆఖరి శ్వాస వరకు నిజాయితీగా జీవించాడని, రామకృష్ణగారి భావధారలో పెరిగి పెద్దవాడయ్యాడని అన్నారు. ఏ విధమైన ఆర్థిక, రాజకీయ, సాంఘిక వివక్షలు లేని సమాజం లాంటి మా ఇంట్లో, మా తల్లిదండ్రుల వారసులంగా గాక సమాజ సంపదగా పెరిగామన్నారు. అందుకే సమాజంలో ఈనాడున్న ఆధిపత్య భావజాలాన్ని, వివక్షతలను ఎదుర్కోవటంలో చార్వాక చాలా సంఘర్షణపడ్డాడన్నారు. సమాజంలో ప్రజావ్యతిరేకంగా ఏం జరిగినా ఉత్సాహంగా ముందుండి పాల్గొనే అతను పుస్తకాలను క్షుణ్ణంగా చదివేవాడని, సందర్భానుసారంగా పుస్తకంలోని విషయాలను ఉటంకిస్తూ కవితాత్మకంగా మాట్లాడేవాడన్నారు. కార్యకర్తలతో కార్యకర్తగా, నాయకులతో నాయకుడిగా అందరితో కలసిపోతూ ఆ వాతావరణాన్ని సంతోషంగా వుంచేవాడని, ప్రతి మీటింగ్‌లోనూ పుస్తకాల షాపు పెట్టి ఎన్నో పరిచయాలను సంపాదించు కున్నాడన్నారు. 16, 17 సం॥లుగా మానసిక స్థితి దెబ్బతినటంతో వైద్యం చేయించుకుంటూనే చుట్టుప్రక్కల ప్రాంత ప్రజలకు ఆర్‌ఎంపి వైద్యుడిగా వైద్యం చేసేవాడన్నారు. అజాతశత్రువు చార్వాకతో ఉన్న అనుబంధాన్ని, తమ అనుభవాలను పంచుకోమని సభకు విచ్చేసిన వారిని ఆహ్వానించారు.

తొలుత తన అనుభవాలను పంచుకోవడానికి వచ్చిన ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ, రామకృష్ణగారు తనకు ఏర్పడిన శాస్త్రీయ ఆలోచనలను తమ పిల్లలకు అందించటంలో పూర్తిగా విజయం సాధించారన్నారు. రామకృష్ణగారు తాడికొండలోని సంస్కృత కళాశాలలో ప్రిన్సిపల్ పదవికి రాజీనామా చేసి నిడమర్రు దగ్గర ప్రగతి విద్యానికేతన్ స్థాపించే నాటికి ఆయన ముగ్గురి పిల్లలు అరుణ, సుధాకర్, చార్వాక చిన్నవారు. సమాజానికి ఏమి బోధించారో భార్యకు, పిల్లలకు అదే బోధించారు. ఆచరించారు. ఆయన చెప్పిన అనేక విషయాలు శాస్త్రీయంగా వుండటం చేత పిల్లలు కూడా వారిని అనుసరించారు. వారిలా జీవించారు. దీనిని మనం పితృస్వామిక అర్థంలో వారసత్వంగా చూడకూడదన్నారు. చార్వాక కూడా వారి నాన్నగారి చెప్పే విలువలకు భంగం లేకుండా ప్రవర్తించాడు. నిజాయితీగా, చిత్తశుద్ధితో చార్వాకాశ్రమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. వచ్చినవారందరితో కలుపుగోలు తనంతో వుండి వారి అవసరాలు కనుక్కొని సహాయపడుతుండేవాడు. కొంతకాలం విప్లవ కార్యాచరణపై మొగ్గుచూపాడు. గద్దర్ కార్యక్రమం ఎక్కడున్నా హాజరై ఆ పాటలు పాడేవాడు. ఉద్యమంలో ఎవరైనా అమరులైతే ఆ వూరికి వెళ్ళి జోహార్లు తెలిపి వచ్చేవాడు. చార్వాకాశ్రమంలోని పిల్లలకు పాటలు నేర్పేవాడు. ఉదయాన్నే డ్రిల్లు చేయించేవాడు. అంత చురుకైనవాడు వివాహానంతరం మానసికంగా మందగొండి అయిపోయాడు. అయినా పట్టుబట్టి ఆర్.యం.పి. సర్టిఫికెట్ పొంది చుట్టు ప్రక్కల గ్రామాలవారికి ప్రథమ చికిత్స చేయడంలో నైపుణ్యం సంపాదించాడు. వైద్యంలో నిపుణులైన డాక్టర్లు ఏవిధంగా కొత్త మందులు వాడేవారో అలాగే చార్వాక కూడా వాడేవాడు. ఒక్కోసారి డాక్టర్లు కూడా చార్వాక నైపుణ్యానికి ఆశ్చర్యపోయేవారు. ఆ విధంగా సామాజిక మార్పు కోసం కృషిచేసే కార్యకర్త బాధ్యత నుండి చార్వాక సామాజిక సేవా కార్యక్రమంలో చివరివరకూ నిమగ్నుడయ్యాడు. పేదవారి నుంచి వైద్యానికి, మందులకు డబ్బు అడిగేవాడు కాదు. ఎవరైనా ఎంత ఇస్తే అంత తీసుకునేవాడు. విద్య, వైద్యం ప్రజలందరికీ ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వం వాటిని ప్రైవేటువారికి అప్పచెప్పి, సామాన్యుడికి అందకుండా చేసిన నేటి పరిస్థితిలో చార్వాక వైద్యునిగా పేదవారికి సేవచేశాడు.

సభకు వచ్చిన వారిలో ఎక్కువమంది చార్వాకతో తమకున్న అనుబంధాన్ని అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడినవారు ప్రధానంగా, చార్వాకాశ్రమముతో తమకున్న అనుబంధాన్ని, ఉద్యమ పరంగా రామకృష్ణ మాస్టారితో ఉన్న అనుభవాలను, చార్వాక నాస్తిక భావాలను వంట పట్టించుకొని తన జీవితకాలములో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, చుట్టుపక్కల గ్రామాల ప్రజల ప్రేమను చూరగొన్న బేర్ ఫుట్ డాక్టర్‌గా చేసిన కృషిని కొనియాడారు. గత కొన్ని సంవత్సరాలుగా మానసిక స్థితి సరిగా లేనప్పటికీ చార్వాక ఆశ్రమానికి వచ్చే అతిథులందరికీ చిరునవ్వుతో స్వాగతం పలికి, వారు తిరిగి వెళ్లే వరకు వారి యోగక్షేమాలను ఎంతో బాధ్యతగా పట్టించుకునే చార్వాకను ఇక చూడలేము కదా అనే ఆత్మీయ బాధను సభికులతో పంచుకున్నారు. చార్వాక లాగా ఎందరినో పెంచి పోషించిన, ప్రేమ ఆప్యాయతలను పంచిన తల్లి గృహలక్ష్మిగారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చార్వాకతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్న వారిలో నాస్తిక సమాజం నాయకులు ఎం.ఎన్. బుద్ధ, జనసాహితి అధ్యక్షులు దివికుమార్, విరసం నాయకులు సి.ఎస్.ఆర్. ప్రసాద్, స్త్రీ విముక్తి

సంఘటన అధ్యక్షులు డాక్టర్ చల్లపల్లి విజయ, ఓపిడిఆర్ ప్రధాన కార్యదర్శి వి. హనుమంతరావు, సిపిఐ(ఎం-ఎల్) నాయకులు ముప్పాళ్ళ భార్గవశ్రీ, రైతుకూలీ సంఘం నాయకులు బి. రఘు, మానవీయ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ కె. శంకర్, ఓపిడిఆర్ జాతీయ కార్యదర్శి సి. భాస్కరరావు, రక్తదాన, అవయవదాన సంఘం సలీం, తెనాలి సిపిఎం నాయకుడు బాబూ ప్రసాద్, యుటిఎఫ్ విశ్రాంత నాయకుడు నల్లమోతు రామారావు, 'బుద్ధభూమి' బొర్రా గోవర్ధన్, గోలి సీతారామయ్య, చార్వాక విద్యాపీఠం టీచర్ యూరిగగారిన్, బుద్ధా స్వతంత్ర భారతి, లాయర్ పి. రాజారావు, విప్లవకార్మిక సంఘం నాయకులు కొండారెడ్డి, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు కూరపాటి కోటేశ్వరరావు, మావో సియాంగ్ తదితరులు తమ అనుభవాలను పంచుకున్నారు. మానవ వికాస వేదిక నాయకులు సాంబశివరావు చార్వాక స్మృతి కవితను చదివి విన్పించగా, కొల్లిపర నుండి వచ్చిన బెన్‌హర్ పాట పాడారు.

**18-6-23న ఒంగోలు** ప్రెస్ క్లబ్‌లో ప్రజా కళాకారుడు, పౌర హక్కులనేత గాండ్ల వెంకటరావు 10వ వర్ధంతి సభ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో జరిగింది. విప్లవ రాజకీయాల స్ఫూర్తితో కళాకారుడుగా అనేక నాటకాల్లో పాల్గొని కళారంగానికి తన వంతు కృషిని కొనసాగిస్తూ అందరినీ కలుపుకొని పోయే వైఖరితో ఉండేవాడు. ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు వర్ధంతిని ప్రతి సంవత్సరం క్రమం తప్పక నిర్వహించి రాజకీయాలకు అతీతంగా అనేకమంది సాహిత్య కళారంగాలకు చెందిన వారిని ఆహ్వానించి ఆ సభలను విజయవంతం చేశారు. పౌర హక్కుల సంఘం నాయకుడిగా అనేక సంఘటనకు సంఘీభావంగా నిలిచారు. కోబ్రాల పేరుతో చంపుతామని హెచ్చరికలు వచ్చినా నిర్భయంగా నిలిచారు. అనేక ప్రజాందోళనలకు కళాకారునిగా మరియు పౌర హక్కుల నాయకునిగా తన సంఘీభావం తెలియజేసే వారని ఈ సభలో పాల్గొన్న జనసాహితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.వి. కృష్ణయ్య తెలియజేశారు. ఈ సభకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరన్న అధ్యక్ష వహించగా ప్రజానాట్యమండలి, ప్రజాకళామండలి మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు.

**24-6-2023న తెనాలి** కవిరాజాపార్కులోని సీనియర్ సిటిజన్స్ భవనంలో 'భిన్నస్వరాలు' అనే సంస్థ ఏర్పాటుచేసిన 'స్వయంసిద్ధ' పుస్తకంపై చర్చా కార్యక్రమానికి ఆ సంస్థ కన్వీనరు రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. 'ఆహ్వానం' లక్ష్మిగారి నివాళిగా ప్రతినెలా సంవత్సరం పాటు నిర్వహించే మంచి పుస్తకంపై చర్చా కార్యక్రమంలో పాల్గొంటూ ఒంటరి మహిళల 40 జీవనగాథలను విశ్లేషిస్తూ ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడారు. ఈ చర్చలో విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, సంకలన కర్తలలో ఒకరైన భండారు విజయ, రచయిత్రి మందరపు హైమవతి, కె.జె.రామారావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చర్చలో పాల్గొంటూ కొత్తపల్లి రవిబాబు ('ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు) ఒక రచయిత్రి, సంపాదకురాలికి నివాళిగా సంవత్సరం పాటు సాహిత్య కార్యక్రమాలు రూపొందించిన 'భిన్న స్వరాలు' సంస్థకు అభినందనలు తెలియచేశారు. ఈ సంకలనంలోని 40 కథల్లో మహిళలు ఏయే కారణాల వల్ల ఒంటరిగా మారుతున్నారో చెప్పారనీ, ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్ మహిళలు, జోగినులు, కృత్రిమ గర్భధారణ చేసే స్త్రీలు, కాల్‌సెంటర్ ఉద్యోగినులు, లేడీ బస్ కండక్టర్‌లు, పారిశుధ్య కార్మికులు మొదలైన వివిధ వృత్తులవారి బాధామయ గాథలున్నా యన్నారు. పురుషాధిక్య సమాజంలో భర్తలు 'ప్రేమపూరితమైన దౌర్జన్య' స్వభావాన్ని ఈ కథలు వివరించాయనీ, కొన్ని కథలు సాధారణంగా వున్నాయనీ చెప్పారు. ●

## ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

## సంపుటి : 16, సంచిక : 12, జులై 1993

**గరిమెళ్ళ** సత్యనారాయణ ముఖచిత్రంతో, ఆయన శతజయంతి సంచికగా వెలువడిన ఈ సంచికలో 'ఉద్యమ కవి గరిమెళ్ళ', 'సత్యాన్ని హత్యచేస్తున్న ప్రభుత్వ బాబా' అనే రెండు సంపాదకీయాల్ని ప్రచురించారు. " 'సత్య' సాయిబాబాను హత్యానేరం కింద అరెస్టు చేయాలి" అనే పత్రికా ప్రకటన, 15 జులై 1993 గరిమెళ్ళ శతజయంతి సందర్భంగా ఛాయరాజ్ రాసిన "రాజ్యమేలుదాము! రారా!" అనే ప్రసంగపాఠాన్నీ, జనసాహితి హైదరాబాదు నగరశాఖ "స్త్రీవాదం – సాహిత్యం" అనే అంశంపై నిర్వహించిన సభలో కాత్యాయనిగారు చేసిన "స్త్రీవాద సాహిత్యం – నడుస్తున్న చర్చ" ప్రసంగవ్యాసాన్ని ప్రచురించారు. పరజ రాసిన "మతోన్మాదాన్ని పదునైన వ్యంగ్యంతో చీల్చి చెండాడిన సాదత్" సాహిత్య వ్యాసాన్నీ, హెచ్చార్కె కవిత్వం "అబద్ధం"పై ఛాయరాజ్ చేసిన సమీక్షనూ, స్వామి రాసిన "ఎవరి వేరు ఎక్కడ?" కథనూ, 'కులమతాలుండాల' అని కత్తుల కాంతయ్య రాసిన వ్యంగ్యాన్నీ ప్రచురించారు. భైరవి రాసిన "మరణిద్దాం అవసరమైతే", పి. శివి రాసిన "భావి శత్రువు", పి.యస్ రమ రాసిన "నెత్తుటి నేల సాక్షిగా", ప్రసేన్ రాసిన "గాజుముక్కలు" చొక్కర తాతారావు రాసిన "నటన జీవితం వేరు వేరు కాదు" కవితలను ప్రచురించారు. పిల్లల ప్రపంచం, ఉత్తరాలు, చైతన్యవాహిని శీర్షికలున్న ఈ సంచిక రెండవ అట్టమీద "ప్రజాసాహితి 'కరువు' ప్రత్యేక సంచిక, ఆగస్టు 93 రచయితలకు ఆహ్వానం" ప్రకటననూ, మూడవ కవరుపేజీలో శోధన్ రాసిన 'సంస్పందన' కవితనూ, నాల్గవ కవరు పేజీలో మిత్ర రాసిన 'డంకెలోన్ని ఎదిరిద్దాం' పాటనూ ప్రచురించారు.

1/8 డెమ్మీలో 64 పేజీలు వెల : రూ.5/- ●




**అవతార పురుషుడు : రచన - షేక్ అబ్దుల్ హకీం జాని**

ఎన్టీరామారావు శతజయంతి కార్యక్రమాన్ని తెనాలిలో 2022 మే 28 నుండి 2023 మే 28 వరకు రోజూ నిర్వహించారు. అదిగాక, అమెరికాలో మానసిక వైద్యునిగా కృషిచేస్తున్న డా॥ బాబు ఆర్. వడ్లమూడి ఆర్థిక, హార్దిక ప్రోత్సాహంతో ప్రసిద్ధ జర్నలిస్టు, పలు పుస్తకాల రచయిత, ఉపాధ్యాయుడు షేక్ అబ్దుల్ హకీం జాని ఎన్టీరామారావు నటనా జీవిత చరిత్ర రచించారు. ఎన్టీ రామారావు ఫొటోలతో 316 పుటలు - 1/4 క్రౌన్ సైజులో వున్న ఈ పుస్తకం జూన్ 2023లో విడుదలైంది. వెల : అమూల్యం. ప్రతులకు : షేక్ అబ్దుల్ హకీం జానీ, 2-33-24, లెనిన్‌రోడ్డు, గాంధీనగర్, తెనాలి - 522201. సెల్ : 99494 29827.

**చీకటి నుండి వెలుతురులోకి : (హేతువాదం సమాజాన్ని ముందుకు నడిపిస్తుంది) - నార్నె వెంకట సుబ్బయ్య రాసిన సంపాదక లేఖాసంపుటి.**

శాస్త్రీయ సమాజం కోసం హేతుదృష్టితో, హేతువాద సంఘం నాయకుడు సంధించిన దాదాపు 200 విశ్లేషణాత్మక లేఖాస్త్రాల సంపుటి ఇది.

సంపాదక లేఖలు అనే ప్రక్రియ వార్తాపత్రికల పుట్టుకతో ఉద్భవించింది. వాటిని ఆయా పత్రికలవారు సంపాదకీయ పుటలో ప్రచురిస్తారు. చాల కొత్త విషయాలు, వినూత్న భావాలు, వ్యక్తీకరించే లేఖలను ఈ శీర్షికలో చూస్తాం. ఇంగ్లీషు పత్రికలకు రాసిన లేఖలను ఇద్దరు, ముగ్గురు లేఖా రచయితలు సంపుటాలుగా ముద్రించుకున్నారు. నేడు తరచుగా డా॥ డి.వి.జి. శంకరరావు (మాజీ పార్లమెంటు సభ్యులు) వివిధ అంశాలపై తెలుగు, ఇంగ్లీషు పత్రికలలో రాస్తున్న సంపాదక లేఖలను చూస్తున్నాం. తెలుగులో సంపాదక లేఖల సంపుటి నార్నె ప్రచురించినదే మొదటిది.

ప్రభుత్వంలో సమాచార పౌరసంబంధాల శాఖ అనే శాఖ వుంది. దీనికి ఒక మంత్రి వుంటారు. ఈ శాఖవారి పని ఏమిటంటే పౌరులు తమ లేఖల ద్వారా తెలియచేసే సమస్యలను, భావాలను కత్తిరించి ఆయా శాఖలవారికి పంపించడం. ఆ లేఖలపై స్పందించిన శాఖలవారి జవాబులను ఆయా పత్రికల వారికి పంపడం. కానీ రెండు మూడు దశాబ్దాలుగా ఈ ప్రక్రియ ఆగిపోయినట్లు కనబడ్తోంది. ఆయా శాఖల వారు ఇచ్చే జవాబులు, వివరణలు ఏ పత్రికలోనూ కనబడటంలేదు.

నార్నె వెంకటసుబ్బయ్య పట్టు విడువని విక్రమార్కుడిలా, ప్రభుత్వ శాఖలు స్పందించకపోయినా తన లేఖాస్త్రాలను వివిధ పత్రికలలో సంధిస్తున్నారు. కేవలం హేతువాద సంబంధించిన విషయాలేగాక, ప్రజల అనేక సమస్యలను తన లేఖలలో ప్రస్తావిస్తున్నారు. ఉదాహరణకు : వాఘా సరిహద్దుల్లో రోజూ ఉదయం, సాయంత్రం చేసే సైనిక పెరేడ్ పొరుగుదేశమైన పాకిస్తాన్‌ను రెచ్చగొట్టే విధంగా వుందనీ, దానిని రద్దుచేయమని కోరారు. పాకిస్తాన్ వైపు కూడా ఇటువంటి పెరేడ్ వుండవచ్చు. నిజంగానే ఆ పెరేడ్ అంత ఖర్చుతో నిర్వహించడం, దానిని చూడటానికి వేలాదిమంది జనం వచ్చి 'దేశభక్తి' ప్రకటించుకోవడం ఎంత అసహ్యకరమైన విషయం!


224 పుటలలో దాదాపు 200ల లేఖలూ, వార్తలు వున్న ఈ పుస్తకానికి / ప్రసిద్ధ హేతువాది డా॥ నరిసెట్టి ఇన్నయ్య తొలిపలుకు రాయగా, విశ్రాంత మున్సిపల్ కమీషనర్ పాలేటి మోహనరెడ్డి ముందుమాట రాశారు.

ఈ లేఖలను 'సూర్య', 'విశాలాంధ్ర', 'ఆంధ్రప్రభ', 'ప్రజాశక్తి', 'ఆంధ్రజ్యోతి' పత్రికలు ప్రచురించాయి.

1/8 డెమ్మీలో వున్న ఈ పుస్తకం ధర : రూ. 150/- ప్రథమ ముద్రణ : జూన్ 2023. ప్రతులకు : మైత్రి, పల్లవి (విజయవాడ), విశాలాంధ్ర, ప్రజాశక్తి, లేదా ఎ.పి. హేతువాదసంఘం. ఫోన్ : 78427 32369.

**(ఇంకా వున్నాయి)**

## మణి బుక్‌స్టాల్ వ్యవస్థాపకులు మణికి జోహార్లు



పుస్తక మణిగా పేరు గాంచిన మణి బుక్‌స్టాల్ వ్యవస్థాపకులైన మణి (పంకజాక్షన్) 16-06-2023న తన 92వ యేట అనారోగ్యంతో అనంతపురం దగ్గర కణేకల్‌లో మరణించారు. ఆయన స్వగ్రామం కేరళలోని కొల్లాం జిల్లా దక్షిణపు పరవూరు.

మణి కేరళలో పుట్టి తమిళనాడు మీదుగా ఆంధ్రకు చేరుకుని అనేక వృత్తులు చేసి, చివరకు పుస్తక విక్రేతగా స్థిరపడ్డారు. ఒక చిన్న బడ్డీకొట్టులోకి పుస్తకాలను చేర్చి, యువకులు, ప్రజాస్వామిక వాదులు, హేతువాద, నాస్తికవాద మిత్రులతో పుస్తక ప్రపంచాన్ని నిర్మించారు. సాదాసీదా వస్త్రధారణతో, సైకిల్ వాహనంపై ఊరూరూ తిరుగుతూ మీటింగులకు వెళ్ళి పుస్తకాలను విక్రయించేవారు. పుస్తకాన్ని పరిచయం చేసి చదవాల్సిన అవసరాన్ని గుర్తింపచేశారు. తను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించటమే జీవితంగా బ్రతికిన మణి, తన చిన్న పుస్తక దుకాణం ద్వారా ప్రజాతంత్ర భావాలను వ్యాప్తి చేశారు. పుస్తక విక్రేతలకు తలమానికగా నిలిచారు. ప్రజాతంత్ర ఉద్యమాలకు సహాయ సహకారాలందించారు.

నాస్తిక, హేతువాద, ప్రజాతంత్ర భావాలు గల పుస్తకాలన్నిటితో పాటు జనసాహితి ప్రచురణలను, 'ప్రజాసాహితి' పత్రికను ప్రచారం చేసిన మణి మాకు అత్యంత ఆప్తుడు, సన్నిహితుడు, స్నేహితుడు. మణిగారి మరణానికి జనసాహితి సంతాపం తెలియచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సహానుభూతి తెలుపుతోంది.

(4వ అట్ట తరువాయి....)

మనం ఉద్యమ స్థాయిలో ఈ విద్వేష పూరిత దాడులను, ఆలోచనలను మొగ్గలోనే తుంచి వేయలేకపోతే భవిష్యత్తులో తెలుగు జాతి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అభ్యుదయవాదులు, ప్రజాస్వామిక వాదులు తులసి చందుగారికి అండగా నిలిచి మతతత్వ శక్తుల చర్యలకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడి సంఘీభావం తెలుపుదాం !!

నేటి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం దాని వెనకనున్న ఆర్థిక రాజకీయ శక్తులు దేశ సంపదలను అడ్డగోలుగా కైంకర్యం చేసే పనిలో ఉన్నాయి! అందుకే అబద్ధాల వాగ్దానాలతో పరమ నిరంకుశ విధానాలతో దేశభక్తి, జాతీయత చాటున పరిపాలన సాగిస్తున్నారు!! గుప్పెడు మంది చేతుల్లో గుత్తాధిపత్యం పెట్టటానికి ఉన్మాదాన్నే మతంగా వ్యాప్తి చేస్తునారు. దేశ ప్రజల నడుమ మతం పేరుతోనూ, అనేక ఇతర రూపాలతోనూ విద్వేషాలను, అనైక్యతను ప్రచారం చేస్తున్నారు. తమ నిత్య జీవన సమస్యల నుండి ప్రజలను పక్కదారి పట్టించే విధానాలను అనుసరిస్తున్నారు. ఇలాంటి పరిపాలనను ప్రశ్నించే, విమర్శించే, వ్యతిరేకించే శక్తులను భయభ్రాంతులను చేయడానికి దాడులకు, బెదిరింపులకు, విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారు.

మతోన్మాద శక్తుల ఫాసిస్టు తరహా ధోరణులను, పోకడలను వ్యతిరేకిస్తూనే తులసి చందు పై జరుగుతున్న ట్రోలింగ్ను మేమందరము ఖండిస్తున్నాం! తులసిచందుకు మా నైతిక మద్దతును అందిస్తున్నాం!! బెదిరింపులతో ఎంతోకాలం రాజకీయాలు సాగించలేరని తెలియజేస్తున్నాం.

ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రత్యేకించి తెలంగాణ, తులసి చందుపై జరుగుతున్న ట్రోలింగ్ ప్రమాదాన్ని సుమో మోటో కేసుగా పరిగణించి, మహిళా రక్షణ చట్టాలను అమలు చేసి నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాము.

## ఇట్లు

కొత్తపల్లి రవిబాబు
జస్టిస్ చంద్రకుమార్
జస్టిస్ కె.జి.శంకర్
కె. రామచంద్రమూర్తి
కె. శ్రీనివాస్
తమ్మారెడ్డి భరద్వాజ
బి. విజయ భారతి
నిఖిలేశ్వర్
కృష్ణాబాయి
కె. శివారెడ్డి
శీలా సుభద్రాదేవి
నందిని సిధారెడ్డి
జయధీర్ తిరుమలరావు
భూపాల్
ప్రొఫెసర్ డి. నర్సింహారెడ్డి
దివికుమార్
అరసవిల్లి కృష్ణ
ఎ.కే. ప్రభాకర్
కె.వి. కూర్మనాథ్,
ఖాదర్ మొహియుద్దీన్
ఎన్. వేణుగోపాల్ - 'వీక్షణం'
డా॥ వళిని
ఎస్. కాత్యాయని
దేవి
కల్లూరి భాస్కరం
ప్రొఫెసర్ రామచంద్రయ్య
ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి

సూర్యసాగర్
కాత్యాయని విద్మహే
డాక్టర్ జతిన్ కుమార్
మహెజబీన్
కె. శోభాదేవి
తోలేటి జగన్మోహన్‌రావు
జైన దేవదాసు.. 'నేటి నిజం'
చంద్రశేఖర్ - హెచ్.ఆర్.ఎఫ్
యం. లక్ష్మి - స్త్రీ విముక్తి సంఘటన
పెనుగొండ లక్ష్మీనారాయణ - అరసం
రివేరా - విరసం
బి. అరుణ - జనసాహితి
సత్యాజీ - సాహితీ స్రవంతి
డా॥ విజయ - స్త్రీ విముక్తి సంఘటన
తరిమెల అమరనాథ్ రెడ్డి
శివలక్ష్మి
బికా బాలాజీ - కలకత్తా
వరుఖుల శివకుమార్
తాడి ప్రకాష్
డా॥ భట్టు లక్ష్మీనారాయణ
తమ్మినేని అక్కిరాజు
కార్టూనిస్ట్ శంకర్
ఆర్టిస్ట్ అన్వర్
ఆర్టిస్ట్ టీపీ
కార్టూనిస్ట్ నర్సింహ
నజీర్ అహ్మద్
జగాష్ విలీ

వెనిగళ్ల వెంకటరత్నం
వాశేశ్వరం శంకరం
విజయ భండారు
ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
ఎస్.ఎ. రెహమాన్
టి.వి. సుబ్బయ్య
ఎస్. సైదారావు, అడ్వకేట్
మోహనరాంప్రసాద్, అడ్వకేట్
జనజ్వాల - సనసర్తి
పింగంపల్లి అశోక్ కుమార్ - శ్రీశ్రీ సాహిత్య నిధి
పి.ఎస్. నాగరాజు - 'ప్రజాసాహితి'
పరుచూరి అజయ్ కుమార్ - అరసం
కె.ఎస్.వి. బోస్ - సంగమం, విజయవాడ,
రాఘవరెడ్డి - భిన్నస్వరాలు, తెనాలి
వార్ని వెంకట సుబ్బయ్య - హేతువాద సంఘం
శాంతకోట సుబ్బారావు, ఎడిటర్, 'విశాలాక్షి'
ఎస్ అంజయ్య - సోషల్ సైన్సెస్ ట్రస్ట్
వి. జగన్నాథరావు - సోషల్ సైన్సెస్ ట్రస్ట్
డా॥ చెలికాని స్టాలిన్ - ప్రజానాట్యమండలి
గుండు నారాయణ - జాషువా కళావేదిక
రౌతు వాసుదేవరావు - ప్రజా కళాకారుల సమాఖ్య
భానుమూర్తి - ఏపీటీఎఫ్
బుడ్డిగ జమీందారు - ప్రోగ్రెసివ్ ఫోరం
వి. హనుమంతరావు - ఒపిడిఆర్

PRAJA SAAHITI July 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 44 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

# జర్నలిస్టు తులసి చందుపై మతోన్మాద శక్తుల, కిరాయి మూకల రాతలను, బెదిరింపులను ఖండిద్దాం!

## తెలుగు రచయితలు, కళాకారులు, మేధావులు, లౌకిక ప్రజాస్వామ్యవాదులు, హేతువాదులు, ప్రజలు అందరం తులసి చందుకు అండగా నిలబడదాం!

ప్రగతిశీల కామ్రేడ్స్!

జర్నలిస్ట్ తులసి చందు, తనపై మతోన్మాద శక్తులు సాగిస్తున్న భయానక నీచ బెదిరింపులను బహిర్గతం చేస్తూ సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేసిన పోస్టింగులను రెండు రోజులుగా చూస్తున్నాం. అవి చదివిన వారెవరైనా రాబోయే ప్రమాదాన్ని శంకించాల్సి ఉంది. మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలలో డాక్టర్ నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, ప్రొఫెసర్ కల్బుర్గి, జర్నలిస్టు గౌరీ లంకేశుల ప్రాణాలను మతోన్మాద శక్తులు బలికొన్న తీరు మనందరి దృష్టిలో ఉంది.



"ఏ దేశ యువతకైనా మత విద్వేషాలు అత్యంత ప్రమాదకరం అని నేను చెప్తున్నందుకు నన్ను ద్వేషిస్తున్నారు, బూతులు తిడుతున్నారు.. నా ఫోటోలు మార్ఫింగ్ చేస్తున్నారు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు." అని తులసి చందు స్వయంగా చెప్పుకున్నారు.

"ఒక్క రాష్ట్రంలో అయినా మతం పేరు చెప్పకుండా ఎందుకు గెలవలేక పోతున్నారు?" అని ప్రశ్నిస్తున్నందుకు ఆమెను బండబూతులతో బెదిరిస్తున్నారు.

"ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం కంటే ఏ దేశానికయినా అత్యంత ప్రమాదకరమైన విషయం మరొకటి ఉండదు," అంటూ ఆమె మతసామరస్యాన్ని బోధించినందుకు సభ్య సమాజం ఉచ్చరించడానికి సిగ్గుపడేవిధంగా మాట్లాడుతున్నారు.

ఉద్దేశ్య పూరితంగా సొంత పేర్లు చెప్పుకోకుండా, ఫేక్ అకౌంట్స్ నుంచి ఘోరమైన కామెంట్స్ చేస్తున్నారని, ఇన్ బాక్స్ మెసేజస్ వస్తున్నాయని తులసి చందు లోకానికి వెల్లడించారు.

నిజానికి తులసి చందు మెయిన్ స్ట్రీమ్ మీడియా మౌనం వహిస్తున్న అనేక వాస్తవాలను తెగించి సమాజం ముందుకు తెస్తున్నారు. తెలంగాణలో ఇథనాల్ ఫ్యాక్టరీ కలిగిస్తున్న నష్టాలపై ఆందోళన చేస్తున్న ప్రజల ఆవేదనలను ప్రపంచానికి వినిపించడం అందులో ఒకటి. ఈ విధమైన వార్తలతో ఆధిపత్యశక్తులకు కంటగింపుగా మారడంతో పాటు అంతర్జాల కిరాయి పోకిరీ గ్యాంగుల బెదిరింపులతో తులసి చందు ఘోరమైన అవమానాలకు గురవుతున్నారు.

మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా హైటెక్ సిబ్బందితో ఆర్ఎస్ఎస్ నెలకొల్పిన అబద్ధాల ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేసే భయంకరమైన అచారిత్రకాలను, అర్ధగోలు ప్రచారాలను, ఊరు పేరు లేని కిరాయి వ్యక్తులతో అన్ని భాషలలో వ్యాప్తిచేస్తున్నారు. సామాజిక మాధ్యమాల నిండా ఈ అబద్ధాలను చదవక తప్పని దుర్మార్గ కాలంలో మనం జీవిస్తున్నాం. దేశంలో ఈ గోబెల్స్ అబద్ధాల ప్రభావానికి ఎక్కువగానే యువత లోనవుతున్న పరిస్థితి నేడు ఉంది. ఈ భయంకర సాంస్కృతిక కాలుష్యాన్ని వ్యాప్తి చేసే మతోన్మాదుల దుష్ప్రచారాలను ప్రశ్నించినా, ఖండించినా, నిరూపించినా ఏదో ఒక రూపంలో బెదిరిస్తున్నారు.

తులసి చందు గురవుతున్న విధంగా, సంస్కారవంతులు ఉచ్చరించలేని బండబూతుల ట్రోలింగ్ ను అనేకమంది మహిళా ఉద్యమ కార్యకర్తలు గతంలో తీవ్రంగా ఎదుర్కొన్నారు. జర్నలిస్టు తులసి చందు ఇప్పుడు అలాంటి దాడులను ఎదుర్కొనే సంస్కారహీన పరిస్థితులు మన ముందుకు వచ్చాయి.

(తరువాయి 3వ అట్టలో...)

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI